www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంక్రాంతి శుభాకాంక్షలు

మంగళవారం | 14-1-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 270 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి తె. 3.21 తదుపరి విదియ; నక్షత్రం: పునర్వసు ఉ. 10.17 తదుపరి పుష్యమి; వర్జ్యం: రా.6.20-7.57; దుర్ముహూర్తం: ఉ.9.04-9.49, రా.10.11-11.01; అమృతఘడియలు: ఉ.7.55-9.29, తె.4.01-5.37; రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం:6.52; సూర్యాస్తమయం: 5.56 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సంక్రాంతి సంబరాలు మన బి న్యూ ఆఫర్స్ తో

B NEW
MOBILES & ELECTRONICS STORE

LUCKY DRAW

ప్రతి మొబైల్ కొనుగోలు పై కచ్చితమైన బహుమతులు లభించును.

UPTO 80%* DISCOUNT ON ACCESSORIES

UPTO 50%* DISCOUNT ON SELECTED MOBILES

BUY ANY SMART PHONE JUST PAY ₹25 GET SMART TV, SOUNDBAR, WATCH, TWS, POWERBANK, EARPHONE

0%* DOWNPAYMENT NO COST EMI

*T&C Apply

BAJAJ FINANCE UPTO 5000* CASHBACK | TVS CREDIT 1 EMI FREE EXCLUSIVE B NEW OFFER | HDB FINANCIAL SERVICES UPTO 11000* CASHBACK

APPLE DAYS — iPhone 13

MOP	₹46,900*
Instant Cash Back	₹1,000*
Old Device Exchannge value	₹20,000*
Trade In Bonus	₹6,000*
Effective Price	₹19,900*

PER DAY ₹27*
*T&C Apply

APPLE DAYS — iPhone 15

MOP	₹69,900*
Instant Cash Back	₹3,000*
Old Device Exchannge value	₹20,000*
Trade In Bonus	₹6,000*
Effective Price	₹40,900*

PER DAY ₹56*
*T&C Apply

APPLE DAYS — iPhone 16

MOP	₹76,900*
Instant Cash Back	₹4,000*
Old Device Exchannge value	₹20,000*
Trade In Bonus	₹6,000*
Effective Price	₹46,900*

PER DAY ₹65*
*T&C Apply

APPLE DAYS — iPhone 16 Plus

MOP	₹86,900*
Instant Cash Back	₹4,000*
Old Device Exchannge value	₹20,000*
Trade In Bonus	₹6,000*
Effective Price	₹56,900*

PER DAY ₹79*
*T&C Apply

APPLE DAYS — iPhone 16 Pro

MOP	₹1,16,900*
Instant Cash Back	₹3,000*
Old Device Exchannge value	₹20,000*
Trade In Bonus	₹6,000*
Effective Price	₹87,900*

PER DAY ₹122*
*T&C Apply

APPLE DAYS — iPhone 16 Pro Max

MOP	₹1,41,900*
Instant Cash Back	₹3,000*
Old Device Exchannge value	₹20,000*
Trade In Bonus	₹6,000*
Effective Price	₹1,12,900*

PER DAY ₹156*
*T&C Apply

SMART TV'S
mi ZEBRONICS
UPTO 7000* INSTANT DISCOUNT + UPTO 7000* HDFC BANK CASHBACK
STARTING FROM ₹8,999
*T&C Apply

LAPTOPS
hp DELL Lenovo ASUS AXL
i3 | i5 | i7
FREE BAG + aha 1 YEAR SUBSCRIPTION
STARTING FROM ₹30,999
*T&C Apply

SAMSUNG
A55 | A35 | A16 | A06 A05 | S24 Series
UPTO 10%* CASHBACK + JUST PAY ₹25 SMART TV worth of + SOUNDBAR
worth of ₹33,998
Starting from ₹7,999*
*T&C Apply

oppo Reno 13 5G
NEW ARRIVAL
JUST PAY ₹25
BT SPEAKER + NECKBAND + BAG worth ₹7998 OR FIREBOLTT APOLLO 2 AMOLED SMARTWATCH worth ₹12999
Starting from ₹37,999*
*T&C Apply

Hapi Pola BT Speaker + Neckband + Bag
COMBO OFFER
MRP ₹7,998
FESTIVE PRICE ₹1,599

DEMO CLEARANCE SALE
UPTO 50% DISCOUNT
vivo SAMSUNG mi realme oppo

vivo
X200 5G | Y300 5G V40 | Y18
UPTO 10%* CASHBACK + PARTY STAR II BT SPEAKER WITH MIC (30W) worth of ₹6,999 JUST PAY ₹25
Starting from ₹7,999*
*T&C Apply

realme
realme 13 | 14x | C61 C63 | C65
UPTO 1000* CASHBACK + JUST PAY ₹25 TWS + FLASHGARD worth ₹3,999
Starting from ₹6,999*
*T&C Apply

బి న్యూ
MOBILES & ELECTRONICS STORE

ట్రెండ్ సెట్ పక్కన, MG రోడ్, విజయవాడ. | రామ మందిరం ఎదురుగా, ఏలూరు రోడ్, విజయవాడ.
మసీద్ స్ట్రీట్, ఏలూరు రోడ్, విజయవాడ. | పార్క్ రోడ్డు, మార్కెట్ సెంటర్ దగ్గర, గుడివాడ.
రవి స్వీట్స్ & బేకరీ పక్కన, జంట హోల్ సెంటర్, మెయిన్ రోడ్, తిరువూరు.

HELPLINE NO: 040 48491111
www.bnewmobiles.com

ఆంధ్రజ్యోతి
బిజినెస్
విజయవాడ ● మంగళవారం 14 జనవరి 2025

మార్కెట్లలో చమురు మంటలు

4 రోజుల్లో రూ.25 లక్షల కోట్లు ఫట్

ఒక్కరోజే రూ.12.61 లక్షల కోట్లు ఆవిరి

సెన్సెక్స్ మరో 1,049 పాయింట్లు డౌన్

ముంబై: దలాల్‌స్ట్రీట్ మళ్లీ బేర్‌మంటోంది. ఈక్విటీ సూచీలు వరుసగా నాలుగో రోజు కూడా నష్టపోయాయి. సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ మరో 1,048.90 పాయింట్లు క్షీణించి 76,330.01 వద్దకు జారుకుంది. దాంతో సూచీ 77,000 కీలక స్థాయిని కూడా కోల్పోయింది. నిఫ్టీ 345.55 పాయింట్లు పతనమై 23,085.95 వద్ద ముగిసింది. అమ్మకాల హోరులో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ ఒక్కరోజే రూ.12.61 లక్షల కోట్లు తగ్గింది. గడిచిన నాలుగు సెషన్లలో ఇది రూ.24.69 లక్షల కోట్లు తగ్గి రూ.417.06 లక్షల కోట్లకు (4.82 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. నాలుగు రోజుల్లో సెన్సెక్స్ 1,869.1 పాయింట్లు కోల్పోయింది.

● సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో నాలుగు మినహా అన్నీ నష్టపోయాయి. జొమాటో షేరు 6.52 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. పవర్‌గ్రిడ్, అదానీపోర్ట్స్ 4 శాతానికి పైగా పతనమవగా.. టాటాస్టీల్, ఎన్‌టీపీసీ, టాటా మోటార్స్ 3 శాతానికి పైగా మార్కెట్ విలువను కోల్పోయాయి.

● చిన్న, మధ్య స్థాయి కంపెనీల్లో అమ్మకాల ఒత్తిడి తీవ్రతరమైంది. దాంతో బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 4.17 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 4.14 శాతం నష్టపోయాయి. రంగాలవారీ సూచీలన్నీ నెగిటివ్‌గానే ముగిశాయి. రియల్టీ అత్యధికంగా 6.59 శాతం పతనమవగా.. యుటిలిటీస్, సర్వీసెస్, పవర్, ఇండస్ట్రియల్స్, కన్స్యూమర్ డిస్‌క్రెషనరీ సూచీలు 4 శాతానికి పైగా నష్టపోయాయి.

● గత శుక్రవారం విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) నికరంగా రూ.2,254.68 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. ఈ నెలలో ఇప్పటివరకు రూ.22,194 కోట్ల పెట్టుబడులను నికరంగా వెనక్కి తీసుకున్నారు.

పతనానికి కారణాలివే..

డిసెంబరులో అమెరికాలో ఉద్యోగాల కల్పన బలంగా పుంజుకోవడంతో ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాది వడ్డీరేట్లను గతంలో అంచనా వేసిన స్థాయిలో తగ్గించకపోవచ్చన్న ఆందోళనలతో యూఎస్ సహా ప్రపంచ మార్కెట్లలో ఈక్విటీల అమ్మకాలు పోటెత్తాయి. ముడిచమురు ధరలు మళ్లీ ఎగబాకుతుండటం, రూపాయి భారీ క్షీణత, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తరలిపోతుండటం కూడా ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత కుంగదీశాయి.

స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్‌కు 17% లిస్టింగ్ లాభం

ప్రతికూలతలో సైతం సోమవారం లిస్టయిన స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ మాత్రం ఇన్వెస్టర్లకు రెండంకెల లాభాలు పంచింది. ఐపీఓ ధర రూ.140తో పోలిస్తే బీఎస్ఈలో కంపెనీ షేరు 16.67 శాతం లాభంతో రూ.163.35 వద్ద ముగిసింది. ఈ ఇష్యూ 182.57 రెట్లు ఓవర్ సబ్‌స్క్రయిబ్ అయింది.

అంతర్జాతీయ విపణిలో క్రూడాయిల్ ధరల పెరుగుదల ప్రపంచ మార్కెట్లలో కల్లోలం సృష్టిస్తోంది. అమెరికా, యూరప్, ఆసియా మార్కెట్లన్నీ నష్టాల్లోనే ట్రేడ్ కావడంతో ఆ ప్రభావం దేశీయ ఈక్విటీ, ఫారెక్స్ మార్కెట్లపై ప్రసరించింది. వరుసగా నాలుగో రోజు కూడా ఈక్విటీ మార్కెట్ భారీ నష్టాలు నమోదు చేయగా డాలర్ మారకంలో రూపాయి విలువ రెండేళ్ల కాలంలో కనివిని ఎరుగని రీతిలో 66 పైసలు పడిపోయింది.



రూపాయి ధమాల్

ఒక్కరోజే 66 పైసలు డౌన్

రెండేళ్లలో ఇదే అతిపెద్ద పతనం

భారత కరెన్సీ సరికొత్త జీవనకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. అమెరికన్ డాలర్‌తో రూపాయి మారకం విలువ సోమవారం ఏకంగా 66 పైసలు క్షీణించి రూ.86.70 వద్ద ముగిసింది. దాదాపు రెండేళ్లలో రూపాయికిదే అతిపెద్ద క్షీణత. డాలర్ క్రమంగా బలపడుతుండటంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు వేగంగా పెరుగుతుండటం ఇందుకు ప్రధాన కారణమని ఫారెక్స్ వర్గాలు వెల్లడించాయి. ఈక్విటీల నుంచి విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులను తరలిస్తుండటం కూడా రూపాయిపై ఒత్తిడి పెంచింది. గత శుక్రవారం డాలర్-రూపాయి మారకం విలువ 18 పైసల నష్టంతో రూ.86.04 వద్ద ముగిసింది. దాంతో పోలిస్తే సోమవారం రూపాయి 8 పైసల నష్టంతో రూ.86.12 వద్ద ప్రారంభమైంది. వెంటనే కాస్త కుదురుకుని రూ.86.11 వద్దకు బలపడినప్పటికీ, డాలర్ల కోసం ట్రేడర్లు ఎగబడటంతో ఇంట్రాడేలో నష్టాలు భారీగా పెరిగాయి. చివరికి 66 పైసలు తగ్గి రూ.86.70 వద్ద స్థిరపడింది. 2023 ఫిబ్రవరి 6న నమోదైన 68 పైసల నష్టం తర్వాత రూపాయికిదే అతిపెద్ద పతనం. గత ఏడాది చివరినాటికి రూ.85.52గా ఉన్న మారకం విలువ.. గడిచిన రెండు వారాల్లో 118 పైసలు క్షీణించింది.

ముమ్ముందు మరింత క్షీణత..!

డాలర్ దెబ్బకు రూపాయి మరింత క్షీణించవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ముమ్ముందు మారకం విలువ రూ.86.25-86.80 శ్రేణిలో కదలాడవచ్చని మిరే అసెట్ షేర్‌ఖాన్ రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరి అభిప్రాయపడ్డారు.

ఎగుమతిదారులకు ప్రయోజనం పరిమితమే..

రూపాయి విలువ భారీగా క్షీణించినప్పటికీ మన ఎగుమతిదారులకు కలిగే ప్రయోజనం పరిమితమేనని విశ్లేషకులంటున్నారు. మన ఎగుమతిదారులు వస్తు తయారీకి అవసరమైన ముడిసరుకుల కోసం అధికంగా దిగుమతులపైనే ఆధారపడుతుండటం ఇందుకు కారణమన్నారు. రూపాయి పతనం కారణంగా దిగుమతి వ్యయం పెరగడంతో అంతగా ప్రయోజనం లభించడం లేదన్నారు.

అంతా అమెరికా వల్లే..

ఈ నెల 20న అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న డొనాల్డ్ ట్రంప్ పలు దేశాలపై వాణిజ్యపరమైన ఆంక్షలు విధిస్తానని హెచ్చరించడంతో అంతర్జాతీయంగా దిగుమతిదారుల నుంచి డాలర్‌కు డిమాండ్ పెరుగుతూ వస్తోంది. తాజాగా అమెరికా మార్కెట్ గత నెలలో కొత్తగా 2..56 లక్షల కొత్త ఉద్యోగాలను సృష్టించగలిగింది. మార్కెట్ విశ్లేషకులు అంచనా వేసిన 1.55 లక్షల ఉద్యోగాల కంటే ఇది చాలా అధికం. జాబ్ మార్కెట్ బలంగా పుంజుకోవడంతో అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాది వడ్డీరేట్లను గతంలో ఆశించిన స్థాయిలో తగ్గించకపోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామంతో డాలర్ విలువతోపాటు యూఎస్ బాండ్ల రేట్లు మరింత పెరిగాయి. ఆరు అంతర్జాతీయ కరెన్సీలతో పోలిస్తే, డాలర్ ఇండెక్స్ మరో 0.29 శాతం పెరిగి 109.80కి చేరింది. 10 ఏళ్ల కాలపరిమితి గల యూఎస్ బాండ్ల రేటు సైతం 0.48 శాతం పెరిగి 2023 అక్టోబరు నాటి గరిష్ఠ స్థాయి 4.79 శాతానికి ఎగబాకింది. కాగా, రష్యా ముడిచమురుపై అమెరికా మరిన్ని ఆంక్షలు విధించడంతో బ్రెంట్ క్రూడాయిల్ రేటు 4 నెలల గరిష్ఠ స్థాయి 80 డాలర్లకు చేరింది. సోమవారం ఒకదశలో 80.74 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. దాంతో చమురు దిగుమతిదారులు పెద్ద ఎత్తున డాలర్ల కొనుగోళ్లకు పాల్పడ్డారని ఫారెక్స్ వరాలు తెలిపాయి. గత కొన్నివారాలుగా విదేశీ మారకం నిల్వలు గణనీయంగా తగ్గుతూ వస్తున్న నేపథ్యంలో ఆర్‌బీఐ జోక్యం చేసుకోకపోవడం కూడా రూపాయి భారీ క్షీణతకు మరొక కారణమని వారన్నారు.

హెచ్‌సీఎల్ టెక్ లాభం రూ.4,591 కోట్లు

» ఒక్కో షేరుపై రూ.18 డివిడెండ్

న్యూఢిల్లీ: ఐటీ కంపెనీ హెచ్‌సీఎల్ టెక్ డిసెంబరు త్రైమాసికంలో రూ.29,890 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.4,591 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 5.07 శాతం, నికర లాభం 5.5 శాతం పెరిగాయి. సెప్టెంబరు త్రైమాసికంతో పోలిస్తే మాత్రం లాభాలు 8.4 శాతం, ఆదాయం 3.56 శాతం పెరిగినట్లు కంపెనీ సీఈఓ విజయ కుమార్ చెప్పారు. ఈ ఏడాదికి ఆదాయ వృద్ధిరేటు అంచనాలను సైతం కంపెనీ 3.5-5 శాతం నుంచి 4.5-5 శాతానికి పెంచింది. డిజిటల్, ఏఐ ఆధారిత సేవలు క్యూ3లో కంపెనీ ఆదాయ, లాభాలకు దోహదం చేశాయి.

ప్రత్యేక డివిడెండ్: కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.18 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. ఇందులో రూ.6 ప్రత్యేక డివిడెండ్ అని తెలిపింది. కంపెనీ క్యూ3 ఆర్థిక ఫలితాలు బాగున్నా బీఎస్ఈలో ఈ షేరు 0.56 శాతం నష్టంతో రూ.1,985.25 వద్ద ముగిసింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	80,070 ▲	73,400 ▲	1,02,000 ▲
విజయవాడ	81,000 ▲	76,500 ▲	92,500 ▼
విశాఖపట్నం	78,470 ▼	71,930 ▼	90,660 ▼
రాజమండ్రి	79,800 ▲	73,150 ▲	92,700 ▲
ప్రొద్దుటూరు	79,750 ▲	73,850 ▲	93,000 ▼
ముంబై	78,310 ▲	71,730 ▲	89,800 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



14వ తేదీ			
హైదరాబాద్	490	విజయవాడ	515
వరంగల్	492	గోదావరి	515
చిత్తూరు	523	విశాఖపట్నం	520
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	121
వరంగల్	107	గుంటూరు	120
కరీంనగర్	107	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	92
కర్నూలు	107	నెల్లూరు	97
విశాఖపట్నం	117	అనంతపురం	97
గోదావరి	121		

జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ రూ.4,000 కోట్ల ఐపీఓకు సెబీ ఆమోదం

జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ రూ.4,000 కోట్ల ఐపీఓకు సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓలో భాగంగా రూ.2,000 కోట్ల తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రస్తుత ఇన్వెస్టర్లకు చెందిన రూ.2,000 కోట్ల విలువైన షేర్లను సైతం అమ్మకానికి పెట్టనున్నట్లు సెబీకి ఇప్పటికే దాఖలు చేసిన పత్రాల్లో కంపెనీ వెల్లడించింది.

● వైండింగ్ అండ్ కండక్టివిటీ ఉత్పత్తుల తయారీదారు విద్య వైర్స్ ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి దరఖాస్తు సమర్పించింది. పబ్లిక్ ఆఫరింగ్ ద్వారా కంపెనీ రూ.320 కోట్ల తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రమోటర్లకు చెందిన కోటి షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది.

హైదరాబాద్‌లో గోద్రెజ్ ప్రాపర్టీస్ ప్రాజెక్టు

» రూ.1300 కోట్ల ఆదాయంపై గురి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రియల్ ఎస్టేట్ రంగంలోని గోద్రెజ్ ప్రాపర్టీస్ కంపెనీ హైదరాబాద్‌లో తొలి రెసిడెన్షియల్ ప్రాజెక్టును ప్రారంభించింది. రెగ్యులేటరీ సంస్థలకు పంపిన సమాచారంలో కంపెనీ ఈ విషయం తెలిపింది. హైదరాబాద్‌లో వ్యూహాత్మకంగా కీలకమైన కోకాపేట్ ప్రాంతంలో 3 ఎకరాల విస్తీర్ణంలో "గోద్రెజ్ మాడిసన్ అవెన్యూ" పేరిట చేపట్టిన ఈ ప్రాజెక్టులో మొత్తం 12 లక్షల చదరపు అడుగుల స్థలం అమ్మకానికి ఉంటుంది. దీని బుకింగ్ విలువ రూ.1,300 కోట్లుంటుందని అంచనా వేస్తోంది. ఈ ప్రాజెక్టులో 3, 4 బెడ్‌రూమ్ ఫ్లాట్లు అందుబాటులో ఉంటాయి. మంచి వృద్ధి అవకాశాలున్న హైదరాబాద్‌లో ఇది తమ తొలి ప్రీమియం రెసిడెన్షియల్ ప్రాజెక్టు అని కంపెనీ ఎండీ, సీఈఓ గౌరవ్ పాండే తెలిపారు. మన్‌హటన్ తరహా లాండ్‌స్కేప్‌లతో ఈ ప్రాజెక్టు ఆధునిక జీవనశైలికి అనుగుణంగా ఆకర్షణీయంగా ఉంటుందన్నారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, అగ్రశ్రేణి విద్యా సంస్థలు, ప్రీమియం రిటైల్, హెల్త్ కేర్ వసతులకు చక్కటి కనెక్టివిటీ కలిగి ఉంటుంది.

అరాజెన్‌కు రూ. 860 కోట్ల నిధులు

హైదరాబాద్ (బిజినెస్ బ్యూరో): కాంట్రాక్ట్ రీసెర్చ్, డెవలప్‌మెంట్, తయారీలోని అరాజెన్ ప్రైవేట్ ఈక్విటీసంస్థ క్వాడ్రియా కేపిటల్ నుంచి 10 కోట్ల డాలర్ల (రూ.860 కోట్లు) నిధులు సమీకరించింది. ఇందుకుగాను అరాజెన్‌లో 140 కోట్ల డాలర్ల విలువ గల మైనారిటీ వాటాలు క్వాడ్రియాకు లభిస్తాయి. ప్రస్తుత ఇన్వెస్టర్లు తమ వాటాల్లో కొంత శాతం విక్రయించడం ద్వారా ఈ నిధులు సమీకరించినట్లు కంపెనీ తెలిపింది. అమెరికా, యూరప్‌ల నుంచి పెరుగుతున్న ఔట్‌సోర్సింగ్ అవసరాలకు దీటుగా తమ సామర్థ్యాలు విస్తరించుకునేందుకు, మౌలిక వసతుల అభివృద్ధికి ఈ నిధులు ఉపయోగపడతాయని అరాజెన్ లైఫ్ సైన్సెస్ సీఈఓ మన్ని కంటిపూడి అన్నారు. అరాజెన్‌లో గోల్డ్‌మన్ శాచ్ తర్వాత రెండో వ్యూహాత్మక ఇన్వెస్టర్ క్వాడ్రియా అవుతుంది.

స్పోర్ట్స్

రాయుడి కెరీర్‌కు విలన్.. విరాట్!



వరల్డ్‌కప్‌లో చోటు దక్కకుండా అడ్డుకొన్నాడు

బాంబు పేల్చిన ఊతప్ప

కోహ్లి కంటే రోహిత్ గొప్ప కెప్టెన్



న్యూఢిల్లీ: వరల్డ్‌కప్‌లో ఆడాలనేది ఏ ఆటగాడికైనా జీవిత కల. తెలుగు క్రికెటర్ అంబటి రాయుడుకు ఆ అవకాశం అందినట్టే అంది చేజారింది. అయితే, 2019 వరల్డ్‌కప్ జట్టులో రాయుడుకు చోటు దక్కకపోవడానికి కోహ్లీనే కారణమని టీమిండియా మాజీ ఆటగాడు రాబిన్ ఊతప్ప బాంబు పేల్చాడు. విరాట్‌కు ఎవరైనా నచ్చకపోతే.. ఇక అంతేనంటూ ఓ ఇంటర్వ్యూలో సంచలన విషయాలు బహిర్గతం చేశాడు. రాయుడు ఇంటికి జెర్సీలు, కిట్‌బ్యాగ్‌లు కూడా చేరాయని తెలిపాడు. 'కోహ్లీ ఎవరినైనా వద్దనుకొంటే ఇక వారి కెరీర్ నాశనమే. అందుకు రాయుడే ప్రత్యక్ష ఉదాహరణ. అతనికి జరిగిన దానికి సానుభూతి తెలపాలి. వరల్డ్ కప్ జెర్సీలు, కిట్ బ్యాగులు కూడా రాయుడు ఇంటికి చేరాయంటే టీమ్‌లో చోటు ఖాయమనేగా. అలాంటి సమయంలో జట్టులో చోటు లేదంటే ఏఆటగాడైనా ఎలా తట్టుకోగలడు. ఇలా మరొకరికి ఎప్పుడూ జరగకూడదు. ఒక వ్యక్తి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాడ'ని ఊతప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. 2019 వరల్డ్‌కప్ టీమ్ ఎంపిక ముందు డ్రామా చోటు చేసుకొంది. రాయుడికి జట్టులో చోటు ఖాయమని అందరూ భావిస్తుండగా.. హఠాత్తుగా విజయ్ శంకర్‌ను టీమ్‌లోకి తీసుకొన్నారు. దీనిపై అంబటి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. అయితే, రాయుడికి టీమ్‌లో స్థానం లభించకపోవడానికి అప్పటి చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ కారణమన్న విమర్శలు కూడా వచ్చాయి. కానీ, అసలు విలన్ కోహ్లీ అని ఊతప్ప ఇప్పుడు బయటపెట్టాడు. అప్పట్లో ఎమ్మెస్కే కూడా ఈ విషయమై మాట్లాడాడు. జట్టు ఎంపికలో తానొక్కడినే ఉండనని, మిగతా సెలెక్టర్లతోపాటు జట్టు కెప్టెన్ కూడా తన అభిప్రాయాన్ని చెబుతాడని ప్రసాద్ వెల్లడించాడు.

కెప్టెన్సీ విషయంలో కోహ్లీకి, రోహిత్ శర్మకు మధ్య తేడాని కూడా విడమర్చి చెప్పాడు. 2024 టీ20 వరల్డ్‌కప్ ఫైనల్లో సంజూ శాంసన్‌కు తుది జట్టులో చోటు పక్కా అని అనుకున్నారు. కానీ, టాస్‌కు 10 నిమిషాల ముందు శివమ్ దూబేను జట్టులోకి తీసుకొన్నారు. ఆ సమయంలో శాంసన్‌తో రోహిత్ మాట్లాడిన విధానం తనకు నచ్చిందని రాబిన్ చెప్పాడు. ఇద్దరి సారథ్యాల్లో తేడా ఇదేనని స్పష్టం చేశాడు. అందుకే తాను రోహిత్‌ను గొప్ప నాయకుడిగా భావిస్తానని చెప్పాడు.

చాపెల్‌కు సీనియర్లతో ఎప్పుడూ గొడవలే..: కోచ్‌గా గ్రెగ్ చాపెల్ హయాంలో జట్టులో ఎప్పుడూ అలజడి వాతావరణం నెలకొని ఉండేదని ఊతప్ప తెలిపాడు. 'భారత ఆటగాళ్లలో ఫిట్‌నెస్ లోపాన్ని చాపెల్ గుర్తించాడు. ఆస్ట్రేలియా ఆటగాళ్ల మాదిరిగా జట్టు ఫిట్‌నెస్‌ను పెంచాలనుకొన్నాడు. కానీ, జట్టులోని కొందరు సీనియర్లకు ఆ విషయాన్ని సమర్థంగా చెప్పలేక పోవడం గొడవలకు దారితీసింది. పైగా, తను అనుకొన్నట్టు సాగకపోతే.. డ్రెస్సింగ్ రూమ్ విషయాలను కూడా చాపెల్ లీక్ చేసేవాడ'ని రాబిన్ తెలిపాడు. కాగా యువరాజ్ కెరీర్ ముగియడానికి కూడా కోహ్లీనే కారణమని రెండు రోజుల క్రితం ఊతప్ప చెప్పిన సంగతి విదితమే. క్యాన్సర్‌నుంచి బయటపడిన యువరాజ్‌ను ఫిట్‌నెస్ విషయంలో కోహ్లీ ఇబ్బందిపెట్టేవాడని, తనతో సమానంగా అందరూ ఫిట్‌గా ఉండాలని అనేవాడని ఊతప్ప ఆరోపించాడు.



భారత్ బోణీ

● నేపాల్‌పై గెలుపు ● ఖో-ఖో వరల్డ్‌కప్

న్యూఢిల్లీ: ఖో-ఖో వరల్డ్‌కప్‌లో భారత్ శుభారంభం చేసింది. సోమవారం హోరాహోరీగా జరిగిన గ్రూప్-ఎ తొలి మ్యాచ్‌లో భారత్ 42-37తో నేపాల్‌పై గెలిచింది. తొలి టర్న్‌లో భారత్ 24 పాయింట్లు సాధించగా.. రెండో టర్న్‌లో నేపాల్ 20 పాయింట్లు స్కోరు చేసింది. ఇక మూడో టర్న్‌లో భారత్ 18 పాయింట్లు దక్కించుకోగా.. నాలుగో టర్న్‌లో నేపాల్ 16 పాయింట్లు మాత్రమే సాధించింది.



భారత అమ్మాయిల మార్చ్‌పాస్ట్

ఇందిరా గాంధీ స్టేడియంలో తొలి ఖో-ఖో వరల్డ్‌కప్ ఆరంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కడ్ జ్యోతి వెలిగించి టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, ఏరియల్ డ్యాన్స్‌లు ఆకట్టుకొన్నాయి. టోర్నీలో తలపడే జట్లు మార్చ్‌పాస్ట్‌లో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో కేంద్ర క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవ్య, సహాయ మంత్రి రక్షా ఖడ్సే, ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష, ఎంపీ రాజీవ్ శుక్లా, భారత ఖో-ఖో సంఘం అధ్యక్షుడు సుధాన్షు మిట్టల్, గ్రేట్ ఖలి తదితరులు పాల్గొన్నారు.



మళ్లీ బరిలో సింధు

నేటినుంచి ఇండియా ఓపెన్

తలపడనున్న అంతర్జాతీయ స్టార్లు

న్యూఢిల్లీ : భారత్‌తోపాటు చైనా, జపాన్, డెన్మార్క్, దక్షిణ కొరియా వంటి బలమైన దేశాలు..200 మందికి పైగా షట్లర్లు వారంపాటు బ్యాడ్మింటన్ అభిమానులను అలరించనున్నారు. మంగళవారం ఇక్కడ ప్రారంభమయ్యే ఇండియా ఓపెన్ సూపర్ 750 టోర్నీలో భారత్ ఏకంగా 46 మందితో బరిలోకి దిగుతోంది. ఒలింపిక్ చాంపియన్లు అక్సెల్‌సెన్, అన్ సె యంగ్ కూడా తలపడుతుండడంతో టోర్నమెంట్ మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఆతిథ్య జట్టునుంచి పీవీ సింధుపై అందరి దృష్టీ నిలిచింది. గత ఏడాది పెద్దగా రాణించలేకపోయిన రెండుసార్లు ఒలింపిక్స్ పతక విజేత సింధు ఇటీవల వివాహబంధంలోకి అడుగుపెట్టింది. దాంతో ఈ సీజన్ తొలి టోర్నమెంట్ మలేసియా ఓపెన్‌లో పాల్గొనలేదు. పెళ్లయ్యాక మొదటిసారి పోటీల బరిలోకి దిగుతున్న ఆమె తొలి రౌండ్‌లో యున్ సంగ్ (తైపీ)తో తలపడనుంది. పురుషుల డబుల్స్‌లో స్టార్ జోడీ సాత్విక్/చిరాగ్‌పై అందరిదృష్టీ నిలవనుంది. సింగిల్స్‌లో లక్ష్యసేన్-చున్ ఈతో, కిడాంబి శ్రీకాంత్-హాంగ్ యాంగ్‌తో టోర్నీని ఆరంభిస్తారు. మహిళల డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా జాలీ-అరిసా/అయాకోను ఢీకొంటారు.

గౌతీ ఓటు యశస్వికే!

పంత్ కావాలంటున్న అగార్కర్

భవిష్యత్ కెప్టెన్ ఎంపిక వ్యవహారం





న్యూఢిల్లీ: ఆశించిన స్థాయిలో రాణించలేక పోతున్న రోహిత్ శర్మను సారథ్య బాధ్యతల నుంచి తప్పించేందుకు బీసీసీఐ సన్నద్ధమవుతోంది. అయితే, అతడి తర్వాత జట్టు పగ్గాలను ఎవరికి అప్పగించాలన్నది పెద్ద సమస్యగా మారింది. కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేస్తే..అతనికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆస్ట్రేలియా పర్యటనపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో రోహిత్ బీసీసీఐకి తేల్చి చెప్పాడని సమాచారం. ఈ నేపథ్యంలో వన్డే ఫార్మాట్‌లో జరిగే చాంపియన్స్ ట్రోఫీ వరకు హిట్‌మ్యాన్‌నే సారథిగా కొనసాగించే అవకాశాలున్నాయి. కానీ, భవిష్యత్ కెప్టెన్ విషయంలోనే గందరగోళం నెలకొంది. బుమ్రాకు పూర్తిస్థాయిలో బాధ్యతలు అప్పగించడానికి బోర్డు సుముఖంగానే ఉందట. కానీ, అతడి ఫిట్‌నెస్‌ను దృష్టిలో ఉంచుకొని సమర్థుడైన వైస్ కెప్టెన్ ఉండాలని భావిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో రిషభ్ పంత్‌ను భవిష్యత్ టెస్ట్ కెప్టెన్‌గా అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ సూచిస్తుండగా.. కోచ్ గౌతమ్ గంభీర్ మాత్రం యశస్వీ జైస్వాల్‌కు మద్దతు తెలుపుతున్నాడట. దీంతో అగార్కర్, గౌతీ మధ్య ఢీ అంటే ఢీ అనే పరిస్థితులు నెలకొన్నాయని సమాచారం.

ఆర్చరీ ప్రపంచకప్ జట్టులో సురేఖ, చికిత, ధీరజ్



న్యూఢిల్లీ: ఆర్చరీ వరల్డ్‌కప్ జట్టులో జ్యోతి సురేఖకు మరోసారి చోటు దక్కింది. ఏప్రిల్‌లో ఫ్లోరిడా, మేలో షాంఘైలో జరిగే స్టేజ్ 1, 2 వరల్డ్‌కప్‌ల కోసం కోల్‌కతాలో నిర్వహించిన సెలెక్షన్ ట్రయల్స్‌లో సురేఖ సహా ముగ్గురు తెలుగు ఆర్చర్లు అర్హత సాధించారు. భారత మహిళల కాంపౌండ్ జట్టులో సురేఖ, పెద్దపల్లికి చెందిన తానిపర్తి చికిత.. పురుషుల రికర్వ్ విభాగంలో విజయవాడకు చెందిన ధీరజ్ బొమ్మదేవరకు స్థానాలు లభించాయి. సురేఖ 15వ ఏడాది దేశానికి ప్రాతినిథ్యం వహిస్తుండడం విశేషం.

బసవారెడ్డి భయపెట్టాడు!



చెమటోడ్చిన జొకోవిచ్

సిన్నర్, స్వియటెక్ సునాయాసంగా..

ఆస్ట్రేలియన్ ఓపెన్



మెల్‌బోర్న్ : తన ఆరాధ్య ఆటగాడు, పైగా అతడో దిగ్గజం..అలాంటి ప్రత్యర్థితో గ్రాండ్‌స్లామ్ అరంగేట్ర మ్యాచ్ అంటే ఎంతో ఉద్వేగం, ఉత్కంఠ ఉంటుంది..కానీ తెలుగు మూలాలున్న 19 ఏళ్ల అమెరికన్ నిషేష్ బసవారెడ్డి ఆ ఒత్తిడి ఛాయలను ఏమాత్రం దరి చేరనివ్వలేదు..పైగా బెరుకులేని ఆటతో ప్రత్యర్థికి ముచ్చెమటలు పట్టించాడు. తొలి సెట్ గెలిచి సవాలు విసిరాడు. ఫలితంగా మ్యాచ్ నాలుగు సెట్లపాటు సాగింది. దాంతో సోమవారం జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ సింగిల్స్ మొదటి రౌండ్‌ను అధిగమించేందుకు 10 సార్లు చాంపియన్ నొవాక్ జొకోవిచ్ పోరాడాల్సి వచ్చింది.

ఆల్‌రౌండ్ ఆటతో..: జొకోవిచ్‌తో బసవారెడ్డి మ్యాచ్‌ను టెన్నిస్ పండితులంతా ఏకపక్షమని తేల్చేశారు. కానీ అమెరికా కుర్రోడు ఏకంగా మూడు గంటలపాటు చూపిన తెగువ, పోరాట పటిమతో జొకో 4-6, 6-3, 6-4, 6-2తో కానీ మ్యాచ్ నెగ్గలేకపోయాడు. బలమైన సర్వీసులు, వేగవంతమైన ఏస్‌లు, తెలివైన షాట్లతో జొకోను ముప్పుతిప్పలు పెట్టిన నిషేష్ తొలి సెట్‌ను సొంతం చేసుకొని ప్రత్యర్థికి షాకిచ్చాడు. పదునైన ఆటతో రెండో సెట్ ఆరంభంలోనూ నొవాక్‌ను ఇబ్బందిపెట్టాడు. అయితే సర్వీస్ గేమ్‌లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన సెర్బియా స్టార్ రెండో సెట్ నెగ్గడం ద్వారా 1-1తో స్కోరు సమం చేశాడు. మూడో సెట్‌లో బసవారెడ్డి మళ్లీ పోరాడడంతో..ఈ సెట్‌ను దక్కించుకొనేందుకు జొకో శ్రమకోర్చాల్సి వచ్చింది. కీలకమైన నాలుగో సెట్‌లో తొలుత అనవసర తప్పిదాలు, డబుల్ ఫాల్ట్‌లతో నొవాక్ తడబాటుకు లోనైనా తేరుకొని..సెట్‌ను, మ్యాచ్‌ను కైవసం చేసుకొన్నాడు. గ్రాండ్‌స్లామ్ తొలి మ్యాచ్‌లో బసవారెడ్డి చూపిన ఆల్‌రౌండ్ ఆటకు ఫిదా అయిన ప్రేక్షకులు లేచి నిల్చొని చప్పట్లతో అతడికి వీడ్కోలు పలికారు. పురుషుల ఇతర మొదటి రౌండ్ మ్యాచ్‌ల్లో టాప్ సీడ్ సిన్నర్ 7-6 (2), 7-6 (5), 6-1తో జారీపై, మూడో సీడ్ అల్కారజ్ 6-1, 7-5, 6-1తో షెవ్‌చెన్కోపై వరుస సెట్లలో గెలిచి ముందంజ వేశారు. 11వ సీడ్ సిట్సిపా‌స్‌కు 7-5, 6-3, 2-6, 6-4తో అమెరికాకు చెందిన అలెక్స్ మిచెల్సన్ ఝలకిచ్చాడు. మహిళల సింగిల్స్‌లో స్వియటెక్ 6-3, 6-4తో సినియకోవాని, మూడో సీడ్ గాఫ్ 6-3, 6-3తో సోఫియా కెనిన్‌ని, ఏడో సీడ్ పెగులా 6-3, 6-0తో మాయా జోయింట్‌ని, నవోమి ఒసాక 6-3, 3-6, 6-3తో గార్షియాని ఓడించి రెండో రౌండ్‌కు చేరారు.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 14-1-2025 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**



బెజవాడలో ఏర్పాటు చేసిన ఓ బరిలో కాలుదువ్విన కోళ్లు

కో అంటే కోట్లు

తొలిరోజే రూ.300 కోట్ల పందేలు

- గోదావరి సహా పలు జిల్లాల్లో కోడి పందేల జోరు
- పందెం రాయుళ్ల హుషారు
- కొందరికి బుల్లెట్ల కానుక
- లక్షల సంఖ్యలో తరలివచ్చిన జనం
- ఎటు చూసినా సంక్రాంతి 'సంస్కృతి'
- పులివెందులకూ పాకిన పందేలు

13

త్రివేణి సంగమం భక్తజన సంద్రం

- మొదలైన మహా కుంభమేళా
- తొలిరోజు కోటిన్నర మంది పవిత్ర స్నానాలు

2

పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ఆంధ్రజ్యోతి'

సంక్రాంతి శుభాకాంక్షలు

సంక్రాంతి సందర్భంగా మా కార్యాలయాలకు మంగళవారం సెలవు. కావున బుధవారం (15-1-25) 'ఆంధ్రజ్యోతి' సంచిక వెలువడదు. పునర్దర్శనం గురువారం. - మేనేజింగ్ డైరెక్టర్

పండగొచ్చింది

గత సర్కారు పెండింగ్‌కు మోక్షం.. సంక్రాంతి వేళ ఖాతాల్లోకి సొమ్ము

- భారీగా పెండింగ్ బిల్లుల విడుదల
- వివిధ వర్గాల ఖాతాల్లోకి రూ.6,700 కోట్లు
- సర్వత్రా హర్షాతిరేకాలు
- ఇవన్నీ జగన్ సర్కారులో పేరుకుపోయిన బకాయిలే
- ఉద్యోగులు, విద్యార్థులు, కాంట్రాక్టర్లు, చిరు వ్యాపారులు, పోలీసులు, అమరావతి రైతులకు జమ



నారావారిపల్లెలో పిల్లల ఆటలు తిలకిస్తున్న వేళ సీఎం చంద్రబాబు, సతీమణి భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి సంబరం

ఆంధ్రుల జీవితాల్లో కాంతులు నింపే సంక్రాంతి శోభను ముందుగానే రాష్ట్ర ప్రభుత్వం దాదాపు ప్రతి గడపకూ తెచ్చింది. ఉద్యోగులు, విద్యార్థులు, పోలీసులు, చిరు వ్యాపారులు, చిన్న కాంట్రాక్టర్లు, అమరావతి రైతులు.. ఇలా సమాజంలోని ప్రతి వర్గానికీ దాదాపు రూ.6,700 కోట్ల పాత బకాయిలు చెల్లించింది. 12

5 లక్షల మంది రాక

- సంక్రాంతికి హైదరాబాద్ నుంచి బెజవాడకు వచ్చిన వారి సంఖ్య!
- రికార్డు స్థాయిలో ప్రయాణాలు

12


భీమవరం టౌన్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

పల్లెల్లో సంక్రాంతి సందడి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రంలోని పల్లెలకు సంక్రాంతి కళ వచ్చింది. దేశ.. విదేశాల్లో ఉన్న బంధువులు, మిత్రులు సొంతూళ్లకు చేరుకోవడంతో అంతటా పండగ సందడి నెలకొంది. సోమవారం భోగి పండుగ ఉత్సాహంగా జరిగింది. ఇంటింటా భోగి మంటలు వేశారు. ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాల్లో కబడ్డీ, క్రికెట్, ట్రాక్టర్ రివర్స్, ఎడ్లు, పొట్టేళ్ల పందేలు నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో సంక్రాంతి సందడి మామూలుగా లేదు. దేశంలోని వివిధ నగరాలు, పట్టణాలకు ఉపాధి కోసం వెళ్లి వలస కూలీలుగా ఉంటున్న శ్రీకాకుళం జిల్లా వాసులు ఏటా సంక్రాంతి పండగకు మాత్రమే స్వగ్రామాలకు వస్తుంటారు. శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, నరసన్నపేట, పాతపట్నం, ఎచ్చెర్ల, పలాస నియోజకవర్గాలకు చెందిన లక్షలాది మంది సొంతూళ్లకు చేరుకున్నారు. స్థానిక మత్స్యకార యువకులు 'సీమెన్'గా పనిచేస్తూ గుజరాత్ నుంచి ఓడల్లో ప్రపంచవ్యాప్తంగా తిరుగుతుంటారు. వీరంతా రెండు రోజుల ముందే సొంతూళ్లకు చేరుకున్నారు. పండక్కి కుటుంబాల వారంతా కలవడంతో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. శ్రీకాకుళంలో క్రికెట్ పోటీలను నిర్వహించగా.. గ్రామాల్లో సంగిడి రాళ్ల పోటీలు నిర్వహిస్తున్నారు.



రేపూ బ్యాంకులకు సెలవు

అమరావతి, విజయవాడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి అన్ని ప్రభుత్వ కార్యాలయాలకూ మూడు రోజులు సెలవులు ఉంటాయి. బ్యాంకులు, బీమా కంపెనీలకు మాత్రం సంక్రాంతి ఒక్కరోజే సెలవు. కొన్నాళ్ల క్రితం కనుమ సెలవును రద్దు చేశారు. తాజాగా, స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ, బ్యాంక్ యునియన్ల విన్నపం మేరకు కనుమ సెలవును పునరుద్ధరిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతోపాటు జీవో 2116కు సవరణ నోటిఫికేషన్ కూడా ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో సంక్రాంతి, కనుమ వరుసగా రెండు రోజులు సెలవులు వచ్చాయి. దీనిపై బ్యాంకు యూనియన్లు హర్షం వ్యక్తం చేశాయి.

రేపటి యూజీసీ-నెట్ పరీక్ష వాయిదా

» 16వ తేదీ పరీక్షలు యథాతథం.. ఎన్‌టీఏ ప్రకటన

న్యూఢిల్లీ, జనవరి 13: సంక్రాంతి పండగ నేపథ్యంలో ఈ నెల 15 (బుధవారం)న జరగాల్సిన యూజీసీ-నెట్ పరీక్షను వాయిదా వేసినట్టు సోమవారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించింది. తిరిగి ఎప్పుడు నిర్వహించేదీ తరువాత ప్రకటిస్తామని తెలిపింది. 15న లా, జర్నలిజం-మాస్ కమ్యూనికేషన్ సహా 17 సబ్జెక్టుల్లో పరీక్షలు జరగాల్సి ఉండగా అవన్నీ వాయిదా పడ్డాయని ఎన్‌టీఏ డైరెక్టర్ (పరీక్షలు) రాజేష్ కుమార్ తెలిపారు. 16వ తేదీన జరగాల్సిన పరీక్షలన్నీ యథావిధిగా కొనసాగుతాయని, అందులో మార్పు లేదని ప్రకటించారు. పీహెచ్‌డీ ప్రోగ్రాంలు, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌లు పొందడం, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హత సాధించడం కోసం ఈ పరీక్షలు జరుగుతున్నాయి.

35,170 మంది పాన్‌కార్డుదారులకు ఐటీ లేఖ

ముంబై/న్యూఢిల్లీ, జనవరి 13: పన్ను ఎగవేతదారుల లక్ష్యంగా ఆదాయపుపన్ను శాఖ నిరంతర డ్రైవ్ చేపట్టింది. భారీ నగదు లావాదేవీలు జరిపిన 35,170 మంది పాన్‌కార్డుదారులను సాంకేతికత ఆధారంగా గుర్తించి, వారికి తాజాగా సోమవారం లేఖలు పంపింది. వారి ఆర్థిక లావాదేవీల వివరాలను ఆ లేఖల్లో ప్రస్తావించింది. ఐటీ రిటర్న్ దాఖలు చేశారా? లేదా? అనే సమాచారం కోసం కస్టమైజ్డ్ రెస్పాన్స్ షీట్‌ను కూడా లేఖకు జత చేసింది. వారి ప్రతిస్పందనను తీసుకోవడంతోపాటు, తదనంతర చర్యలు చేపట్టేందుకు ఒక నోడల్ సెల్‌ను ఏర్పాటు చేశామని, ఆయా వ్యక్తుల పన్ను చెల్లింపులు, రిటర్న్ ఫైలింగ్‌లను గుర్తించేందుకు ఆన్‌లైన్ పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశామని ఆర్థిక మంత్రిత్వశాఖ సోమవారం వెల్లడించింది. దీంతోపాటు నిర్దిష్ట సమాచారం ఉన్న ఆదాయ పన్ను రిటర్న్ దాఖలు చేయని పాన్‌కార్డుదారులను గుర్తించేందుకు బిజినెస్ ఇంటెలిజెన్స్ ప్రాజెక్టును చేపట్టినట్టు తెలిపింది. కాగా, 2012-13 సంవత్సరంలో 14.62 లక్షల మంది మాత్రమే రూ.10 లక్షలకుపైగా ఆదాయం ఉన్నట్టు ప్రకటించగా, ఆ ఏడాది 33.83 లక్షల మంది తమ బ్యాంకు ఖాతాల్లో రూ.10 లక్షలకుపైగా డిపాజిట్లు చేసినట్టు కంప్యూటర్ నెట్‌వర్క్ ద్వారా పరిశీలించిన రికార్డుల్లో వెల్లడైంది.

జయలలిత వారసురాలి పిటిషన్ కొట్టివేత

బెంగళూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): తమిళనాడు మాజీ సీఎం, దివంగత జయలలిత ఆస్తుల కోసం ఆమె వారసురాలిగా జె.దీప దాఖలు చేసిన పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు సోమవారం కొట్టివేసింది. పోలీసులు జప్తు చేసిన ఆభరణాలు, వస్తువులను తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించాలని ఆదేశించింది. న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీశానంద నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం దీప పిటిషన్‌ను విచారించి, తీర్పునిచ్చింది. గత ఏడాది మార్చి 6న తమిళనాడు ప్రభుత్వానికి జయలలిత ఆభరణాలను అప్పగించాల్సి ఉంది. కానీ ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఆ ఆదేశాలతో తమ హక్కులకు భంగం కలుగుతోందని జయలలిత వారసురాలు జె.దీప హైకోర్టులో పిటిషన్ వేశారు.

1% అక్షరాస్యత పెరిగితే.. మహిళా ఓటింగ్ 25% పెరుగుదల!: ఎస్బీఐ నివేదిక

న్యూఢిల్లీ, జనవరి 13: భారతదేశంలో అక్షరాస్యత, మహిళల ఓటింగ్ శాతానికి మధ్య గణనీయమైన సంబంధం ఉందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక వెల్లడించింది. దేశంలో 1 శాతం అక్షరాస్యత పెరిగితే, అది ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే మహిళల సంఖ్యలో 25 శాతం పెరుగుదలకు దారితీస్తుందని విశ్లేషించింది. ఈ సందర్భంగా గత రెండు సార్వత్రిక ఎన్నికల్లో పెరిగిన మహిళా ఓటర్ల సంఖ్యను ప్రస్తావించింది. 2019తో పోలిస్తే.. 2024 ఎన్నికల్లో 1.8 కోట్ల మంది మహిళా ఓటర్లు పెరిగాయని తెలిపింది. ఇందులో ఇందులో 45 లక్షల మంది పెరుగుదలకు అక్షరాస్యత స్థాయి మెరుగుదలే కారణమని పేర్కొంది. మహిళా ఓటర్ల సంఖ్య పెరుగుదలను నడిపించడంలో అక్షరాస్యత, ఉపాధి, మౌలిక సదుపాయాలు, ఇంటి యాజమాన్యం (ప్రధాన మంత్రి అవాస్ యోజన) వంటివి కీలక పాత్ర పోషిస్తాయని ఎస్బీఐ నివేదిక నొక్కిచెప్పింది.

త్రివేణి సంగమం

భక్త జన సంద్రం



ప్రయాగ్‌రాజ్‌లో మొదలైన మహా కుంభమేళా

తొలిరోజు కోటిన్నర మంది భక్తుల పవిత్ర స్నానాలు

న్యూఢిల్లీ, జనవరి 13 : ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళా ప్రారంభమైంది. త్రివేణి సంగమంలో (గంగ, యమున, సరస్వతి) పుష్య పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం తెల్లవారు జామున భక్తులు తొలి స్నానాలు ఆచరించడంతో 45 రోజులు సాగే ఈ మహాపర్వానికి తెర లేచింది. వాయిద్యాల చప్పుళ్లు, భజనలతో సంగమ తీరం అలౌకిక ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. జై గంగామయి, జై శ్రీరామ్, హరహర మహాదేవ... అంటూ స్నానఘట్టాలు హోరెత్తుతున్నాయి. తొలిరోజు 1.5 కోట్ల మంది భక్తులు పవిత్ర స్నానాలు చేసినట్టు అంచనా. ఈ మహా కుంభమేళాకు దాదాపు 40 కోట్లమంది భక్తులు తరలివస్తారని అంచనా. అంటే.. రష్యా, అమెరికా వంటి అగ్రదేశాల జనాభా కంటే కూడా అధికంగానే ఈ కార్యక్రమంలో పాలుపంచుకోనున్నారు.

"భక్తి, నమ్మకం, సంస్కృతుల పవిత్ర సంగమంలో అసంఖ్యాక జనరాసులను మహా కుంభమేళా ఒక దగ్గరకు చేర్చింది. కాలాతీత ఆధ్యాత్మిక వారసత్వాన్నీ, సౌభ్రాతృత్వాన్నీ, విశ్వాసాన్నీ ఈ వేడుక ప్రతిబింబించింది"

\- 'ఎక్స్'లో ప్రధాని నరేంద్ర మోదీ.

40 కోట్లమంది భక్తులు సగటున ఐదు వేలు చొప్పున ఖర్చుచేస్తే సమకూరే ఆర్థిక ప్రయోజనం ఇదీ. అదనంగా ఆహార పదార్థాలు, పానీయాల విక్రయాలద్వారా మరో రూ.20 వేల కోట్ల ఆదాయం ఖజానాకు చేరుతుందని అఖిల భారత వర్తక సమాఖ్య (సీఏఐటీ) అంచనా వేసింది. యూపీ కనీస సమాత్ర, వాస్తవ జీడీపీలో ఒక శాతం పెరుగుదలకు ఈ వృద్ధి దోహదపడుతుంది. దీనిపై యోగి ఆదిత్యానాథ్ స్పందిస్తూ.. 2019లో జరిపిన అర్ధ కుంభమేళాలో 24 కోట్లమంది భక్తులు పాల్గొనగా, రాష్ట్ర ఖజానాకు రూ. 1.2 లక్షల కోట్ల ఆదాయం సమకూరిందని తెలిపారు. ఇలా చూస్తే.. ఈసారి రూ. రెండు లక్షల కోట్లు తేలిగ్గా సమకూరతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఏకంగా 'నగరాన్నే' నిర్మించేశారు.

నాలుగు వేల హెక్టార్లలో 'మహా కుంభమేళ' నగరాన్నే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఇది ప్రపంచంలోనే అతి విస్తారమైన తాత్కాలిక నగరం. ఇక్కడ ఏ సమయంలోనైనా యాభై లక్షలమంది నుంచి కోటిమంది ఉండవచ్చు. ఈ నిర్మాణాల కోసం, ఇతరత్రా సౌకర్యాల కల్పన కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వం రూ.7వేల కోట్లు ఖర్చుచేసింది. భక్తులపై ఇంత వ్యయం చేస్తున్న సీఎం యోగి ఆదిత్యానాథ్ ప్రభుత్వానికి...వారివల్ల కనిష్ఠంగా రూ. రెండు లక్షల కోట్ల మేర ఆర్థిక వృద్ధి సమకూరనున్నదని అంచనా.

విదేశీ భక్తుల హడావుడి

దాదాపు 13 అఖాడాలకు చెందిన వేలాది మంది సాధుసంతులు మహాకుంభమేళాలో పాలుపంచుకుంటున్నారు. విదేశాల నుంచి కూడా భక్తులు తరలివస్తున్నారు. పవిత్ర స్నానాలు ఆచరించడానికి త్రివేణి సంగమ తీరానికి అతి భారీ ఎత్తున చేరుకుంటున్న భక్తులు.. స్నానఘట్టాల వద్ద జరిగిన ఏర్పాట్ల పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సంగమ తీరంలోని నందీద్వారం వద్ద నెలకొల్పిన ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్‌ల కటౌట్ల వద్ద సెల్ఫీలు తీసుకోవడానికి భక్తులు ఆసక్తి చూపుతున్నారు.

'విగ్రహం' చుట్టూ వివాదం..

మహా కుంభమేళా జరుగుతున్న ప్రాంతంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ అధినేత ములాయం సింగ్ యాదవ్ విగ్రహం ఏర్పాటు వివాదానికి దారితీస్తోంది. విగ్రహం ఉన్నచోట శిబిరం ఏర్పాటుచేసి సమాజ్‌వాదీ పార్టీ కార్యకర్తలు ఆహారం, వసతిని భక్తులకు కల్పిస్తున్నారు. అయితే, తన పాలనాకాలంలో హిందూ, సనాతన వ్యతిరేక వైఖరిని ప్రదర్శించిన ములాయం విగ్రహం ఇక్కడ పెట్టడం ఏమిటంటూ కొందరు భక్తులు, హిందూ సంస్థల ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ముస్లిములకు అనుకూలంగా, ఆయోధ్య ఆలయ ఉద్యమానికి వ్యతిరేకంగా నాడు ములాయం నిలిచారని అఖిల భారతీయ అఖాడా పరిషత్ మహంత్ రవీంద్ర పూరీ తెలిపారు. కోట్లాదిమంది హిందూ భక్తులు భక్తిశ్రద్ధలతో స్నానాలు ఆచరించే స్థలంలో అలాంటి నేత విగ్రహం పెట్టడం సరైన చర్య కాదన్నారు. రాష్ట్రానికి సీఎంగా పనిచేసిన ములాయం పట్ల తమకు రాజకీయంగా ఏ వ్యతిరేకతా లేదన్నారు.



లోకం తీరు

తీపి శత్రువు

» శీతలపానీయాల వల్ల ఏటా 22 లక్షల టైప్ 2 డయాబెటిస్ కేసులు

న్యూఢిల్లీ, జనవరి 13: కూల్‌డ్రింక్స్ తాగడం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ రావడమే కాకుండా టైప్ 2 డయాబెటిస్, హృదయరోగాలు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు నిపుణులు. తీపిపానీయాల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఏటా కొత్తగా దాదాపు 22 లక్షల టైప్ 2 మధుమేహ కేసులు, 12 లక్షల హృద్రోగ కేసులు నమోదవుతున్నాయి. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ కేసుల సంఖ్య ఆందోళనకరంగా ఉందని అమెరికాకు చెందిన టఫ్ట్స్ వర్సిటీ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడైంది. 2020లో ప్రపంచవ్యాప్తంగా నమోదైన టైప్ 2 మధుమేహుల్లో 9.8% తీపి పానీయాల వల్లేనని యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ అధ్యయనంలో తేలింది. కాగా, హార్వర్డ్ అనుబంధ బ్రిగామ్ మహిళా ఆస్పత్రి పోస్ట్‌మెనోపాజ్‌లో ఉన్న లక్ష మంది మహిళలపై 20 ఏళ్ల పాటు ఓ అధ్యయనం జరిగింది. నెలకు 3, అంతకన్నా తక్కువ కూల్‌డ్రింక్స్ తాగినవారిలో 85% ఎక్కువ లివర్ క్యాన్సర్ ప్రమాదం కనిపించింది.

'కాగ్ నివేదికపై కావాలనే ఆలస్యం

» ఢిల్లీ సర్కారుపై హైకోర్టు అసహనం

న్యూఢిల్లీ, జనవరి 13: కాగ్ నివేదికపై అసెంబ్లీలో చర్చించకుండా ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారంటూ ఆప్ ప్రభుత్వంపై ఢిల్లీ హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఈ ఆలస్యం పలు అనుమానాలకు తావిస్తోందని వ్యాఖ్యానించింది. ఢిల్లీ మద్యం విధానం వల్ల సర్కారుకు రూ.2,026 కోట్ల నష్టం వాటిల్లినట్లు పేర్కొన్న కాగ్ నివేదికపై చర్చ జరిపేందుకు అసెంబ్లీలో ప్రత్యేక సెషన్ ఏర్పాటుకు ఆదేశించాలన్న పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.



జడ్ మోర్ టన్నెల్ వద్ద ప్రధాని మోదీ, ఒమర్

మోదీ.. మాటిస్తే తప్పడంతే!

జమ్మూకశ్మీరుకు రాష్ట్ర హోదాపై ప్రధాని

శ్రీనగర్-లేహ్ హైవేపై 'జడ్ మోర్' టన్నెల్ ప్రారంభం

శ్రీనగర్, జనవరి 13: 'ఇక్కడ ఉన్నది మోదీ.. మాటిస్తే తప్పడంతే' అని ప్రధాని మోదీ అన్నారు. జమ్మూకశ్మీరుకు పూర్తిస్థాయి రాష్ట్ర హోదా ఇవ్వాలని ఆ కేంద్రపాలిత ప్రాంతం సీఎం ఒమర్ అబ్దుల్లా చేసిన వినతిపై ఆయన స్పందిస్తూ.. ప్రతి దానికీ ఓ సమయం ఉంటుందన్నారు. సరైన సమయంలో సరైనవే జరుగుతాయని స్పష్టం చేశారు. సోమవారం జమ్మూకశ్మీరులో పర్యటించిన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. శంకుస్థాపనలు కూడా చేశారు. ముఖ్యంగా గాందర్‌బల్ జిల్లా సోనామార్గ్‌లో శ్రీనగర్-లేహ్ జాతీయ రహదారిపై 6.4 కిలోమీటర్ల పొడవున నిర్మించిన 'జడ్ మోర్' సొరంగాన్ని ఆయన ప్రారంభించారు. లోపలకు వెళ్లి పరిశీలించారు. సొరంగం నిర్మించిన కార్మికులతో సంభాషించారు. ఆ సందర్భంగా అక్కడ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. కాగా, రూ.2,700 కోట్ల అంచనా వ్యయంతో శ్రీనగర్-లేహ్ జాతీయ రహదారిపై 12 కిలోమీటర్ల పొడవున తలపెట్టిన ఈ ప్రాజెక్టులో రెండు సొరంగాల నిర్మాణం తలపెట్టారు. వీటిలో ఒకటి జోజిలా సొరంగం. 2028కల్లా ఇది పూర్తవుతుంది. రెండోది జడ్ మోర్. 6.4 కిమీ నిడివి గల ఈ సొరంగం శ్రీనగర్-లద్దాఖ్ నడుమ 49 కిలోమీటర్ల ప్రయాణ దూరాన్ని 43 కిమీకు తగ్గిస్తుంది.

గేమ్ చేంజర్ సినిమా ఆన్‌లైన్‌లో పెడతామంటూ బ్లాక్ మెయిల్

హైదరాబాద్ సిటీ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రామ్ చరణ్ హీరోగా నటించిన గేమ్ చేంజర్ సినిమాను లీక్ చేసి ఆన్‌లైన్ పెడతామని కొందరు బ్లాక్ మెయిల్ చేస్తున్నారంటూ చిత్ర యూనిట్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. సినిమా విడుదలకు వారం రోజుల ముందు నుంచే కొంతమంది దుండగులు సినిమా నిర్మాతతో పాటు చిత్ర యూనిట్‌లోని ప్రముఖులకు ఫోన్‌లు చేసి బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించారని ఫిర్యాదు చేశారు. వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా పోస్టులు పెడుతూ భారీగా డబ్బులు డిమాండ్ చేశారు. రిలీజ్‌కు రెండు రోజుల ముందు సినిమాలోని కీలక సన్నివేశాలను లీక్ చేసి సోషల్ మీడియాలో షేర్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. 45 మంది వ్యక్తులు ఒక ముఠాగా ఏర్పడి, గేమ్ చేంజర్ సినిమాను పథకం ప్రకారమే లీక్ చేసి, ఇబ్బందులు సృష్టించి బ్లాక్‌మెయిల్ చేశారని చిత్ర యూనిట్ హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

జగన్ బెదిరింపులపై ప్రభుత్వం చర్య తీసుకోవాలి

» సీఎంకు టీడీపీ అధికార ప్రతినిధి రఫీ విజ్ఞప్తి

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): 'జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు ప్రతిపక్ష నేత కూడా కాదు. కేవలం ఒక ఎమ్మెల్యే. ఆయన పోలీసు అధికారులను నోటికి వచ్చినట్లు బెదిరిస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోవడం సరికాదు. తక్షణం దీనిపై చర్య తీసుకోవాలి' అని తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'జగన్ పోలీస్ అధికారులను బెదిరించడం, దూషించడం అలవాటుగా మారింది. పులివెందుల వెళ్లి డీఎస్పీని బెదిరించారు. అంతకు ముందు డీజీపీ ద్వారకా తిరుమలరావుకు ఇలాగే హెచ్చరికలు చేశారు. దీనిపై ముఖ్యమంత్రి కఠినంగా వ్యవహరించాలి' అని రఫీ అన్నారు.

ఐదుగురు యువ ఐపీఎస్‌లకు పోస్టింగ్స్

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు కేటాయించిన ఐదుగురు యువ ఐపీఎస్ అధికారులకు ప్రభుత్వం పోస్టింగ్స్ ఇచ్చింది. యూపీఎస్సీ-2022 బ్యాచ్‌లో ఐపీఎస్‌కు ఎంపికైన వీరు హైదరాబాద్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ తర్వాత రాష్ట్రంలోని గ్రేహౌండ్స్‌లో అసాల్ట్ కమాండర్లుగానూ శిక్షణ పూర్తి చేసుకున్నారు. దీంతో నవజ్యోతి మిశ్రాను చింతపల్లి ఏఎస్పీగా, మంద జావలి అల్ఫోన్స్‌ను నంద్యాల ఏఎస్పీగా, మనోజ్ రామనాథ్ హెగ్డేను రాజంపేట ఏఎస్పీగా, పాటిల్ దేవరాజ్ మనీష్‌ను కాకినాడ ఏఎస్పీగా, రోహిత్ కుమార్ చౌదరిని తాడిపత్రి ఏఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

కేంద్ర జలసంఘం అధ్యక్షుడిగా ముఖేశ్ కుమార్

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) అధ్యక్షుడిగా ముఖేశ్ కుమార్ సిన్హాను కేంద్ర ప్రభుత్వం నియమించింది. కేంద్ర క్యాబినెట్ నియామక కమిటీ ఆయన పేరును సిఫారసు చేయగా, ఈ మేరకు కేంద్ర సిబ్బంది, శిక్షణ మంత్రిత్వ శాఖ నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ముఖేశ్‌కుమార్ హైదరాబాద్‌లోని గోదావరి యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) చైర్మన్‌గా పనిచేస్తున్నారు.


కూటమి ప్రభుత్వంలో రైతులంతా హ్యాపీ

» 28,83,238 టన్నుల ధాన్యం సేకరణ: మంత్రి పార్థసారథి
» ఖాతాల్లో 6,569 కోట్లు జమ
» జగన్ పాలనలో 2-3 నెలలకు..
» మేం 2-3 గంటల్లోనే వేస్తున్నాం
» అందుకే అన్నదాతల సంబరాలు
» చూడలేక వైసీపీ నిరాశానిస్పృహ
» గ్రావెల్ తవ్వకాలపై యార్లగడ్డకు సమాచారమిస్తా: మంత్రి

విజయవాడ(కృష్ణలంక), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ఎవరికో అవగాహన లేకుండా జగన్ మాట్లాడుతున్నారని, సంక్రాంతి అంటేనే రైతుల పండుగన్న విషయం ఆయన తెలుసుకోవాలని సమాచార పౌరసంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సోమవారమిక్కడ ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రావడంతో రైతులంతా ఎంతో సంతోషంగా సంక్రాంతి జరుపుకొంటుంటే అది గిట్టని వైసీపీ నాయకులు.. సంక్రాంతి కేవలం కూటమి నాయకులకే అని మాట్లాడడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. 4,56,873 మంది రైతులు పండించిన 28,83,238 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి రూ.6,569.84 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. గతంలో జగన్ సర్కారు ధాన్యం డబ్బులను 2-3 నెలలకు రైతుల ఖాతాల్లో వేసేదని, కూటమి ప్రభుత్వం 2-3 గంటల్లోనే వేస్తోందని.. అందుకు రైతులు సంతోషంగా గ్రామాల్లో సంబరాలు చేసుకుంటున్నారని చెప్పారు. ఆ వేడుకలు చూడలేక వైసీపీ నాయకులు తీవ్ర నిరాశానిస్పృహలతో మాట్లాడుతున్నారన్నారు. జగన్ వ్యవహార శైలి నచ్చక ఆ పార్టీలో అందరూ పారిపోతున్నారని.. వైసీపీ ఎందుకు ఖాళీ అవుతోందో ఆయన ముందు తెలుసుకోవాలని వ్యాఖ్యానించారు. జగన్ విధానం బెదిరించడం, కక్ష కట్టడమన్నారు. వైసీపీ నాయకురాలు రోజా అన్నీ గాలిమాటలు మాట్లాడుతూ ఉంటుందని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో ధాన్యం సేకరణ చేసి డబ్బులు ఎగ్గొట్టారని.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ బాకీలను చెల్లిస్తున్నామని చెప్పారు. 'గతంలో ఎగ్గొట్టిన సబ్సిడీలన్నీ పునరుద్ధరించి అమలు చేస్తున్నాం. సూపర్ సిక్స్ పథకాల్లో ఇప్పటికే ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను రూ.3 వేల నుంచి 4 వేలకు పెంచి నెలకు దాదాపు 63 లక్షల మందికి పైగా అందిస్తున్నాం. దీపం-2 పథకం ద్వారా 82,97,371 మందికి ఉచిత సిలెండర్లు పంపిణీ చేసి రూ.639 కోట్లు సబ్సిడీగా అందించాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుచేసి ప్రజల భయాన్ని పోగొట్టాం. 200కు పైగా అన్న క్యాంటీన్లు ప్రారంభించి రూ.5కే పేదవారి ఆకలి తీరుస్తున్నాం. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో గ్రామాలకు సిమెంట్ రోడ్లు వచ్చాయి. వైసీపీ పాలనలో రూ.6,679 కోట్ల విదేశీ పెట్టుబడులు వస్తే.. కూటమి ప్రభుత్వం 6 నెలల్లోనే దాదాపు రూ.85 వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చింది. ఈ ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుంది. మంత్రి లోకేశ్ చొరవతో టీసీఎస్, గూగుల్ వస్తున్నాయి. మిట్టల్ స్టీల్ ప్లాంట్ కూడా వస్తోంది' అని తెలిపారు. నూజివీడు గ్రావెల్ తవ్వకాలపై పూర్తి వివరాలు ప్రభుత్వ అనుమతితో త్వరలో మీడియా ముందుంచుతానని పార్థసారథి చెప్పారు. ఈ అంశంపై గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సమాచార లోపంతో మాట్లాడి ఉంటారని, ఆయనకు కూడా సమాచారం అందిస్తానని తెలిపారు.



లండన్‌లో నా భద్రతకు ఆయనే కావాలి



» మహబూబ్ బాషాను కేటాయించేలా

ఆదేశాలివ్వాలని హైకోర్టులో జగన్ అత్యవసర పిటిషన్

అమరావతి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులతో తాను లండన్ వెళ్తున్నానని.. తన భద్రత బృందంలో అనంతపురం ఏపీఎస్పీ 14వ బెటాలియన్ సహాయ కమాండెంట్ మహబూబ్ బాషాను నియమించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సోమవారం అత్యవసరంగా హౌస్‌మోషన్ పిటిషన్ వేశారు. దీనిపై హైకోర్టు విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసుల తరఫున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. యెల్లో బుక్ నిబంధనల ప్రకారం ఫలానా అధికారిని సెక్యూరిటీగా పంపించాలని పిటిషనర్ కోరడానికి వీల్లేదని, హైకోర్టు కూడా గతంలో ఇదే విషయాన్ని చెప్పిందని తెలిపారు. భద్రతకు ముప్పుంటే ఆ విషయాన్ని కేంద్ర హోం, విదేశీ వ్యవహారాల శాఖ నిర్ధారించాల్సి ఉంటుందన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ ఎన్.విజయ్.. పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేశారు. లండన్ వెళ్తున్న తనకు వ్యక్తిగత భద్రత బృందంలో మహబూబ్ బాషాను కేటాయించాలని ఈ నెల 9న నిఘా విభాగం ఐజీకి వినతి సమర్పించామని, ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయమూ వెల్లడించలేదని జగన్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. ఈ నెల 16న జరగనున్న కుమార్తె స్నాతకోత్సవానికి పిటిషనర్ లండన్ వెళ్తున్నారని, ప్రస్తుతం ఉన్న సెక్యూరిటీ అధికారులతో అక్కడకు వెళ్లేందుకు ఆయన ఇష్టపడడం లేదని తెలిపారు. తమ వినతిపై నిర్ణయం తీసుకునేలా అధికారులను ఆదేశించాలని కోరారు.

మిసెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్‌గా విశాలాక్షీ

» హైదరాబాద్‌లో 2025 గ్రాండ్ ఫినాలే ఫ్యాషన్ షో..

హైదరాబాద్ సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మిసెస్ ఇండియా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ 2025 ఫ్యాషన్ షో ర్యాంప్‌పై మహిళలు క్యాట్‌వాక్‌తో ఆకట్టుకున్నారు. మమతా త్రివేది ఆధ్వర్యంలో ఆరోగ్యసమస్యల థీమ్‌తో ఆదివారం రాత్రి ఓ హోటల్‌లో 2025 గ్రాండ్ ఫినాలే ఫ్యాషన్ షోను బీజేపీ ఎంపీ డి.కె అరుణ ప్రారంభించారు. ఆడవాళ్లలో వచ్చే కేన్సర్, ఆరోగ్య సమస్యల గురించి తెలుపుతూ మోడల్స్ ర్యాంప్ వాక్‌లో పాల్గొన్నారు. మిసెస్ ఇండియా తెలంగాణ విజేతగా శ్రీమతి కేటగిరీలో లక్ష్మీ తేజ, ఆంధ్రప్రదేశ్ విజేతగా శ్రీమతి కేటగిరీలో పులిపాటి విశాలక్ష్మి విజేతలుగా నిలిచారు.

నిత్యావసరాల ధరల్లో స్వల్ప తగ్గుదల

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొన్ని నిత్యావసర వస్తువుల ధరలు స్వల్పంగా తగ్గాయి. నిరుడు జనవరితో పోల్చితే స్వల్పంగా పెరిగినా.. గత నెల ధరలతో చూస్తే సగటు ధరల్లో కాస్త తగ్గుదల కనిపిస్తోంది. రాష్ట్ర అర్థ, గణాంక శాఖ సమాచారం ప్రకారం గత నెల సూపర్‌ఫైన్ క్వాలిటీ బియ్యం కిలో రూ.63.03 ఉండగా, ఇప్పుడు రూ.62.47, ఫైన్ క్వాలిటీ రూ.55.68 నుంచి రూ.54.83కు, కామన్ వెరైటీ రూ.43.98 నుంచి రూ.43.60కి వచ్చాయి. గ్రేడ్-1 కందిపప్పు కిలో రూ.169.99 నుంచి రూ.163.09, గ్రేడ్2 రూ.157.95 నుంచి రూ.150.71కు తగ్గాయి. సన్‌ఫ్లవర్ రిఫండ్ ఆయిల్ లీటర్ రూ.145.61 నుంచి రూ.143.70కి తగ్గగా, చింతపండు కామన్ వెరైటీ కిలో రూ. 131.81 నుంచి రూ.129.78, ఆర్డినరీ రకం రూ.57.31నుంచి రూ.55.15కు తగ్గాయి. గ్రేడ్1 మిర్చి కిలో రూ.210.22 నుంచి రూ.202.39, గ్రేడ్2 రకం రూ.187.51 నుంచి రూ.179.58కి వచ్చాయి. గ్రేడ్1 పెద్ద ఉల్లిపాయలు కిలో రూ.63నుంచి రూ.46.53, గ్రేడ్2 రకం రూ.54.37నుంచి రూ.38.99కు తగ్గాయి. ఉల్లి కిలో రూ.15-16 తగ్గింది.

మహిళలకు త్రినాధరావు క్షమాపణలు

అన్షూపై చేసిన వ్యాఖ్యలకు.. ఆమెకు, మహిళలకు దర్శకుడు త్రినాధరావు క్షమాపణలు తెలిపారు. ఈ మేరకు ఓ వీడియో విడుదల చేశారు. "టీజర్ లాంచ్ ఈవెంట్‌లో నేను చేసిన వ్యాఖ్యలు చాలా మంది మహిళల మనసులు నొప్పించాయని అర్థమైంది. ఇవి మీ అందర్నీ నవ్వించే ప్రయత్నంలో అనుకోకుండా వచ్చిన వ్యాఖ్యలే తప్ప.. కావాలని చేసినవి కావు. అయినా, సరే ఆ వ్యాఖ్యలు మీ మనసును నొప్పించాయి కాబట్టి తప్పు తప్పే. నేను చేసిన వ్యాఖ్యలకు మనస్ఫూర్తిగా క్షమాపణలు తెలియజేస్తున్నాను. అందరూ పెద్ద మనసుతో క్షమించండి. ఎందుకంటే మా ఇంట్లో కూడా ఆడపిల్లలు ఉన్నారు. అన్షూకు నా క్షమాపణలు. అలాగే, కార్యక్రమంలో నేను సరదాకు హీరోయిన్‌ను ఏడిపించడానికి వాడిన మేనరిజమ్‌కు కూడా నా క్షమాపణలు. అది కూడా కావాలని చేసింది కాదు. ఏదో వినోదం కోసం చేసిన ప్రయత్నమిది. ఇంత పెద్ద ఇష్యూ అవుతుందని అనుకోలేదు. నా వల్ల ఎవరెవరి మనోభావాలు దెబ్బతిన్నాయో.. వారందరికీ మనస్ఫూర్తిగా నా క్షమాపణలు తెలియజేస్తున్నాను. దయచేసి పెద్ద మనసు చేసుకుని క్షమించండి" అని వీడియోలో పేర్కొన్నారు. కాగా, ఈ కార్యక్రమంలో దర్శకుడు త్రినాధరావు నక్కిన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. కాగా, దర్శకుడు త్రినాధరావు నక్కిన 'మజాకా' సినిమా టీజర్ విడుదల సందర్భంగా నటి అన్షూపై అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనపై మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈవెంట్‌లో ఆయన చేసిన వ్యాఖ్యలపై వివరణ కోరుతూ నోటీసులు జారీ చేస్తామని కమిషన్ ఛైర్ పర్సన్ నేరెళ్ల శారద తెలిపారు.

\- సినిమా డెస్క్

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రకృతి పరిమళం

'పువ్వు పూయును, పూసి వాడును/ వాడి రాలును, వాడి రాలిన పువ్వు వంతుకు/ పూసి మరియొక పువ్వు జేరును' అని ప్రకృతి లీలను కవి కాళోజీ వర్ణించారు. 'రాశి చక్రగతులలో/ రాత్రిం దివాల పరిణామాలలో/ బ్రహ్మాండ గోళాల పరిభ్రమణాలలో/ కల్పాంతాలకు పూర్వం కదలిక పొందిన/ పరమాణువు సంకల్పంలో' ప్రభవించిన మానవుడు కాల దేవతను సంక్రాంతులతో పూజిస్తున్నాడు. తన జీవనాన్ని వినూత్న మార్పులతో మరింత శోభితం చేసుకునేందుకు సంక్రాంతి వేడుకలతో ఆవాహన చేసుకుంటున్నాడు.

సంక్రాంతి గగనంలో ప్రారంభమవుతుంది. మానవుని ఖగోళ జిజ్ఞాస నుంచి 'సంక్రాంతి' అనే పదం పుట్టింది. గ్రహ రాశులలో ఒక రాశి నుంచి మరొక రాశికి సూర్యుని కదలికను సంక్రాంతి సూచిస్తుంది. సూర్యుడు ఒక రాశి నుంచి మరొక రాశికి చేరడాన్ని సంక్రమణం లేక సంక్రాంతి అంటారు. సూర్యుడు మకర రాశికి చేరినప్పుడు మకర సంక్రాంతి వస్తుంది. ఈ సంక్రాంతి నుంచి సూర్యుడి గమనం ఉత్తర దిశగా జరుగుతుంది. అదే ఉత్తరాయణం. సూర్యుని సంక్రమణల ప్రాతిపదికనే ఋతువుల మార్పు జరుగుతుంది. ఈ ప్రాకృతిక పరిణామం భువిపై మానవునితో సహా జీవకోటి వైవిధ్యపూరిత జీవన మనుగడ ఆధారపడి ఉంటుంది. మార్పు ఒక నిత్య సత్యమని, అది అనివార్యమని సూర్యుడి మకరరాశి ప్రవేశం స్పష్టం చేస్తుంది. గగనంలో సంక్రాంతి అందరిదీ. అది చాటే సత్యం సంక్రాంతి పండుగ ఖగోళ ప్రాధాన్యాన్ని దృష్టాంతపరుస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే మన పాడిపంటలు ఆ ఆదిత్యుని అనుగ్రహాలే.

సంక్రాంతి పంటల పండుగ. ధాన్యరాశులు రైతుల ఇళ్లకు చేరుతాయి, సంక్రాంతి మహోత్సవం ప్రారంభమవుతుంది. మకర సంక్రాంతి రోజున పంటల సాగులో తమకు సహాయపడిన వారికి రైతులు సముచిత రీతిలో కృతజ్ఞతలు తెలుపుతారు. సంక్రాంతి మరుసటి రోజు 'ఇలవేల్పుల' (పాడి పశువులు అయిన ఆవులు, గేదెలతో పాటు ఎడ్లు, దున్నపోతులు మొదలైన శ్రామిక పశువులు)ను పూజిస్తారు. మకర సంక్రాంతి వేడుకలు భారతావని అంతటా వివిధ పేర్లతో, వేర్వేరు రూపాలలో జరుగుతాయి. ఉత్తరప్రదేశ్‌లో కీచేరిగా, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్‌లలో లొహ్రిగా, అసోంలో భోగాలి బిహుగా, బెంగాల్, ఒడిసాలలో మకర్ సంక్రాంతి, రాజస్థాన్‌లలో ఉత్తరాయన్, తమిళనాడులో పొంగల్‌గా జరుపుకోవడం పరిపాటి. ఈ వేడుకల ఉల్లాసోత్సాహాల వెనుక అపారశ్రమ, అంతులేని వేదన ఉన్నాయన్నది కూడా విస్మరించలేని నిజం. సిరులు పండించిన శ్రామికులకు, ఒకటి రెండు రోజులపాటు ఉదార దానధర్మాలు, కృతజ్ఞతా నివేదనలతో న్యాయం జరుగుతుందా?

మకర సంక్రాంతికి ఖగోళ, వ్యవసాయక, సాంస్కృతిక ప్రాధాన్యమే కాకుండా ఆధ్యాత్మిక విశిష్టత కూడా ఉన్నది. ఒక నిర్దిష్ట యోగ ప్రక్రియ నుంచి ఈ పండుగ ఆవిర్భవించిందని యోగి పుంగవులు విశ్వసిస్తారు. భగీరథుడు గంగమ్మను భువిపైకి తీసుకువచ్చింది మకర సంక్రాంతి నాడే అని మన పురాణాలు చెప్తునందున ఈ పర్వదినం నాడు గంగానది, ఇతర నదులలో స్నానం చేయడాన్ని ఒక పుణ్యకార్యంగా ప్రజలు భావిస్తారు. సహస్రాబ్దాలుగా సంఖ్యానేక తరాల వారి ఈ విశ్వాసమే కుంభమేళాలకు నాంది. ముఖ్యంగా ఈ ఏడాది త్రివేణీ సంగమమైన ప్రయాగరాజ్ (అలహాబాద్)లో మహా కుంభమేళ జరుగుతున్నందున (జనవరి 13న ప్రారంభమయిన ఈ ఆధ్యాత్మిక ఉత్సవం ఫిబ్రవరి 26 దాకా కొనసాగనున్నది) ఈ మకర సంక్రాంతి మరింత విశేష ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. ప్రకృతి పవిత్రత గురించి మానవ అంతరంగాన్ని జాగృతం చేయడమే కుంభమేళాల లక్ష్యం. సామాజిక పరమార్థాన్ని సాధించే ఒక మతాభినివేశ కార్యక్రమం మహా కుంభమేళా. సామాజిక సమ్మిళితానికి దోహదం చేసే ఆధ్యాత్మిక మహోత్సవం.

ఒక శుభ సందర్భంలో గూడుకట్టుకుని ఉన్న విషాదాన్ని గురించి 'ఆ మానవాననంలో/ ఏదో కించి ద్విషాదం, కించిన్నిరాశ/ కొంచెం విరాగం, కించి దసంతృప్తి/ ఆ మానవ వదనం అందరికీ పరిచితమే/ అతడే నువ్వూ నేనూ అంతమంది వెరసి' అని శ్రీశ్రీ అన్న మాటలు ప్రస్తుతం ధరిత్రిని కమ్మివేస్తున్న ఒక విలయానికి కూడా వర్తిస్తాయి. అవధులు మీరుతున్న వాతావరణ మార్పే ఆ విషాదం. 2024 పంచాంగ సంవత్సరంలో పారిశ్రామిక యుగానికి పూర్వపు సగటు ఉష్ణోగ్రతల స్థాయి కంటే 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్ ఎక్కువగా నమోదయింది. గత ఏడాది ప్రపంచ వ్యాప్తంగా సంభవించిన ప్రాకృతిక ఉత్పాతాలన్నీ ఈ వాతావరణ మార్పు పర్యవసానాలే. ముంచుకొస్తున్న ఈ ముప్పును నివారించడానికి పరిష్కార మార్గాలను కనుగొనవలసి ఉన్నది. యూపీ సర్కార్ మహా కుంభమేళా సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లో సుస్థిరత, అభివృద్ధిపై కుంభ్ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించడం ముదావహం. కొత్త జీవితాన్ని నిర్మించుకునేందుకు సంకల్పం చెప్పుకునే శుభ దినం కనుక ఈ మకర సంక్రాంతి రోజున ధాత్రీరక్షణకు దోహదం చేసే ఆలోచనలు చేసి వాటిని స్థానికంగా ఆచరణలో పెట్టేందుకు వ్యక్తులు, జన సముదాయాలు, సామాజిక సమూహాలు, ప్రభుత్వాలు పూనుకోవాలి. ఊరు, ఉర్వి శ్రేయస్సు అవిభాజ్యమని గుర్తిస్తేనే ఊరంతా సంక్రాంతి జరుపుకుంటుంది, ఉర్వి జీవన నందనవనం అవుతుంది.

కలల దేశంగా అమెరికా ఎప్పుడైనా ఉందా?

జాతీయవాదం... దాదాపు 200 ఏళ్లకు పైగా ప్రజలను ఉర్రూతలూగిస్తోంది. అన్ని సందర్భాల్లోనూ దీని ప్రభావం స్పష్టంగా కనపడకపోవచ్చు. సాధారణ ప్రజలు చాలాసార్లు జాతీయవాద ప్రేరణతో వ్యవహరించి ఉండకపోవచ్చు. కానీ కీలక సందర్భాల్లో విపరీతంగా ప్రభావితం చేసిన భావజాలాల్లో జాతీయవాదమే ప్రధానమైంది. జాతీయవాదం కోసం సర్వం ధారపోసినవారు అన్ని దేశాల్లోనూ కనపడతారు. ఇదంతా ఒక వైపు కథే! మరోవైపు నుంచి చూస్తే విపరీత జాతీయవాదం సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. అనేక యుద్ధాలకు, దారుణాలకు, వైషమ్యాలకు, విద్వేష ఆలోచనలకు కారణమై కోట్ల మంది జీవితాలను విచ్ఛిన్నం చేసిందీ జాతీయవాదమే! యుద్ధోన్మాదాలను రగిలించిన నాయకులందరూ జాతీయ వాదాన్ని స్మరిస్తూనే రక్తపుటేరులను పారించారు.

మితిమీరిన జాతీయవాదంతో ఏ దేశంలోనైనా నలిగిపోయేది మైనారిటీలే. చరిత్రను తవ్వితీస్తే కనపడేది ఈ చేదు నిజమే. దేశంలోని మెజారిటీ ప్రజలను... మతపరంగానో, భాషపరంగానో, జాతిపరంగానో (రేస్), ప్రాంతపరంగానో ప్రధాన సమూహంగా గుర్తించి వారందరికీ ఒకే తరహా ఉమ్మడి ప్రయోజనాలు ఉంటాయని ప్రచారం చేయటమే అతి జాతీయవాదంలో విశేషంగా ఉంటుంది. ప్రధాన సమూహ ప్రజల మధ్య తేడాలనూ, అసమానతలనూ గుర్తించకుండా కృత్రిమ జాతి ఆధిక్య భావాల చుట్టూ ప్రచారాన్ని కేంద్రీకరించి ఉద్రేకపరచటమే జాతీయవాదాల్లో తరచూ కనపడుతుంది. దేశం గొప్పగా భావించే సాంస్కృతిక వారసత్వాన్ని మైనారిటీలు అంగీకరించటం లేదనీ మనం తరచూ వింటూంటాం. సాంస్కృతిక ప్రత్యేకతలను వదులుకోనివారిని సందేహదృష్టితో చూడటం సంకుచిత జాతీయ వాదంలో ప్రధానంగా కనపడుతుంది.

ప్రజాస్వామ్యానికి అగ్రదేశంగా మనందరమూ భావిస్తున్న అమెరికాలోనూ ఆది నుంచి ఇదే ధోరణి కనపడుతుంది. హెచ్1బి వీసాలను ఆసియావాసులు దుర్వినియోగం చేస్తున్నారనీ ఉన్నత చదువుకోసం వచ్చి ఉద్యోగాలను ఎగరేసుకుపోతున్నారనీ ప్రస్తుతం అమెరికాలో చెలరేగిపోతున్న విమర్శల వెనుకా మెజారిటీ శ్వేత జాతీయవాద విపరీత పోకడే వెల్లడవుతోంది. కుల, తెగ మనస్తత్వాల కంటే జాతీయవాదం విశాలమైనదే కావచ్చు. కానీ జాతి, వర్ణ ఆధిక్యంపై జాతీయవాదం ఆధారపడిన చోట అమెరికా అయినా మరో చోటైనా జరిగే దురాగతాలు ఇంచుమించుగా ఒకేరకంగా ఉంటాయి. జాతీయవాదం పేరుతో సంకుచిత్వం పెరిగే కొద్దీ మైనారిటీలకు క్షోభ ఎక్కువవుతుంది. సందర్భాన్ని బట్టి ఈ క్షోభ రూపం ఆధారపడి ఉంటుంది. అమెరికన్ల ఉద్యోగాలను కొట్టేస్తున్నారన్న విమర్శ ఆసియావాసులను ప్రస్తుతం క్షోభపెడుతోంది. చదువు ముగిసిన తర్వాత ఉద్యోగాలు చేసే కాలాన్ని బాగా తగ్గించాలనే డిమాండు ఊపందుకుంటోంది. ఇది జరిగితే బాగా నష్టపోయేది భారతీయులే. లక్షలు ఖర్చుపెట్టి అమెరికాలో చదువుతున్న మొత్తం విదేశీ విద్యార్థుల్లో 25 శాతం పైగా భారతీయులే ఉన్నారు. 2022-23లో 2,68,923 మంది భారతీయ విద్యార్థులు అమెరికాకు వెళ్లారు.

అభివృద్ధిచెందిన దేశాల్లో పలుచోట్ల జనాకర్షణ, ఉన్మాద నినాదాలతో ఓట్ల రాజకీయాల్లో పైచేయి సాధిస్తున్న నేతల్లో విపరీత జాతీయవాద పోకడలు లేని వాళ్లను వేళ్లమీద లెక్క పెట్టొచ్చు. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా గెలవటంతో ఈ విపరీతం మోతాదు బాగా మించిపోతోంది. ఎక్కడెక్కడి నుంచో వచ్చే వారిని అక్కున చేర్చుకుని నివాసయోగ్యాన్ని కలిగించే దేశంగా అమెరికా గురించి ఘనంగా చెప్పుకోవటం అందరమూ వినే ఉంటాం. అమెరికాను వలసదారుల దేశంగా (ఎ నేషన్ ఆఫ్ ఇమ్మిగ్రంట్స్) వర్ణించి బాగా ప్రాచుర్యం కల్పించటంలో ఒకనాడు ఆ దేశాధ్యక్షుడిగా వ్యవహరించిన



చరిత్రను విశాల మానవతా దృక్పథంతో చూస్తే అమెరికా నుంచి నేర్చుకునేది ఎంత ఉందో నేర్చుకో తగనిదీ అంతకంటే ఎక్కువే ఉంది. వలసల చరిత్రలోని విషాదాలనూ రాజకీయాలనూ జాతి ఆధిక్యతా ధోరణులనూ తెలుసుకుంటేనే ఈనాటి ట్రంప్ విధానాల నేపథ్యమూ అర్థం అవుతుంది. అమెరికా ఆధిక్యతకూ శ్వేతవర్ణానికీ పెద్దపీట వేయాలనే తర్కానికీ ట్రంప్‌తో మళ్లీ ఊపు వచ్చినా దాని మూలాలు ఇప్పటివి కావు! ఆధిపత్య భావజాలాలపై ఆధారపడిన జాతీయవాదాలు ఎక్కడైనా అమానవీయాలే! అందుకే 'కలలదేశం'లో సామాజిక సమానత్వ ఆదర్శాల అమలూ అసంపూర్ణమే!

జాన్.ఎఫ్.కెన్నడి పాత్ర చాలా ఉంది. 'వలసదారుల దేశం' పేరుతో 1958లో కెన్నడి ఒక వ్యాసం రాశారు. దాన్నే తర్వాత పుస్తకంగానూ ప్రచురించారు. 1961లో కెన్నడి అధ్యక్షుడిగా ఎన్నికకావటానికి ఆ పుస్తకం చాలా తోడ్పడింది. వలసదారులకు, శరణార్థులకు సురక్షిత ప్రదేశంగా ఉన్నప్పుడే అమెరికా ఘనత గొప్పగా ఉంటుందని కెన్నడి ప్రగాఢంగా చెప్పినా అది చాలా సందర్భాల్లో అమలుకాని ఆదర్శంగానే ఉండిపోయింది. అనేక దేశాల నుంచి వచ్చిన వలసదారుల అనుభవాలనూ, చరిత్రలనూ స్పృశిస్తూ జాక్లిన్ బాక్ హస్. 'ఎ న్యూ హిస్టరీ ఆఫ్ ఇమ్మిగ్రేషన్' పేరుతో రాసిన పుస్తకంలో ఇందుకు ఎన్నో ఉదాహరణలు ఇచ్చారు. అమెరికా స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్న తొలినాళ్లలో అంటే 1790లో తీసుకొచ్చిన 'నేచరలైజేషన్ యాక్ట్'లోనే వలసలకు కఠిన పరిమితులు విధించారు. పశ్చిమ యూరపు నుంచి వచ్చిన వారికే పౌరసత్వాన్ని ఇచ్చే వీలు కల్పించారు. అందుకే 1840-90 మధ్య వలసదారుల్లో 90 శాతం మంది యూరపు నుంచే వచ్చారు. 1919 వరకూ కూడా ఈ పరిస్థితి అసలు మారలేదు. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో వలసలు దాదాపుగా ఆగిపోయాయి.



■ రాహుల్ కుమార్

అమెరికాకు ఒకవైపున అట్లాంటిక్, మరోవైపున పసిఫిక్ మహా సముద్రాలు ఉన్నాయి. వీటి మధ్య భూభాగాలను కలుపుతూ రైల్వేలైన్లు వేయటం చాలా సంక్లిష్టమైన పని. అరణ్యాలు, ఉధృతంగా ప్రవహించే నదులు, మహాపర్వతాలతో కూడిన ప్రాంతాల్లో పనిచేయటానికి స్థానిక అమెరికన్లు ముందుకురాలేదు. చివరికి చైనా నుంచి వేలాదిమంది కార్మికులను రప్పించి, అతి తక్కువ వేతనాలతో రైల్వేలైన్లను పూర్తిచేశారు. అప్పటికే శాన్‌ఫ్రాన్సిస్కోలో పనుల కోసం వెతుకుతూ ఉన్న చైనీయులనూ రంగంలోకి దించారు. లైను పూర్తయ్యే లోపల వందల చైనా కార్మికులు చనిపోయారు. 90 శాతం మంది చైనా కార్మికులు రైల్వేలైను నిర్మాణంలో పాల్గొంటే అమెరికన్ల సంఖ్య 10 శాతానికి మించలేదు. 1869 మే 10 నాటికి లైను పూర్తయింది. ఆ సందర్భంగా ఘనంగా ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహించారు. వేడుకల ఫోటోల్లో ఒక్క చైనా కార్మికుడు కూడా లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అంతటి చిన్నచూపు, ఏహ్యత ఆనాడు ఉండేవి. ఏళ్లపాటు పనిచేసినందుకు తమకు పౌరసత్వం కల్పించాలని కోరారు. దానికి ససేమిరా అనటమే కాదు మొత్తంగా చైనీయులను అమెరికాలోకి అడుగుపెట్టకుండా 1882లో 'చైనీస్ ఎక్స్‌క్లూజన్ యాక్ట్'ను తీసుకువచ్చారు. 1902లో వాళ్ల పౌరసత్వాలనూ రద్దుచేశారు. కాలిఫోర్నియాలో అయితే 1882 కంటే ముందే చైనీయులకు ఉన్న ఓటుహక్కునూ రద్దుచేశారు. 1917లో మొత్తంగా ఆసియాదేశాల నుంచే ప్రజలు రాకుండా నిషేధం విధించారు. ఆ తర్వాత 1924లో తీసుకువచ్చిన వలసల చట్టం దేశాలు, జాతుల వారీ కోటాలను ప్రవేశపెట్టి ఆంక్షలను మరింతగా పెంచింది. ఇందుకు 1890నాటి అమెరికాలోని జాతుల జనాభా సంఖ్య ఆధారంగా వలసల కోటాను నిర్ణయించారు. అప్పటికే అమెరికాలో ఉన్న ఒక జాతి జనాభాకు 2 శాతానికి మించి ఏ దేశం నుంచి వలసదారులను అనుమతించకుండా చర్యలు ఈ చట్టంలో ప్రతిపాదించారు. ఆసియా ప్రజలకు పూర్తిగా తలుపులు మూసివేశారు. దక్షిణ, తూర్పు యూరపు దేశాల ప్రజలపైనా చాలా నిషేధాలు పెట్టారు. చివరికి అనేక ఒత్తిళ్ల అనంతరం 1965లో తీసుకువచ్చిన 'ఇమ్మిగ్రేషన్ అండ్ నేషనాలిటీ యాక్ట్' కోటాల పద్ధతిని ఎత్తివేయటంతోనే ఆసియా వాసులకు అమెరికాలో ప్రవేశం కాస్త సులభమైంది. భారతీయులు కూడా ఈ చట్టం తర్వాతే అమెరికాకు వెళ్లటం మొదలుపెట్టారు. నిజానికి 1965 నాటి చట్టానికి అంతకు ముందు ఏడాది అమల్లోకి తెచ్చిన పౌరహక్కుల చట్టం చాలా తోడ్పడింది. నల్లజాతీయులు సాగించిన మహత్తర పోరాటాలతోనే అది సాధ్యమైంది. పౌరహక్కుల చట్టమే లేకపోతే ప్రజాస్వామ్యం గురించి, సమన్యాయపాలన గురించి, పౌరసమానత్వం గురించి ప్రపంచానికి నీతులు చెప్పే నైతిక అర్హతే అమెరికాకు ఉండేది కాదు.

అవకాశాల సీమగా ఇప్పటికీ అమెరికాను పరిగణిస్తూ ప్రతి ఏటా దాదాపు లక్షల మందికి పైగా ప్రజలు అక్కడికి వెళుతున్నారు. 2021-24 మధ్య సగటున ఏడాదికి 24లక్షల మంది అక్కడికి చేరుకున్నారు. 1965 నుంచి చూస్తే క్రమేపీ లాటిన్ అమెరికా, ఆసియా నుంచి అమెరికాకు వెళ్లే వారి సంఖ్య బాగా పెరిగింది. మొత్తం వలసదారుల్లో 50 శాతం వారే ఉన్నారు. ఇంతగా వెళుతున్న వారందరికీ అక్కడ సమభావనతో సమాజంలో స్వాగతం లభిస్తోందనీ ఇప్పటికీ చెప్పలేం. ఎన్నోరూపాల్లో శ్వేతజాతి ఆధిక్యతా ధోరణులు ఎదురవుతున్నాయని చెబుతూ చాలా రచనలు వస్తున్నాయి.

అమెరికా స్వాతంత్ర్య ప్రకటన మనిషి స్వేచ్ఛకూ సంతోషానికీ జీవికకూ పట్టంకడుతూ చాలా ఉదాత్తంగా ఉంటుంది. మనుషులు సమానంగానే పుట్టారనీ, విస్మరించలేని కొన్ని సహజ హక్కులను సృష్టికర్త వారికి కల్పించారనీ అందులో జీవిక హక్కు, స్వేచ్ఛ, సంతోషాన్వేషణ ప్రధానమైనవనీ ఆ ప్రకటన స్పష్టం చేసింది. అమెరికాలోని ఆదిమవాసులనూ ఆఫ్రికా నుంచి బానిసలుగా బలవంతంగా కొనుగోలుచేసి తెచ్చిన లక్షోపలక్షల మందినీ ఆ సహజ హక్కులకు అర్హులుగా చూడలేదు.

చదువు ముగిసిన తర్వాత ఉద్యోగాలు చేసే కాలాన్ని బాగా తగ్గించాలనే డిమాండు ఊపందుకుంటోంది. ఇది జరిగితే బాగా నష్టపోయేది భారతీయులే. లక్షలు ఖర్చుపెట్టి అమెరికాలో చదువుతున్న మొత్తం విదేశీ విద్యార్థుల్లో 25 శాతం పైగా భారతీయులే ఉన్నారు. 2022-23లో 2,68,923 మంది భారతీయ విద్యార్థులు అమెరికాకు వెళ్లారు.

ఆఫ్రికా నుంచి నల్లజాతి ప్రజలను 16-19 శతాబ్దాల మధ్య కోటిమందిని బానిసలుగా అమెరికాకు తరలించారు. చరిత్రలో ఇంతమందిని ఇలా తరలించటం జరగలేదు. మెక్సికన్లది మరో విషాద చరిత్ర. మెక్సికో, అమెరికా మధ్య 1846-1848లో యుద్ధం జరగక ముందు అరిజోనా, కాలిఫోర్నియా, కలరాడో, నివాడ, ఓక్లహోమ, టెక్సస్, న్యూమెక్సికో, యూటా రాష్ట్రాల్లో చాలా భూభాగాలు మొత్తంగానో, పాక్షికంగానో మెక్సికో కిందే ఉండేవి. ఆ యుద్ధంలో మెక్సికో సగం భూభాగాన్ని కోల్పోయింది. కోల్పోయిన భూభాగాల్లో మెక్సికన్ల ఆస్తులు, ఉపాధికి భంగం కలగకూడదని ఒప్పందం కుదిరినా దాన్ని ఖాతరు చేయలేదు. అప్పటి నుంచీ మెక్సికన్లు కోల్పోయిన భూభాగాల్లో ప్రవేశించటానికి ఎడతెగని ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

చరిత్రను విశాల మానవతా దృక్పథంతో చూస్తే అమెరికా నుంచి నేర్చుకునేది ఎంత ఉందో నేర్చుకోతగనిదీ అంతకంటే ఎక్కువే ఉంది. వలసల చరిత్రలోని విషాదాలనూ రాజకీయాలనూ జాతి ఆధిక్యతా ధోరణులనూ తెలుసుకుంటేనే ఈనాటి ట్రంప్ విధానాల నేపథ్యమూ అర్థం అవుతుంది. అమెరికా ఆధిక్యతకూ శ్వేతవర్ణానికీ పెద్దపీట వేయాలనే తర్కానికీ ట్రంప్‌తో మళ్లీ ఊపు వచ్చినా దాని మూలాలు ఇప్పటివి కావు! ఆధిపత్య భావజాలాలపై ఆధారపడిన జాతీయవాదాలు ఎక్కడైనా అమానవీయాలే! అందుకే 'కలలదేశం'లో సామాజిక సమానత్వ ఆదర్శాల అమలూ అసంపూర్ణమే! భిన్నజాతుల ప్రజల మధ్య వివాహాలు 1967 వరకూ చట్టవిరుద్ధమైన చోట అదెంత ఉండి ఉంటుంది?

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

విశ్వకళ్యాణ సంక్రాంతి లక్ష్మి

శ్రీమకర సంక్రమణ – ఉషఃశ్రీ కిరణ వి
రాజ తేజస్వి – సూర్యనారాయణుండు,
స్వర్ణరథమున విచ్చేయ – భవ్య పుష్య
కాంతులెసగ నేతెంచె – సంక్రాంతి లక్ష్మి!

పచ్చనైన గుమ్మాలన్ని – పచ్చమావి
తోరముల – రంగవల్లులతో కలకల
లాడ, గొబ్బెమ్మ – పూబంతు లలరగాను,
రమ్యగతి వచ్చె – స్వర్ణ సంక్రాంతి లక్ష్మి!

'అన్నదాతా! శుభమస్తు!' – అని – సిరిసం
పదల నొసగెడి – సౌభాగ్యలక్ష్మి!
'జై జవాను!' – యని – విజయాల నుగ్రహించు –
వీరదుర్గాంబ – శ్రీవిజయలక్ష్మి!
విద్యార్థుల – నఖిల విజ్ఞానులుగ తీర్చు –
విశ్వవిద్యా – మహావిభవలక్ష్మి!
సకల ప్రజల – దయాసాంద్రవై బ్రోచు –
అభయదాయిని! కరుణార్ద్రలక్ష్మి!

ధాన్యరాశులు – పూబంతిదండ లెల్ల –
పసిడికాంతుల రాజిల్లి – స్వాగతించ,
తెలుగు వెలుగులు – పుడమిని తేజరిల్ల –
రమ్ము – విశ్వకళ్యాణ సంక్రాంతి లక్ష్మి!

– 'కళ్యాణశ్రీ' జంధ్యాల వేంకటరామశాస్త్రి

రంగవల్లుల ముంగిలి

రంగు రంగుల ముగ్గులతో ముంగిలి
పుత్తడిబొమ్మలా ముస్తాబైంది
గొబ్బెమ్మల సొబగులతో వీధి మొత్తం
ఇంద్ర ధనువులా కాంతివంతమైంది
బంధువుల రాకతో ఇల్లు మొత్తం
అలంకారపూరితమైంది



సేద్యపు యంత్రాంగం
పూజకు నోచుకుంటూ ఆనందించింది
కొత్త బట్టల కొంగొత్త శోభతో
పండుగ రోజు మిరుమిట్లు గొలిపింది
బసవన్నల రాకతో
గృహప్రాంగణం పావనమై వెలిగింది
హరిదాసుల ఆలాపనలో
మకర సంక్రమణం పులకించిపోయింది

పచ్చని పల్లెపట్టు ప్రకృతి యదపై
హాయిగా ఒదిగిపోయింది
చిరునవ్వుల వెలుగులు మొత్తం
పిల్లల మోములో కళలు పుట్టించింది
కోవెల భక్త బృందాల సందడితో
భక్తిగీతాలాపనతో మైమరచిపోయింది
ఐనవారి ఆగమనంలో
ఆనందం గాలిపటమై పైపైకెగసింది

– నరెద్దుల రాజారెడ్డి

లాస్యహేల


సీ. హరినామస్మరణలో పరుగులు పెట్టేటి
హరిదాసు దీవెనల్ హంగు గూర్చ!
డూడూల బసవన్న డోలు సన్నాయితో
రంగవల్లుల వీధి రంజిలంగ!
ప్రొద్దుట సూరీడు పూలబాలలపైని
తుహినపు ముత్యాల రహిని గూర్చ!
అరిసెల కతనాన అమ్మలక్కలు జేయు
వరువాత రోకళ్ళ వాద్యఘోష!

తే. సస్య సిరులతో కర్షక లాస్యహేల
గొబ్బిపాటల వనితల కూజితాల
కొత్త అల్లుళ్ళ సందళ్ళు కూర్చువేళ
అరుగుదెంచెడి సంక్రాంతి స్వాగతమ్ము!

– మోదుకూరు రాధాకృష్ణశర్మ

అనుబంధాల పండగ

అరిసెల వంటల ఘుమఘుమలు
గరిసెల ధాన్యపు గలగలలు
విరిసిన బంతుల కళ కళలు
కలిసిన నేస్తపు గుసగుసలు
వాడలు చేరిన వలస పక్షులు
వీడని వాడని పాత గురుతులు
గోరంతలయ్యే చిరుబురులు
కొండంత నవ్వుల పెళపెళలు
గంగిరెద్దు మెడగంటల గణగణలు
ఊరి గుడిలో మంత్ర ధ్వనులు
వీధివీధినా రంగుల ముగ్గులు
రేపగలూ పిల్లల గంతులు



తెలుగువారి సంబరాల సంక్రాంతి
అందమైన అనుబంధాలను
మరవనివ్వని వెలుగు జ్యోతి

– డి.వి.జి. శంకరరావు

రాహుల్‌పై 'అర్బన్ నక్సల్' అస్త్రం!

పార్లమెంటు శీతాకాల సమావేశాలలో రాజ్యాంగంపై చర్చ ఒక వికృతమైన కలహంగా మారింది. పాలక, ప్రతిపక్ష సభ్యుల జరిగిన పొట్లాటలో కొంత మంది ఎంపీలు శారీరకంగా గాయపడ్డారు. ఈ శోచనీయ పరిణామానికి ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీయే కారణమని పాలక పక్ష ఎంపీలు తీవ్రంగా ఆరోపించారు. సభలో చోటుచేసుకున్న ఈ ద్వంద్వ యుద్ధాన్ని 2001లో పార్లమెంటుపై పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద బృందాల దాడిగా బీజేపీ ఎంపీ ఒకరు అభివర్ణించారు! ప్రతిపక్ష సభ్యులు 'అర్బన్ నక్సల్స్'గా సభలోకి ప్రవేశించారని కూడా ఆ ఎంపీ ఆరోపించారు.


రాహుల్‌గాంధీని ఒక 'అర్బన్ నక్సల్'గా చిత్రించే ప్రయత్నాలు గత కొంత కాలంగా జరుగుతున్నాయి. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు డాక్టర్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని రక్షించుకోవడం, సామాజిక న్యాయం, కుల గణన, జాతీయ సంపద పునః పంపిణీ తదితర అంశాలపై రాహుల్ ఉపన్యాసాలను 'నక్సలైట్ అజెండా'గా పాలక పక్షం పదే పదే అభివర్ణించింది. ఇటీవలి శాసనసభ ఎన్నికల సందర్భంగా కూడా రాహుల్‌పై అటువంటి విమర్శలనే తీవ్రంగా గుప్పించారు. మహారాష్ట్ర, హర్యానా శాసనసభ ఎన్నికలలో విజయం సాధించడం బీజేపీకి తప్పనిసరి అయింది. ఆ అనివార్యతకు రాజకీయ, ఆర్థిక కారణాలు రెండూ ఉన్నాయి. అవి: సార్వత్రిక ఎన్నికలలో కోల్పోయిన సీట్లను మళ్లీ స్వాయత్తం చేసుకోవడం; ముంబై, గుర్గావ్ ఆర్థిక వ్యవస్థలపై నియంత్రణ సాధించడం.

2004లో రాహుల్‌గాంధీ రాజకీయాలలోకి ప్రవేశించిన నాటి నుంచి ఆయనను రాజకీయంగా అంతమొందించడానికి బీజేపీ నాయకులు శతథా ప్రయత్నిస్తూనే ఉన్నారు. అప్పట్లో ఆయన్ను 'పప్పు' అని అపహసిస్తుండేవారు. ఆయనొక అపరిణత యువకుడు అని, పరిణత నాయకుడుగా ఎట్టి పరిస్థితులలోను ఎదగలేరని వారు తరచు ఎద్దేవా చేస్తుండేవారు. రాహుల్ గురించిన ఈ కథనాన్ని బీజేపీ, దాని మాతృసంస్థ, సోదర సంస్థలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లడంలో విజయవంతమయ్యాయి. ఆ ప్రచారం ఎంత ప్రభావశీలంగా ఉన్నదంటే కాంగ్రెస్ పార్టీ ద్వితీయ స్థాయి నాయకులు సైతం దానిని దాదాపుగా విశ్వసించడం జరిగింది!

భారత్ జోడో యాత్ర (కన్యాకుమారి నుంచి శ్రీనగర్ దాకా), న్యాయ్ యాత్ర (మణిపూర్ నుంచి ముంబై దాకా) నిర్వహించేందుకు రాహుల్ నిర్ణయించుకోవడం పలువురిని విస్మయపరిచింది. అదొక సాహసోపేత నిర్ణయం, సందేహం లేదు. ఆ యాత్రలలో రాహుల్ దేశ వ్యాప్తంగా పర్యటించడంతో పాటు ప్రజలను విస్తృతంగా కలుసుకున్నారు. వారితో సంభాషించారు. వారు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను కూలంకషంగా తెలుసుకున్నారు. దీనితో పాటు మీడియా ప్రతినిధులు, మేధావి వర్గాలతో విస్తృత స్థాయిలో చర్చలు జరిపారు. ఈ ఉభయ యాత్రలతో అశేష ప్రజలకు రాహుల్ సన్నిహితమయ్యారు. ఈ పరిణామం అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ నాయకులు ఇరువురినీ అమితంగా విస్మయపరిచింది. న్యాయ్ యాత్రతో తన ప్రజాకర్షణ శక్తిని రాహుల్ ఇతోధికంగా పెంచుకున్నారు.

కాంగ్రెస్ మనుగడకు ఆలంబన గాంధీ కుటుంబ నాయకత్వమన్న వాస్తవం బీజేపీకి బాగా తెలుసు. కాంగ్రెస్‌కు గాంధీ కుటుంబ నాయకత్వం లేకుండా చేస్తే ఆ పార్టీని ఉనికిలో లేకుండా రూపుమాపడం సులువవుతుందని బీజేపీ విశ్వసిస్తోంది. బీజేపీ దాడుల నుంచి రాహుల్‌ను రక్షించగల స్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉన్నదా?

రాహుల్‌లో వచ్చిన ఈ పరివర్తన బీజేపీని ఎందుకు కలవరపరిచింది? కాంగ్రెస్‌ను తన ప్రధాన ప్రత్యర్థిగా బీజేపీ పరిగణిస్తోంది. న్యూఢిల్లీలో అధికారానికి తనతో పోటీపడగల సమఉజ్జీ అని కూడా భావిస్తోంది. కాంగ్రెస్ అఖిల భారత రాజకీయ పక్షమని, ఆసేతు హిమాచలం ఆ పార్టీకి సంస్థాగత బలం ఉన్నదని బీజేపీకి బాగా తెలుసు. ఏ ప్రాంతీయ పార్టీ కూడా కాంగ్రెస్ మాదిరిగా తనతో పోటీకి రాలేదన్నది బీజేపీ భరోసా. కాంగ్రెస్ మనుగడకు ఆలంబన గాంధీ కుటుంబ నాయకత్వమన్న వాస్తవం కూడా బీజేపీకి బాగా తెలుసు. కాంగ్రెస్‌కు గాంధీ కుటుంబ నాయకత్వం లేకుండా చేస్తే ఆ పార్టీని ఉనికిలో లేకుండా రూపుమాపడం సులువవుతుందని బీజేపీ విశ్వసిస్తోంది. గాంధీల వలే దేశవ్యాప్తంగా ప్రజలను ఆకట్టుకోగల నాయకులు



మరెవ్వరూ కాంగ్రెస్‌కు లేరు అన్నది బీజేపీ సునిశ్చిత భావన. గాంధీ కుటుంబేతర వ్యక్తులు ఎవరినీ జాతీయ స్థాయిలో నాయకులుగా రూపొందించుకోలేకపోవడం కాంగ్రెస్ పార్టీ స్వతస్సిద్ధ బలహీనత. కాంగ్రెస్ జాతీయ నాయకత్వంలో గాంధీ కుటుంబాన్ని లేకుండా చేసినప్పుడు మాత్రమే బీజేపీ తిరుగులేని సంపూర్ణ జాతీయ పార్టీగా ఆవిర్భవించగలదు.

కాంగ్రెస్ ప్రాభవ ప్రాబల్యాలను పూర్తిగా అణచివేయడం బీజేపీకి అనివార్యమయింది. బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉన్నంతవరకు ప్రాంతీయ పార్టీలను తనకు అనుకూల పరచుకోవడంలో సఫలమయింది. బీజేపీని సైద్ధాంతికంగా వ్యతిరేకించే ప్రాంతీయ పార్టీలు చాలా చాలా తక్కువ. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఇండియా కూటమిలోని అనేక పార్టీలు సైతం తమకుతాముగా కాంగ్రెస్‌కు దూరం జరుగుతున్నాయి. ఎన్నికలలో పరాజయాలకు కాంగ్రెస్ పార్టీయే కారణమని అవి గట్టిగా విశ్వసించడం వల్లే ఇండియా కూటమి విచ్ఛిన్నమయిపోయే దుస్థితి దాపురిల్లింది. అయినప్పటికీ గత వేసవిలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ ఒక ప్రధాన శక్తిగా ప్రభవించడం బీజేపీని గందరగోళ పరుస్తోంది. ముఖ్యంగా ఆయన ప్రతిపాదిస్తున్న సామాజిక న్యాయం, సంపద పునఃపంపిణీ అజెండాలకు సమాజంలోని అట్టడుగు వర్గాల వారి నుంచి అపురూపమైన ప్రతిస్పందన లభిస్తోంది. ఇది బీజేపీని వెన్వెంటనే కాకపోయినా సమీప భవిష్యత్తులో అస్థిరత్వం పాలు చేసే ప్రమాదం ఎంతైనా ఉన్నది. ఈ వాస్తవాన్ని గుర్తించిన బీజేపీ రాహుల్‌గాంధీకి వ్యతిరేకంగా 'అర్బన్ నక్సల్' కథనాన్ని విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా ఆయన నాయకత్వాన్ని అపఖ్యాతి పాలు చేసేందుకు అన్ని విధాల ప్రయత్నిస్తోంది.

బీజేపీ కుటిల దాడుల నుంచి రాహుల్‌ను రక్షించగల స్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉన్నదా? కాంగ్రెస్ నాయకులలో ఎంత మంది రాహుల్ ప్రతిపాదిస్తున్న సామాజిక న్యాయ, సంపద పునః పంపిణీ లక్ష్యాలకు నిబద్ధమై ఉన్నారు? కాంగ్రెస్ పార్టీని జాతీయ కార్యనిర్వాహక వర్గం స్థాయి నుంచి గ్రామ కమిటీల వరకు సామాజిక న్యాయం ప్రాతిపదికన పునర్వ్యవస్థీకరించని పక్షంలో పై ప్రశ్నలకు సరైన సమాధానాలు రావుగాక రావు. ఎందుకని? చాలా మంది కాంగ్రెస్ నాయకుల సామాజిక న్యాయసాధన లక్ష్య స్ఫూర్తి పూర్తిగా సందేహాస్పదమైనది. ఆ పార్టీ ద్వితీయ స్థాయి నాయకులలో అత్యధికులు కరడుగట్టిన మితవాదులు లేదా కులీన వర్గాలకు చెందినవారే. రాహుల్ గాంధీ భావాలు, ఆదర్శాలను వారు విశ్వసిస్తున్నారని చెప్పగల పరిస్థితి ఏ మాత్రం లేదు. నిజానికి రాహుల్ నిర్వహించిన భారత్ జోడో, న్యాయ్ యాత్రలు దేశ వ్యాప్తంగా ప్రజలను ఎంతగానో ఉత్తేజపరిచాయి. ప్రజాభిప్రాయం కాంగ్రెస్‌కు అనుకూలంగా మారినప్పటికీ ఆ సానుకూలతను ఓట్లుగా మార్చుకోవడంలో రాష్ట్ర స్థాయిలోని ద్వితీయ స్థాయి నాయకులు ఘోరంగా విఫలమయ్యారు.

ఇటీవలి సంవత్సరాలలో ఒక ఆసక్తికర పరిణామం చోటుచేసుకొంటోంది. గతంలో కాంగ్రెస్ పట్ల బద్ధ వ్యతిరేకత చూపినవారు సైతం ఇప్పుడు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కాంగ్రెస్‌కు మద్దతునిస్తున్నారు. అయితే కాంగ్రెస్ వారిని విశ్వాసంలోకి తీసుకోవడం లేదు. దేశ రాజకీయాలలో మళ్లీ అగ్రగామి శక్తిగా ఆవిర్భవించాలంటే అటువంటి ఉపేక్షా ధోరణులను కాంగ్రెస్ తక్షణమే విడనాడవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. పార్టీ పనితీరులో ఒక మౌలిక మార్పు అవశ్యం వచ్చి తీరాలి. రాహుల్ నాయకత్వంపై బీజేపీ దాడులను తన మిత్రపక్షాలు ఏవీ ఖండించకపోవడం కాంగ్రెస్‌ను ఎంతైనా కలవరపెడుతోంది పైగా బీజేపీ వలే అవి కూడా రాహుల్ నాయత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఈ ధోరణులు బాగా ప్రబలిపోతున్నాయి.

ఈ పరిస్థితుల దృష్ట్యా కాంగ్రెస్ ముందున్న ప్రత్యామ్నాయం బీజేపీకి వ్యతిరేకంగా ఒంటరిగా పోరాడటమే, తప్పదు. అయితే కాంగ్రెస్ ప్రస్తుతమున్న పరిస్థితుల్లో అది అసాధ్యం. దేశ రాజకీయాలు అంతకంతకూ భావజాల పోరాటంగా పరిణమిస్తున్నాయన్న వాస్తవం విస్మరించరానిది. సమస్యేమిటంటే కాంగ్రెస్ శ్రేణులు తమ నాయకుడిని అనుసరించలేకపోతున్నాయి. ప్రజలకు సంబంధించిన వివిధ అంశాలపై ఆయన సాహసోపేతంగా నిర్దేశిస్తున్న అజెండాలను అర్థం చేసుకోలేకపోతున్నాయి. కాంగ్రెస్ శ్రేణుల ఉదాసీన వైఖరులను రాహుల్ మార్చగలరా? తన భావాలు, భావజాలాన్ని సమాజంలోని అట్టడుగు స్థాయి వర్గాలకి తెలియజేసి వారితో సహా దేశ ప్రజలనందరినీ ఉత్తేజపరిచేందుకు వాటికి మనసా వాచా కర్మణా నిబద్ధమయి, అంకితభావంతో కృషి చేసే కొత్త తరం కార్యకర్తలు, నాయకుల అవసరం రాహుల్‌కు విశేషంగా ఉన్నది.

■ ప్రొఫెసర్ భంగ్యా భూక్యా
హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం

తిరుమల లడ్డూకౌంటర్‌లో సోమవారం స్వల్ప అగ్నిప్రమాదం జరిగింది. 47వ నంబరు కౌంటర్‌లోని కంప్యూటర్ వైర్ నుంచి మంటలు వ్యాపించాయి. దీంతో కౌంటర్ల వద్ద భక్తులు భయభ్రాంతులయ్యారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించినట్టు అధికారులు తెలిపారు. సిబ్బంది హుటాహుటిన విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. వైర్లన్నీ తొలగించడంతో పెను ప్రమాదం తప్పింది.

ఆ కాంట్రాక్ట్ ఉద్యోగి చేతివాటం రూ.46లక్షలు!


బంగారు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్న పోలీసులు

తిరుమల, జనవరి13(ఆంధ్రజ్యోతి): తిరుమల పరకామణి దొంగతనం కేసులో కొత్త విషయాలు వెలుగుచూశాయి. వంద గ్రాముల గోల్డ్ బిస్కెట్ దొంగతనం చేసేందుకు ప్రయత్నించి పట్టుబడిన అగ్రిపోస్ కాంట్రాక్ట్ ఉద్యోగి వీరిశెట్టి పెంచలయ్య నుంచి దాదాపు రూ.46 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెంచలయ్య శనివారం మధ్యాహ్నం ఖాళీ ట్రాలీ పైపు ద్వారా వంద గ్రాముల బంగా రు బిస్కెట్‌ను తస్కరించే ప్రయత్నం చేయగా విజిలెన్స్ అధికారులు గుర్తించి పట్టుకున్న విషయం తెలిసిందే. అతడిపై శనివారమే కేసు నమోదు చేయగా, ఆదివారం విషయం వెలుగులోకి వచ్చింది. పెంచలయ్యను తిరుమల వన్‌టౌన్ పోలీసులు తమదైన శైలిలో విచారించి, అతడి నుంచి 655 గ్రాముల బరువు కలిగిన బంగారు బిస్కెట్, ఆభరణాలతో పాటు మరో 157 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ దాదాపు రూ.46 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. కాగా, పెంచలయ్య రెండేళ్లుగా పరకామణిలో విధులు నిర్వహిస్తున్నాడు. అతని తీరు అనుమానాస్పదంగా ఉండటంతో ప్రత్యేక నిఘా ఉంచిన విజిలెన్స్ అధికారులు శనివారం నేరుగా పట్టుకున్నారు.

మాజీ ఎంపీ 'పాలవలస' కన్నుమూత




శ్రీకాకుళం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ మాజీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పాలవలస రాజశేఖరం(77) కన్నుమూశారు. గత కొన్నాళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఈయనకు భార్య ఇందుమతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు పాలవలస విక్రాంత్ వైసీపీ ఎమ్మెల్సీగా ఉన్నారు. కుమార్తె రెడ్డి శాంతి 2019లో పాతపట్నం వైసీపీ ఎమ్మెల్యేగా సేవలందించారు.


విద్యుత్ దీపాల వెలుగులో రామవరప్పాడు బరి




ఈడుపుగల్లు బరిలో సందడి

కోడి పుంజులు కత్తులు కట్టుకుని బరిలో దిగాయి. గెలుపుపై పందేలు పరుగులు తీశాయి. పేకాట, గుండాట వంటి జూద శిబిరాలు యథేచ్ఛగా కొనసాగాయి. షాపుల్లో విక్రయించాల్సిన మద్యం బరుల్లో ఏరులై పారింది. ఇది సంక్రాంతి సంబరాల్లో భోగి రోజున ఉమ్మడి కృష్ణాజిల్లాలో కనిపించిన దృశ్యాలు. జగ్గయ్యపేట నుంచి 'జంక్షన్' వరకు, బెజవాడ నుంచి బందరు వరకు ఎటుచూసినా కోడిపందేల సందడే సందడి. జూదాలు నిర్వహిస్తే లోపల వేస్తామని హెచ్చరికలు జారీ చేసిన పోలీస్‌శాఖ రాజకీయ బలం ముందు తలవంచింది. ఈ నేపథ్యంలో సంక్రాంతి సంబరాల ముసుగులో కోట్ల రూపాయలు చేతులుమారాయి.


విద్యుత్ దీపాల వెలుగులో ఈడుపుగల్లు బరి


జూదంలో పాల్గొన్న పందెం రాయుళ్లు

కోళ్లు..కోట్లు

ఉమ్మడి జిల్లాలో యథేచ్ఛగా కోడి పందేలు

తొలిరోజు రూ.20 కోట్లపైనే..
- బరుల వద్ద బరితెగించిన 'బెల్టు'
- కంకిపాడులో పోటాపోటీగా బరులు
- పందేలకు జతగా పేకాట, గుండాట
- తెలంగాణ, ఒడిశా నుంచి వచ్చిన సందర్శకులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/మచిలీపట్నం): ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలో తొలిరోజున రూ.20 కోట్ల వరకు పందేలు సాగాయి. తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న బూదవాడ, గరికిపాడు, జగ్గయ్యపేటల్లో సోమవారం ఒక్కరోజే రూ.కోటి వరకు పందేలు నడిచాయి. ఎన్టీఆర్ జిల్లాతో పోల్చుకుంటే కృష్ణాజిల్లాలో అత్యధిక సంఖ్యలో బరులు ఏర్పాటు చేశారు. ఇక్కడ పందేలూ అదేస్థాయిలో జరిగాయి. బాపులపాడు మండలం అంపాపురం, కంకిపాడు మండలం ఈడుపుగల్లులో భారీగా పందేలు నడిచాయి. అంపాపురంలో రూ.10 లక్షలు ఆ పైబడిన పందేలకు రెండు ప్రత్యేక బరులను ఏర్పాటు చేశారు. తొలి రోజు 11 పందేలు జరిగాయి. రూ1-5లక్షల లోపు పందేల కోసం ఐదు బరులను కేటాయించారు. తెలంగాణ ఒడిశా రాష్ట్రాలకు చెందిన మహిళలు ఇక్కడకు వచ్చి పెద్దఎత్తున పందేలు కాశారు. నాలుగు చిన్నబరులు, పదికిపైగా పేకాట శిబిరాలతోపాటు కేసినో ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో మొదటి రోజున మూడు కోట్ల రూపాయల వరకు నగదు చేతులు మారింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున కార్లలో పందెం రాయుళ్లు ఇక్కడకు తరలివచ్చారు. నగదు రూపంలో కాకుండా టోకెన్లు అందించి మరీ పందెం రాయుళ్లను లోపలికి అనుమతించారు. అంపాపురంలో ఉన్న బరుల వద్ద క్యాసినో నిర్వహణకు రెండు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ అనుమతి ఉన్న వారిని మాత్రమే లోపలకు అనుమతించడానికి బౌన్సర్లను ఏర్పాటు చేశారు. పేకాట, లోపల-బయట, గుండాట, కోతముక్కల జూదాన్ని నిర్వాహకులు బహిరంగంగా నిర్వహించారు.





పోటాపోటీగా బరులు

కంకిపాడు మండలంలో కూటమి ప్రభుత్వంలో భాగంగా ఉన్న టీడీపీ, జనసేన నేతలు పోటాపోటీగా బరులను ఏర్పాటు చేశారు. విజయవాడ రూరల్ మండలం జక్కంపూడిలోని పాముల కాల్వ వద్ద టీడీపీ నాయకుడు ఏర్పాటు చేసిన బరులను ఎంపీ కేశినేని చిన్ని ప్రారంభించారు. పందేలు, జూదంతో బరుల వద్ద జాతర వాతావరణం కనిపించింది.

బరుల వద్ద మినీబార్‌లు

బరుల వద్ద మద్యం ఏరులై పారింది. బిర్యానీ స్టాల్, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్ స్టాల్స్‌ను పాటలు నిర్వహించి మరీ కేటాయించారు. సంక్రాంతి సంబరాల్లో ముక్క, మందు సాధారణం కావడంతో మద్యం స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల మద్యం వ్యాపారులే ఈ స్టాల్స్‌ను నిర్వహించుకున్నారు. కొంతమంది మద్యం దుకాణాల్లో మందు కొనుగోలు చేసి సరుకును బరుల వద్దకు తీసుకొచ్చారు. అధిక ధరలకు మిగతా 8లో..


కోడి పందేల బరుల వద్ద మహిళల సందడి


పటమటలో పందేల హోరు



జోసఫ్ తంబి తిరునాళ్లు ప్రారంభం 10లో



దుర్గగుడిలో శాస్త్రోక్తంగా భోగి మంటలు

ఘనంగా భోగి


విజయవాడ ఎస్ఎల్‌వీలో భోగి మంట

భోగ భాగ్యాలనిచ్చే భోగి పండుగను ప్రతి ఇంటా సోమవారం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. వేకువజామునే లేచి భోగిమంటలు వేశారు. చిన్నారులను అందంగా ముస్తాబు చేసి భోగి పళ్లు పోశారు. పిండి వంటలు చేస్తూ, బంధు మిత్రులతో సందడిగా గడిపారు.

శరవేగంగా..

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఏటీసీ టవర్ పనులు


తుది మెరుగులు దిద్దుకుంటున్న ఏటీసీ టవర్

- జూన్ నెలాఖరు నాటికి అందుబాటులోకి..
- ఏర్పాటుకానున్న అత్యాధునిక సాంకేతిక వ్యవస్థలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిర్‌ట్రాఫిక్ సెంటర్ టవర్ (ఏటీసీ) నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 80 శాతం మేర పనులు పూర్తయ్యాయి. విమానాశ్రయంలో ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ పనుల్లో అంతర్భాగంగా ఏటీసీ టవర్‌ను నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. మూడేళ్లుగా ఈ టవర్ నిర్మాణ పనుల్లో జాప్యం జరిగినప్పటికీ ప్రస్తుతం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ పనులు కూడా 60 శాతం మేర పురోగతిలో ఉన్నాయి. జూన్ నెలాఖరు నాటికి టెర్మినల్ బిల్డింగ్, ఏటీసీ టవర్ నిర్మాణ పనులు పూర్తికానున్నాయి. ఏటీసీ టవర్ నిర్మాణ పనులన్నీ పూర్తయినా ప్రస్తుతం ఇంటీరియర్ పనులు జరుగుతున్నాయి. టవర్ రూఫ్ పనులు కూడా తుది దశలో ఉన్నాయి. ఏటీసీ టవర్‌లో అత్యాధునిక సాంకేతికతతో కూడిన వ్యవస్థలను ఏర్పాటు చేస్తారు. విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌లు ఏటీసీ టవర్ ఇచ్చే సంకేతాల ద్వారానే జరుగుతాయి. ఏటీసీ టవర్‌కు అనుసంధానంగా ఏటీసీ కాంప్లెక్స్ నిర్మించారు. ఇక్కడ కూడా ఇంటీరియర్ పనులు జరుగుతున్నాయి. గ్లాస్ ఫిటింగ్ పనులు చేస్తున్నారు. ఏటీసీ కాంప్లెక్స్‌లో ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్ తదితర విభాగాలు కొలువుతీరతాయి.


కాల్వగట్టు ఆక్రమించి నిర్మించిన కన్యకాపరమేశ్వరి ఆలయం, కల్యాణ మండపం

బేఖాతరు!

అక్రమ కట్టడాలపై అమలుకు నోచుకోని లోకాయుక్త ఆదేశాలు

కాల్వగట్టు ఆక్రమించి కన్యకాపరమేశ్వరి ఆలయం, కల్యాణ మండపం నిర్మాణం

బుడమేరు వరదల తర్వాత కూడా అధికారుల తీరు మారడం లేదు. కాల్వ కట్టలను ఆక్రమించి జరుగుతున్న నిర్మాణాలను వారు అడ్డుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో లోకాయుక్త జోక్యం చేసుకుని కాల్వకట్టలపై అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను కూల్చేయాల్సిందిగా గత ఏడాది డిసెంబరు 17వ తేదీన వీఎంసీ కమిషనర్, కలెక్టర్, జలవనరులశాఖ చీఫ్ ఇంజనీరుకు ఆదేశాలు ఇచ్చింది. ఈ ఆదేశాలను అధికారులు ఇంత వరకు అమలు చేయలేదు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- నీటిపారుదల శాఖ స్థలంలో కట్టడాలు తొలగించాలన్న లోకాయుక్త
- వీఎంసీ కమిషనర్, కలెక్టర్, జలవనరులశాఖ చీఫ్ ఇంజనీరుకు ఆదేశాలు

(విజయవాడ/వన్‌టౌన్ - ఆంధ్రజ్యోతి): విజయవాడ సత్యనారాయణపురం వాటర్ ట్యాంక్ పక్కన, ఏలూరు కాల్వ ఒడ్డున ఇరిగేషన్ స్థలంలో స్థానికులు కన్యకాపరమేశ్వరి ఆలయం, కల్యాణ మండపం నిర్మాణం చేపట్టారు. దీనిపై 2023 మే 31న, జూన్ 1న ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనాలు ప్రచురించింది. అదే సమయంలో కేదారేశ్వరపేటకు చెందిన ఎం.వి.సుబ్బారావు ఈ అక్రమ నిర్మాణాలపై లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్రంగా విచారణ జరిపిన లోకాయుక్త ఆ నిర్మాణాలను నిలిపివేయాలని, పూర్తి చేసి ఉంటే తొలగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. కన్యకాపరమేశ్వరి ఆలయం, కల్యాణ మండపం ఎటువంటి అనుమతులు లేకుండా జలవనరుల శాఖ స్థలంలో నిర్మించడాన్ని తప్పుపట్టింది. సుమారు రూ.5 కోట్లు విలువైన 1000 చదరపు గజాల స్థలంలో కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని నిర్మించారని ఇది సరైన విధానం కాదని లోకాయుక్త వ్యాఖ్యానించింది. గత ఏడాది డిసెంబరు 17వ తేదీన దీనిపై ఆదేశాలు జారీ చేసింది.

మాది కాదంటే మాది కాదంటూ..

లోకాయుక్త ఆదేశాలపై అటు జలవనరుల శాఖ ఇటు మున్సిపల్, రెవెన్యూ శాఖలు తమ పరిధి కాదంటే తమ పరిధి కాదంటూ ఒకరిపై ఒకరు నెపాన్ని నెట్టేసుకుంటున్నారు. జలవనరుల శాఖ అధికారులు ఆక్రమణలను తొలగించే అధికారం తమకు లేదని చెబుతున్నారు. ఆక్రమణల తొలగింపు కార్యక్రమం మున్సిపల్, రెవెన్యూ శాఖలు చూసుకుంటాయని పేర్కొంటున్నారు. ఏలూరు కాల్వ ఒడ్డు సగభాగాన్ని ఆక్రమించుకుని ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేసినా తమకు సంబంధం లేదని జలవనరుల శాఖ చేతులు దులుపుకోవడం ఎంత వరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పైగా ఇదే విషయాన్ని 2023 డిసెంబరు 22న జలవనరుల శాఖ ఇంజనీరింగ్ చీఫ్ తన నివేదికలో లిఖితపూర్వకంగా పేర్కొన్నారు. జలవనరుల శాఖకు ఆక్రమణల తొలగింపునకు సంబంధించి ఎటువంటి అధికారాలు లేవని ఆ నివేదికలో స్పష్టం చేశారు. ఆక్రమణల తొలగింపు బాధ్యత మున్సిపల్ అధికారులదేనని తెలిపారు. మరోవైపు మున్సిపల్, రెవెన్యూ అధికారులు సైతం ఆక్రమణలు నీటిపారుదల శాఖ స్థలంలో జరిగాయని, వారు కోరితే తప్ప తాము వాటిని తొలగించలేమని చేతులు దులిపేసుకుంటున్నారు. ఆక్రమణదారులను రక్షించేందుకు ఈ శాఖలు ఒకరిపై ఒకరు నెపాన్ని నెట్టేసుకుంటున్నారు. వాస్తవానికి జలవనరుల శాఖ తమ స్థలం ఆక్రమణకు గురైనప్పుడు రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సహకారంతో ఆక్రమణలను తొలగించే అవకాశం ఉంది. కానీ ఉద్దేశపూర్వకంగానే ఎవరికి వారు తమకు పట్టనట్టు వ్యవహరిస్తుండటం గమనార్హం.


కన్నేశారు.. కట్టేశారు!

అక్రమణ నిర్మాణాలపై 2023 మే 31న ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనం


బెంజి సర్కిల్ వద్ద

నిర్మానుష్యంగా రోడ్లు

నిత్యం వాహనాల రణధ్వనులతో మార్మోగే విజయవాడ నగరంలోని ప్రధాన రోడ్లపై సోమవారం నిశ్శబ్దం రాజ్యమేలింది. వాహనాల రద్దీతో కిక్కిరిసిపోయే బెంజి సర్కిల్, రామవరప్పాడు రింగు, బస్టాండ్ సెంటర్ తదితర కూడళ్లు నిర్మానుష్యంగా మారాయి. సంక్రాంతి పండుగ వేళ నగరవాసులంతా పల్లెబాట పట్టడం, ఉన్న వారు సైతం ఇంటికే పరిమితం కావడంతో జనం లేక బెజవాడ వెలవెలబోయింది.

పేరంటాలమ్మ సంక్రాంతి జాతర ప్రారంభం 10లో



ఉప్పులూరులో కోడిపందేల బరి



కోడూరు తూర్పు వైపు రామాలయం సమీపంలోని బరి వద్ద భారీగా నిలిపిన బైక్‌లు



ఎ.కొండూరు మండలం చీమలపాడులో సంప్రదాయ కోడిపందేలు ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, శావల దేవదత్

కాలుదువ్విన కోళ్లు

సంక్రాంతిని పురస్కరించుకుని సంప్రదాయం పేరుతో సోమవారం కోడిపందేలు జోరుగా సాగాయి. కాళ్లకు కత్తులతో పందెం కోళ్లు బరిలో కాలుదువ్వాయి. తొలి రోజైన భోగి పండుగ నాడే భారీగా నగదు చేతులు మారింది. బరుల వద్ద నిర్వాహకులు జూద క్రీడలు ఏర్పాటు చేశారు. పురుషులకు దీటుగా మహిళలు కూడా గుండాట, కోడిపందేల్లో భారీగా పందేలు కాశారు.

- బరుల వద్ద గుండాట, జూదశిబిరాలు
- తొలిరోజు భారీగా చేతులు మారిన నగదు



అంపాపురం బరివద్ద కోడి కాలికి కత్తి కడుతున్న దృశ్యం



పటమట డీమార్ట్ వెనుకవైపున బరిలో..



అంపాపురంలో నోట్ల కట్టలతో పందెంరాయుళ్లు



క్రెడిట్, డెబిట్‌కార్డులు, గూగుల్, ఫోన్‌పేలకు స్పాట్‌క్యాష్ ఇస్తామని రామవరప్పాడు బరివద్ద బ్యానర్



కృత్తివెన్ను మండలం మునిపెడలో విజేతకు ఇచ్చేందుకు బరి వద్ద ఉంచిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్



ఈడుపుగల్లు బరి వద్ద భారీ సంఖ్యలో నిలిపి ఉంచిన వాహనాలు

కృత్తివెన్ను, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో విచ్చలవిడిగా బరులు ఏర్పాటు చేశారు. కోడి కాళ్లకు కత్తులు కట్టి బరుల్లో పందేలకు దించారు. జాతీయ రహదారి పక్కన కోడిపందేలతో పాటు, జూదక్రీడలు భారీగా నిర్వహిస్తున్నారు. మునిపెడ, గరిశపూడి, లక్ష్మీపురం రంగా సెంటర్, పల్లెపాలెం, లక్ష్మీపురం లాకు సెంటర్, నిడమర్రు, చినగొల్లపాలెం, కృత్తివెన్ను పల్లెపాలెం గ్రామాల్లో బరులు ఏర్పాటు చేశారు. మునిపెడలో విజేతకు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్, రంగా సెంటర్ బరిలో మరో బైక్‌ను బహుమతిగా ఇవ్వనున్నారు. జాతీయ రహదారి పక్కనే బరులు ఉండటంతో రహదారి పొడవునా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. రూ.లక్షలు చేతులు మారుతున్నాయి.

కోడూరులో యథేచ్ఛగా..

కోడూరు: కోడూరు తూర్పువైపు ప్రభుత్వాస్పత్రి సమీపంలో రెండు బరులు, కోడూరు-నరసింహాపురం రోడ్డులో ఒకటి, విశ్వనాథపల్లిలో మరొక బరిని ఏర్పాటు చేసి యథేచ్ఛగా కోడి పందేలు నిర్వహిస్తున్నారు. బరుల దగ్గర రాత్రివేళ ఇబ్బంది లేకుండా ఎల్ఎస్ఈడీ లైట్లు ఏర్పాట్లు చేశారు. రూ.లక్షలు చేతులు మారుతున్నాయి. పోలీసు అధికారులకు భారీస్థాయిలో ముడుపులు అందాయని తెలుస్తోంది.

తిరువూరు నియోజకవర్గంలో భారీగా..

తిరువూరు: నియోజకవర్గంలో భారీస్థాయిలో కోడిపందేలు, జూదాలు ప్రారంభమయ్యాయి. ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ ఛైర్మన్ శావల దేవదత్‌లు సంప్రదాయక కోడిపందేలు ప్రారంభించారు. ఎంపీ, ఎమ్మెల్యేలు కోడిపందేల శిబిరాలు సందర్శించేందుకు రావడంతో స్థానిక పోలీసు అధికారులు వారితో పాటు, పందేలు జరిగే తోటల్లోకి వచ్చారు. పార్టీ నాయకులతో కలిసి తోటల్లో విందుభోజనాలు చేశారు.



కోలాహలంగా అంపాపురం బరి కిక్కిరిసిన ప్రధాన బరి ప్రాంగణం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: అంపాపురం బరిలో సోమవారం మధ్యాహ్నం నుంచి కోడిపందేలు భారీగా ఊపందుకున్నాయి. రెండు పెద్ద బరుల్లో పదుల సంఖ్యలో రూ.లక్షల్లో పందేలు నడిచాయి. కోట్లలో నగదు చేతులు మారింది. పేకాట శిబిరం, గుండాట, కోసు ఏర్పాటు చేయడంతో బరి ప్రాంగణం కోలాహలంగా మారింది. కె.సీతారాంపురం, బీళ్లనపల్లితో పాటు వేలేరు, సింగన్నగూడెం, కొత్తపల్లి, తిప్పనగుంట గ్రామాల్లోనూ చిన్నచిన్న బరులు ఏర్పాటుచేశారు. అంపాపురం బరి వద్ద ప్రాగణం మొత్తం కార్లతో నిండిపోయింది. చుట్టుపక్కల గ్రామాలతో పాటు తెలంగాణ, ఒడిసాకు చెందినవారు, కృష్ణా, ఉభయగోదావరి జిల్లాలకు చెందిన వారు భారీగా తరలివచ్చారు. దూరం నుంచి వచ్చే వారికి నిర్వాహకులు ఆతిథ్యం ఏర్పాటు చేశారు.

టేబుల్ వద్దకే సమస్తం

పేకాట శిబిరంలో కూర్చున్నవారికి టేబుల్ వద్దకే మందు, విందు అందేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఇక లోన- బయట ఆటకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. ప్రధాన బరికి పోటీగా ఇక్కడ కూడా నగదు భారీగా చేతులు మారుతోంది. బార్లలో ప్రత్యేక బ్రాండ్ల మద్యం అందుబాటులో ఉంచారు. ఆహారం కోసం ప్రత్యేకంగా వంటశాల ఏర్పాటుచేశారు. మాంసాహార వంటలు అందుబాటులో ఉంచారు.

పందేలు కాస్తున్న మహిళలు

కోడిపందేల బరిలో కొందరు మహిళలు రూ.లక్షల్లో పందేలు కట్టారు. గుండాట ఆడేందుకూ మరికొందరు ఆసక్తి కనబరిచారు. మహిళలకు నిర్వాహకులు వీఐపీ సేవలందిస్తున్నారు.



అంపాపురం బరి వద్ద కార్లు



రామవరప్పాడు బరి వద్ద పుంజుపై నీళ్లు ఊదుతున్న పందెంరాయుడు



పటమట డీమార్ట్ వెనుక బరిలో చిన్న బజార్, పెద్ద బజార్ ఆడుతున్న ప్రజలు



మునిపెడ బరిలో పందేలు వీక్షిస్తున్న ప్రజలు



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్యకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

దుర్గమ్మ సేవలో జస్టిస్ ఎన్.జయసూర్య

వన్‌టౌన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మను సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అధికారులు ఆలయ మర్యాదలు చేశారు. అనంతరం పంచహారతుల సేవలో వారు పాల్గొన్నారు. అమ్మవారి దర్శనానంతరం వారికి అధికారులు, అర్చకులు ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు ఆశీస్సులు అందించారు.

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం

- అగ్నికి బైక్ ఆహుతి

వీరులపాడు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): బైక్‌పై నుంచి పడిన వ్యక్తికి మొక్కజొన్న బొండ్లకు అంటించిన మంటలు అంటుకోవడంతో రెండు కాళ్లూ కాలాయి. త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. బైక్ పూర్తిగా ఆహుతయ్యింది. ఈ ఘటన జుజ్జూరులో సోమవారం జరిగింది. జుజ్జూరు గ్రామానికి చెందిన చిట్లూరి హరిబాబు బంధువుల దహన సంస్కారాలకు చిన్న డొంక రోడ్డులోని శ్మశానవాటికకు వెళ్లి వస్తుండగా మార్గం మధ్యలో బైక్‌పై నుంచి కిందపడ్డాడు. అక్కడ మొక్కజొన్న బొండ్లు తగలబెట్టడంతో మంటలో పడ్డాడు. బైక్‌కు నిప్పంటుకుని పూర్తిగా ఆహుతైంది. హరిబాబు రెండు కాళ్లు మంటల్లో కాలాయి. త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. 108లో బంధువులు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.



పూర్తిగా కాలిపోయిన బైక్

పూటీ లాగుడు పోటీలు ప్రారంభం

ఘంటసాల, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా డాక్టర్ గొర్రెపాటి నవనీతకృష్ణ మెమోరియల్ ఆధ్వర్యంలో ఘంటసాల జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి వృషభరాజముల పూటీ లాగుడు బల ప్రదర్శన పోటీలను ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు ప్రారంభించారు. సోమ, మంగళవారాల్లో సీనియర్, జూనియర్, న్యూ జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని నిర్వాహకుడు బండి పరాత్పరరావు తెలిపారు. బరిని ఎన్ఆర్ఐ రంగనాథ్‌బాబు ప్రారంభించారు. పోటీలను ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు లాంఛనాంగా ప్రారంభించారు. తొలి ప్రదర్శన ఇచ్చిన ఎడ్ల జత రైతు, సర్పంచ్ వెనిగళ్ల రామకృష్ణ ప్రసాద్‌కు కొనకళ్ల మెమొంటో అందజేశారు.



ఘంటసాల హైస్కూల్‌లో రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల పూటీ లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు

ముగ్గు మనోహరం

500 మీటర్ల పొడవు రోడ్డుపై 30 రంగవల్లులు

మోపిదేవి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి పంచాయతీ శివారు రావివారిపాలెంలోని రావి సురేశ్ ఇంటి వద్ద సిమెంట్ రోడ్డుపై ఆయన సతీమణి జయశ్రీ 500 మీటర్ల పొడవునా 30 రకాల రంగవల్లులను సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబించేలా బంధుమిత్రులతో కలసి తీర్చిదిద్దారు. రెండు రోజులు పగలూ, రాత్రి కష్టపడి రూ.25 వేలు ఖర్చు పెట్టి ముగ్గులు వేసినట్లు జయశ్రీ తెలిపారు. టీడీపీ గుర్తు, ఎన్టీఆర్ విగ్రహం, ధాన్య లక్ష్మి ఆకారంలో తీర్చిదిద్దిన రంగవల్లులు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. పురాతన నాణేలు కూడా రంగవల్లుల్లో ఉంచి సుందరంగా తీర్చిదిద్దారు.





రావివారిపాలెంలో రంగవల్లులు తీర్చిదిద్దుతున్న రావి సురేశ్ కుటుంబసభ్యులు, ఆకట్టుకుంటున్న టీడీపీ చిహ్నం

కోళ్లు..కోట్లు

(7వ పేజీ తరువాయి)

ఈ మద్యాన్ని విక్రయించడం ద్వారా ఆదాయాన్ని ఆర్జించారు.

- గుడివాడ నియోజకవర్గంలోని గౌతమ్ స్కూల్ వెనుక, బొమ్ములూరు, నందివాడ మండలం నందివాడ, పుట్టగుంట, పోలుకొండ, రుద్రపాక శివారుగొల్లగూడెం, తమిరిశలలో కోడిపందేలు, పేకాట శిబిరాలు నిర్వహించారు.. గుడ్లవల్లేరు మండలం గుడ్లవల్లేరు, కౌతవరం, డోకిపర్రు, కూరాడ, కుచ్చికాయలపూడిలో బరులు ఏర్పాటు చేశారు. బరులవద్ద టోకెన్లు ఇచ్చి మరీ పేకాటలు నిర్వహించారు.
- మచిలీపట్నంలోని మేకావానిపాలెం, గోపువానిపాలెం, శ్రీనివాసనగర్, గోకవరం, రుద్రవరంలో బరులను ఏర్పాటు చేశారు. పేకాట కోసం ప్రత్యేకంగా గదులను ఏర్పాటు చేసి టోకెన్లు అందించి మరీ పేకాటను ఆడించారు. కోడిపందేల బరులకన్నా గుండాట శిబిరాలను అధికంగా ఏర్పాటు చేశారు.
- పెడన నియోజకవర్గంలో తోటమూల, కొంకేపూడి, బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి, అర్తమూరులో కోడిపందేల శిబిరాలను ఏర్పాటు చేశారు. బంటుమిల్లి, పెందుర్రు, నాగేశ్వరరావుపేట, తుమ్మిడి తదితర ప్రాంతాల్లో బరులు సిద్ధం చేశారు. గూడూరు మండలం గూడూరు-పెడన రహదారి వెంబడి, పోసినవారిపాలెంలో బరులు ఏర్పాటు చేసి జోరుగా పందేలు, పేకాట శిబిరాలను కొనసాగించారు.
- అవనిగడ్డ నియోజవర్గంలోని పులిగడ్డ, పులిగడ్డపల్లెపాలెం, అవనిగడ్డ, పాతఎడ్లంక, గొట్టంమిల్లుల వద్ద బరులు ఏర్పాటు చేశారు. నాగాయలంక మండలంలో పాలిటెక్నిక్ కళాశాల పక్కనే కోడిపందేల బరిని ఏర్పాటు చేయడం వివాదాస్పదమైంది. నియోజకవర్గంలో చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల, కోడూరు, నాగాయలంక మండలాల్లో 20కిపైగా కోడిపందేల శిబిరాలను ఏర్పాటు చేశారు.
- పామర్రు నియోజకవర్గంలో కొత్తపెదమద్దాలి, పెదపారుపూడిమండలం యలమర్రు, పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం, హనుమంతపురం, మొవ్వమండలం కోసూరు, భట్లపెనుమర్రు, తోట్లవల్లూరు మండలం గరికపర్రు, కొమ్ముమూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరులో కోడిపందేల బరులు ఏర్పాటు చేశారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132,141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 515	

త్రిశక్తిపీఠంలో అమ్మవార్లకు విశేష పుష్పార్చన

కృష్ణలంక, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : త్రిశక్తిపీఠంలో భోగి పండుగ సందర్భంగా శ్రీ మహాకాళీ, శ్రీ మహాలక్ష్మీ, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లకు విశేష పుష్పార్చన నిర్వహించారు. దాదాపు 300 కిలోల వివిధ రకాల పుష్పాలతో అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపూడి పుల్లయ్య, కొప్పురావూరి జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్, సభ్యులు ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు పాల్గొన్నారు.



వైభవంగా సంక్రాంతి సంబరాలు



పొంగలి తయారు చేస్తున్న ఫన్‌టైమ్స్ సభ్యులు

పటమట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విజయవాడ టీచర్స్ కాలనీలో ఫన్‌టైమ్స్ క్లబ్‌లో సోమవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. ఉదయాన్ని భోగి మంటలతో ప్రారంభమైన కార్యక్రమం గంగిరెద్దుల విన్యాసాలు, బుడబుక్కల అల్లరి, సోదెమ్మ, ముగ్గులు వేయడం, మ్యూజికల్స్ చైర్స్ తదితర కార్యక్రమాలతో హాయిగా సాగింది. క్లబ్ మహిళా సభ్యులు పొంగలి తయారు చేసి అందరికీ పంచారు. అతిథులందరికీ అల్పాహారం అందించారు. ● **దర్శిపేటలో:** పటమట దర్శిపేట రాజ రాజేశ్వరి లలితా పరమేశ్వరి అమ్మవార్ల దేవస్థానంలో సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. 2 వేల ఆవు పిడకలతో భోగి మంటలు వేశారు.

●పటమట ఆర్.ఆర్ గార్డెన్స్‌లో భోగి సందర్భంగా సోమవారం టీడీపీ నాయకులు బెజవాడ నజీర్ ఆధ్వర్యంలో యువత ఆనందోత్సవాలతో భోగి మంటలు వేశారు.

ఇస్కాన్ మందిరంలో..

రామలింగేశ్వరనగర్: రామలింగేశ్వరనగర్‌లోని ఇస్కాన్ మందిరంలో భోగి మంటల వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున మందిరంలో స్వామికి మంగళ హారతి అనంతరం భోగిమంటలు వైభవంగా నిర్వహించారు.




కరెంటు బిల్లులను భోగి మంటల్లో వేస్తున్న బాబూరావు, సీపీఎం 9వ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో

భోగి మంటల్లో కరెంటు బిల్లులు దహనం

మొగల్రాజపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): స్మార్టు మీటర్లు రద్దుచేయాలని, పెంచిన కరెంటు బిల్లులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కరెంటు బిల్లులను భోగిమంటల్లో వేశారు. మొగల్రాజపురం సీపీఎం కార్యాలయం వద్ద సోమవారం నిరసన జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు చిగురుపాటి బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా కరెంటు బిల్లుల విషయంలో, స్మార్ట్ మీటర్ల విషయంలో మాత్రం సామాన్యుడికి ఉపయోగం లేదని చెప్పారు. అనంతరం కరెంటు బిల్లులను భోగి మంటల్లో వేసి తగలబెట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు క్రాంతికుమార్, తూర్పు సిటి కమిటీ సభ్యులు స్టాలిన్, నగర నాయకులు మురహరి, దావులూరి శ్రీనివాస్, ధర్మారావు, బన్నా వెంకటేష్, మహిళా సంఘం కార్య దర్శి మోహన్, ఎన్.లక్ష్మి, కాలేషా, నాయుడు, నాగరాజు, విశ్వనాథం, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పటమట: పెరిగిన విద్యుత్ ట్రూ అప్ చార్జీలను, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ సీపీఎం 9వ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను పటమటలంకలోని భోగి మంటల్లో వేసి దహనం చేశారు. సీపీఎం తూర్పునగర కమిటీ సభ్యుడు ఎన్.కోటబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యుత్ భారాలను ప్రజలపై వేసి ఎన్నికల హామీని తప్పిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర తూర్పు కమిటీ సభ్యుడు డి.వర ప్రసాద్, వీబీ రాజు, చెన్నుపాటి జోయ, కన్నా బాబ్జి, లకనం ప్రసాద్, చింతా శ్రీనివాస్ పాల్గొన్నారు. **ప్రభుత్వాసుపత్రి:** విద్యుత్ స్మార్ట్ మీటర్లు, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేషన్ మహిళా సభ్యులు, అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు భోగి మంటల్లో బిల్లులు దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎల్.జానయ్య, అధ్యక్షుడు వై.సుబ్బారావు, ట్రెజరర్ నాగరాజు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

కస్తూరి ఫౌండేషన్ సేవలు అభినందనీయం

ఎంపీ కేశినేని శివనాథ్



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

లబ్బీపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందించడమే కాకుండా వారి తల్లిదండ్రులకు చేయూతగా ఉండేందుకు కూడా ఆర్థిక సాయం చేస్తున్న కస్తూరి పూర్ణచంద్ర ఫౌండేషన్ సేవలు అభినందనీయం అని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం బృందావన్ కాలనీలోని వారి నివాసంలో పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్, రోగులకు, పేదలకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వల్లూరు పూర్ణచంద్రరావు ఆశయాలకు అనుగుణంగా ఈ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వల్లూరు రవీంద్రనాథ్, రామ్‌ప్రసాద్, వల్లూరు అశోక్‌బాబు, చిలకపాటి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు



చోరీకి గురైన ఫోన్లు అప్పగింత

వన్‌టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విజయవాడ బస్‌స్టేషన్‌లో పలువురు ప్రయాణికుల వద్ద చోరీకి గురైన ఫోన్లను కృష్ణలంక పోలీసులు గంటల వ్యవధిలోనే నేరస్తుల నుంచి స్వాధీనం చేసుకుని బాధితులకు సోమవారం అప్పగించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికులతో విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ కిటకిటలాడింది. నేరస్తులు పక్కా ప్రణాళికలతో ప్రయాణికుల వద్ద ఉన్న నగదు, విలువైన వస్తువులు, సెల్‌ఫోన్లను దొంగిలించారు. బాధితులు కృష్ణలంక పోలీసులను ఆశ్రయించారు. కృష్ణలంక పోలీసులు స్పందించి బస్ స్టేషన్‌లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. నలుగురు వ్యక్తులు బస్ స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద నుంచి ఏడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ నాగరాజు బాధితులకు సెల్ ఫోన్లు అప్పగించారు.



FLAT FOR SALE

» తాడేపల్లిలో కొత్తగా కన్‌స్ట్రక్షన్ చేయబడ్డ 4 BHK ఫ్లాట్ (4300 Sft) 2nd ఫ్లోర్‌లో, పడమర ఫేస్, 2 కార్ల పార్కింగ్ సౌకర్యంతో అమ్మకమునకు కలదు. ✆ 92464 95388

AJB- 438

PLOT FOR SALE

2 బెస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ ! మీ పెట్టుబడికి ఇదే సరైన సమయం ! రాజధాని అమరావతి కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తాడికొండ క్రాస్ రోడ్స్ దగ్గర పొన్నెకల్లు నందు 40 ఎకరాల APCRDA అప్రూవ్డ్ గేటెడ్ కమ్యూనిటీ వెంచర్ నందు ప్రీమియర్ ఓపెన్ ప్లాట్స్ బ్యాంక్ లోన్ సౌకర్యంతో కలవు. సంప్ర॥ 95736 25599.

AJG-357

ఇల్లు అమ్మకము

» ప్రసాదంపాడులో 56 చ.గ. స్థలములో G+2 బిల్డింగ్, గ్రౌండ్ ఫ్లోర్‌లో 3 షాపులు, 28000/- అద్దె వచ్చు బిల్డింగ్ అమ్మకమునకు కలదు. రేటు : 55 లక్షలు. సెల్ : 76720 94576

AJB - 115

» 85000/- అద్దె వచ్చు బిల్డింగ్ G+3 + PENT HOUSE E/F ప్రసాదంపాడులో అమ్మకమునకు కలదు. రేటు : 3.25 Cr. సంప్ర. సెల్ : 76720 94576

AJB - 114

2 విజయవాడ, రాయనపాడు కల్పతరువు ఉడా వెంచర్ నందు గ్రౌండ్ ఫ్లోర్ మరియు ఫస్ట్ ఫ్లోర్ 200 గు॥ల ఈస్ట్ ఫేసింగ్ ఇల్లు అమ్మకానికి కలదు. సంప్ర॥ 94410 77354.

AJG-204078

బిల్డింగ్ అమ్మకము

2 Commercial Building for sale : విజయవాడ సిటీ, పటమట ఏరియాలో, మీ సేవ ఎదురు పడమర ఫేసింగ్ చ.గ. 165లు గల కమర్షియల్ కాంప్లెక్స్, 2 ఫ్లోర్స్ అమ్మబడును. సంప్ర॥ 98669 06657

AJG-1229

TO-LET COMMERCIAL

» విజయవాడ, బావాజీపేట, 1st లైన్, BRTS రోడ్డుకు దగ్గర, కీర్తి ఫైనాన్స్ బిల్డింగ్‌లో 2nd ఫ్లోర్ నందు 1350 S.ft. విత్ ఫర్నీచర్, క్యాబిన్, లిఫ్ట్ సౌకర్యములతో ఆఫీస్ కోసం అద్దెకు కలదు. 9246922778, 9908308167

AJB - 6059

WANTED

» LIC ఏజెంట్స్, బ్రోకర్స్, రియల్ ఎస్టేట్స్, ఉద్యోగులు ఎవరైనా మాకు రోజూ 1 గంట పని చేసే పార్ట్ టైమ్ ఏజెంట్స్ కావలెను. నెలకు మంచి ఆదాయం. సంప్ర. సెల్ : 9848356777, 9347090425

AJB-225607

H వరంగల్‌లో హాస్టల్‌లో వంట చేయుటకు భార్యాభర్తలు కావలెను. వసతి కల్పించబడును. సం॥ ప్ర॥ 8074465703, 9849038142

AJW>14294

TO-LET

» కృష్ణలంక, గుండుకోటయ్య వీధి, SBI రోడ్‌లో పూర్తి ఫర్నిచర్‌తో A/C రూమ్స్, GFలో 4 రూమ్స్ ఆఫీసులకు, గోడౌన్‌కు, ఫ్యామిలీస్‌కు నెలవారి అద్దెకు. సంప్ర: 83099 04493

AJB- 787

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, దట్ల వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడిఐటి

దుర్గగుడిలో శాస్త్రోక్తంగా భోగిమంటలు





భోగి మంటలు వెలిగిస్తున్న ఈవో రామచంద్రమోహన్, సీపీకి అమ్మవారి చిత్రపటం ఇస్తున్న అధికారులు

వన్‌టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం సంక్రాంతి సంబరాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఈవో కే రామచంద్ర మోహన్ పర్యవేక్షణలో స్థానాచార్యుడు విష్ణుభొట్ల శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు, వేదపండితులు చిన్నరాజగోపురం వద్ద ఉన్న ప్రాంగణంలో పూజలు నిర్వహించగా, ఈవో, డిప్యూటీ ఈవో భోగిమంటలు వెలిగించి వేడుకలు ప్రారంభించారు. అనంతరం మహామండపం 7వ అంతస్తులోని పెద్ద రాజగోపురం ఎదురుగా బొమ్మలకొలువు ఏర్పాటు చేశారు. సంక్రాంతి సంబరాల్లో హరిదాసులు, గంగిరెద్దుల విన్యాసాలు, భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో డిప్యూటీ ఈవో బొమ్మల కొలువును పరిశీలించారు. సంక్రాంతి సంబరాలు కావటంతో ప్రాంగణాన్ని రంగవల్లికలతో సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని, స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సీపీ

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని దుర్గగుడిలో దుర్గమ్మను సోమవారం ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు వేద ఆశీస్సులు అందజేయగా, అర్చకులు సీపీ కుటుంబానికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అం దజేశారు.

దుర్గమ్మకు వెండి గిన్నెల పాత్ర కానుక

గుంటూరు ద్వారకానగర్‌కు చెందిన చాయంరెడ్డి శ్వేత, భవిత అమ్మవారికి 2,860 గ్రాముల బరువున్న అయిదు గిన్నెల వెండి నివేదన పాత్రను కానుకగా అధికారులకు అందజేశారు. అధికారులు వారికి అమ్మవారి దర్శనం కల్పించి, వేద ఆశీస్సులు అందజేశారు. అనంతరం వారికి దుర్గమ్మ చిత్రపటం, శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేశారు.

భోగిమంటల్లో విద్యుత్ బిల్లుల దహనం

కృష్ణలంక, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ భారాలు, సర్దుబాటు, ట్రూ అప్ చార్జీలకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో కృష్ణలంకలోని 21వ డివిజన్‌లో సుందరయ్య గ్రంథాలయం వద్ద, సత్యం హోటల్ సెంటర్‌లో సోమవారం భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు సీహెచ్ బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు చెప్పిందొకటి, ఇప్పుడు చేస్తోంది మరోకటి అని మండిపడ్డారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి ఆరు నెలల్లోనే ట్రూ అప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు, సర్వీస్ చార్జీల పేరుతో రూ.16వేల కోట్లు భారం మోపారని, దీంతో వినియోగదారులపై రెట్టింపు భారం పడిందని దుయ్యబట్టారు. తక్షణమే భారాలను ఉపసంహరించుకోవాలని, అదనపు భారాలను రద్దు చేయాలని, విద్యుత్ సంస్థలకు అప్పులుంటే వాటికి వింంచి అప్పులు ప్రజలకున్నాయని నిత్యావసర వస్తువుల భారాలకు తోడు విద్యుత్ భారాలు మోయలేనివిగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలను నిరంతరం దోపిడీ చేస్తూ భారాలు మోపేందుకు స్మార్ట్ మీటర్లు తీసుకొచ్చారని, అదానీ స్మార్ట్ మీటర్లు రాష్ట్రంలో పెట్టకుండా ఉండాలా చూడాలని, ఇప్పటికే పెట్టిన స్మార్ట్ మీటర్లను తొలగించాలన్నారు. అదానీతో చేసుకొన్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని, ప్రజలపై భారాలు మోపే సర్దుబాటు, ట్రూ అప్ చార్జీలు రద్దు చేసేంత వరకు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. నేతలు పుప్పాల కృష్ణ, కళ్యాణ్, మాగంటి హరిబాబు, కోరాడ రమణ, గోపి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



భోగిమంటల్లో విద్యుత్ బిల్లుల దగ్ధం చేస్తున్న సీపీఎం నేతలు



ఎంపీ కార్యాలయంలో భోగి మంటలు వెలిగిస్తున్న కేశినేని శివనాథ్, టీడీపీ నేతలు

చంద్రబాబు నాయకత్వంలో రోజూ పండుగే

● ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధిపరంగా రాష్ట్రంలో ప్రతిరోజూ పండుగ వాతావరణం నెలకొందని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గురునాక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం ఎంపీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భోగి వేడుకల్లో ఎంపీ కేశినేని శివనాథ్, ఆయన సతీమణి జానకిలక్ష్మితో కలిసి భోగిమంటలు వెలిగించారు. అనంతరం ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ చిన్నారులకు భోగి పండ్లు పోశారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వంలో లేని విధంగా సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులతో కలిసి చేసుకోవటానికి వివిధ రాష్ట్రాలు, విదేశాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో తరలి రావటం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల హామీలన్నింటినీ ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఉద్యోగులకు సంక్రాంతి పండగ ముందు పాత బకాయిలను చెల్లించామన్నారు. వచ్చే సంక్రాంతి నాటికి రాష్ట్ర ప్రజల కలల రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణాల్లో మరింత పురోగతి సాధిస్తాయన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రజలందరూ పాలు పంచుకోవాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబును స్ఫూర్తిగా తీసుకుని ఎన్టీఆర్ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, దేవినేని అపర్ణ, ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, పార్టీ నేతలు గన్నే ప్రసాద్, చెన్నుపాటి గాంధీ పాల్గొన్నారు.

ఘనంగా జోసఫ్ తంబి తిరునాళ్లు ప్రారంభం



సమష్టి దివ్యపూజాబలి సమర్పిస్తున్న ఫాదర్ మరియదాసు

ఉంగుటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ కతోలిక పుణ్యక్షేత్రంగా పేరొందిన పెద అవుటపల్లిలోని బ్రదర్ జోసఫ్ తంబి పుణ్యక్షేత్రంలో మూడు రోజులపాటు (13,14,15 తేదీలు) వైభవంగా నిర్వహించే దైవసేవకుడు బ్రదర్ జోసఫ్ తంబి 80వ వర్ధంతి మహోత్సవాలు (తిరునాళ్లు) పుణ్యక్షేత్రం రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రధాన గురువుగా విచ్చేసిన ఎనికేపాడు మేరీమాత కపూచియన్, ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా ప్రొవిన్షియల్ రెవ.ఫాదర్ ప్రత్తిపాటి మరియదాసు ఉదయం 7గంటలకు ఇతర గురువులతో కలిసి జ్యోతి ప్రజ్వలనచేసి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు గురువులు, గుడిపెద్దలు, సంఘపెద్దలు తంబి సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గురువులందరూ పూజావస్త్రాలు ధరించి బ్యాండుమేళాలతో దేవాలయంనుంచి ప్రదక్షిణగా కళావేదిక వద్దకు చేరుకుని సమష్టి దివ్యబలిపూజను సమర్పించారు. తంబి ధన్య జీవితం, దైవరాజ్య సువార్త ప్రకటన గురించి ఫాదర్ మరియదాసు తన ప్రసంగంలో వివరించారు. రెవ.ఫాదర్ జోసఫ్ తంబి ఆధ్వర్యంలో పునీత జోజప్ప దేవాలయం, ముసునూరు గాయక బృందం పూజాపాటలను ఆలపించగా, ఉదయం 9గంటలకు విజయవాడ మేత్రాసన జ్యోతిర్మయి మాత ఉపదేశుల బృందం మృత్యుంజయుడు అనే బుర్రకథ నిర్వహించారు. ఉదయం పదిన్నరకు ఎనికేపాడు ప్రొవిన్షియల్ సెక్రటరీ రెవ.ఫాదర్ బీమ్లా ప్రేమ్ కుమార్, మధ్యాహ్నం రెండున్నరకు మందడం సహాయక గురువులు రెవ.ఫాదర్ దాసరి జోసఫ్ తంబి దివ్యబలి పూజలను సమర్పించారు. సాయంత్రం 5 గంటలకు అమెరికాకు చెందిన రెవ.ఫాదర్ గుదె ఉదయ మీన వరప్రసాద్ సమష్టి దివ్యబలిపూజ సమర్పించారు. రాత్రి 10.30 గంటలకు లూర్దుమాత నాట్యమండలి గన్నవరం వారిచే ప్రదర్శించబడిన యేసు-బరబ్బా అనే బైబిల్ నాటకం భక్తులను విశేషంగా అలరించింది. ఈ ఉత్సవాల్లో అనేకమంది గురువులు, సిస్టర్లు, విశ్వాసులు, తంబి భక్తులు పాల్గొన్నారు.

పటిష్ట చర్యలు

మూడు రోజులపాటు జరిగే తంబి తిరునాళ్లకు తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసులు ఆలయ ప్రాంగణంలో అవుట్‌పోస్ట్ ఏర్పాటుచేసి భద్రతను కట్టుదిట్టం చేశారు. మెడికల్, అంబులెన్స్, ఫైర్ వంటి అత్యవసర సేవలు అందుబాటులో ఉంచారు. సుమారు 300 మంది పోలీసులు, 200 మంది వలంటీర్లు భక్తులకు అవసరమైన సేవలందిస్తున్నారు. గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు సారథ్యంలో పోలీసులు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించారు. క్షేత్రం రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్ మాట్లాడుతూ తిరునాళ్లకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు, ఆలయ కమిటీ పెద్దలు సమన్వయంతో కలిసి పనిచేయాలని కోరారు. ముఖ్యంగా మంచినీరు, టాయిలెట్లు, శానిటేషన్, విద్యుత్ సరఫరా సమస్యలు తలెత్తకుండా ఆయా శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని విజ్ఞప్తిచేశారు.



గొల్లపూడి స్కూల్‌లో ఆత్మీయంగా కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గొల్లపూడి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గొల్లపూడిలోని శ్రీ పోసాని నరసింహారావు చౌదరి జడ్పీ ఉన్నత పాఠశాలలో 50 ఏళ్ల క్రితం విద్యనభ్యసించిన 1975 టెన్త్ బ్యాచ్ పాఠశాలలో స్వర్ణోత్సవ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించి ఉల్లాసంగా గడిపారు. నాటి ఉపాధ్యాయులు హనుమంతరావు, వెంకటేశ్వర్లు, రామకోటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. అమరులైన ఉపాధ్యాయులకు, తోటి విద్యార్థులకు నివాళులర్పించారు. పూర్వ విద్యార్థులు మార్కెటింగ్ యార్డ్ మాజీ చైర్మన్ జాలిపర్తి గోపాలకృష్ణ, గాంధీ కో.ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ వేమూరి వెంకట్రావు, సుబ్బారావు, సుధీర్, శ్రీనివాస్, శివ రామకృష్ణ, మురళి పాల్గొన్నారు.

హైదరాబాద్ ప్రోవెన్స్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పటమట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మౌంట్ ఫోర్ట్ బ్రదర్స్ ఆఫ్ సెయింట్ గాబ్రియెల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రోవెన్స్‌కు చెందిన వివిధ పాఠశాలల మూడో పూర్వ విద్యార్థుల సమ్మేళనం పటమటలోని ఎంఎస్ఎం పాఠశాలలో సోమవారం జరిగింది. హైదరాబాద్ ప్రోవెన్స్‌కు సంబంధించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, నాగపూర్ సెక్టార్ పరిధిలోని 15 పాఠశాలల్లోని సుమారు 150మంది విద్యావేత్తలు, బ్రదర్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సమ్మేళనం హైదరాబాద్ ప్రోవెన్స్ సుపీరియర్ రెవ.బ్రదర్ షైన్ అలెక్స్ ఆధ్వర్యంలో విద్యా సంబంధ అంశాలు, సామాజిక అంశాలు వంటి విషయాలపై చర్చించి ప్రణాళికలు రూపొందించారు. ఏఎల్‌సీఏపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కస్తూరి శివ శంకర్, మేనేజమెంట్ కన్సల్‌మెంట్ రీసోర్స్ పర్సన్ ఎంసీ దాస్, పాఠశాల ప్రిన్సిపల్ బ్రదర్ రాయప్ప రెడ్డి, ఎన్.ఎస్.ఎమ్ పూర్వ విద్యార్థుల ప్రెసిడెంట్ ఎన్.వెంకట జగదీష్ పాల్గొన్నారు.



పటమటలో జరిగిన హైదరాబాద్ ప్రోవెన్స్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికలో పాల్గొన్న విద్యార్థులు

వైభవంగా వెంకన్న కల్యాణోత్సవం

లబ్బీపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం ముగింపు సందర్భంగా టీటీడీ కల్యాణ మండపంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ గోదాదేవి, శ్రీ రంగనాయకుల స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. సోమవారం ఉదయం కన్నుల పండుగగా జరిగిన ఈ ఉత్సవంలో భక్తులు భారీగా పాల్గొని కల్యాణాన్ని తిలకించి పరవశించారు. ఆలయం నుంచి ఊరేగింపుగా మండపానికి స్వామివార్లను తీసుకువచ్చిన పండితులు అంగరంగవైభవంగా కల్యాణమహోత్సవాన్ని నిర్వహించారు. టీటీడీ అధికారులు పర్యవేక్షించారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

బరి తెగించి

విజయవాడ నగర శివార్లు జన జాతరను తలపించాయి. సంక్రాంతి సంబరాల పేరిట కోడి పందేలను నిర్వహించారు. వీటితోపాటు ఇతర జూదక్రీడలు కూడా యథేచ్ఛగా నిర్వహించారు. చుట్టుపక్క గ్రామాల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి పందెం రాయుళ్లు తరలివచ్చారు. మద్యం ఏరులై పారింది. పోలీసు అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా షరా యథావిధిగా పందేలు సాగాయి









కూల్‌డ్రింక్స్ షాపు యజమానికి కోటి పన్ను నోటీసు!

- జీఎస్టీ నెంబరుపై 66 కోట్ల లావాదేవీలు
- చిరు వ్యాపారిని మోసం చేసిన అకౌంటెంట్
- ఆయన నెంబర్‌పై అక్రమ లావాదేవీలు
- ఏలూరు జిల్లాలో ఘటన.. పోలీసులకు ఫిర్యాదు

ముదినేపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కూల్ డ్రింక్స్ షాపు నిర్వహిస్తున్న ఓ చిరువ్యాపారికి కోటి రూపాయలు పన్ను చెల్లించాలని అధికారులు నోటీసు ఇచ్చారు. తన జీఎస్టీ నెంబర్‌పై కోట్లాది రూపాయల వ్యాపార లావాదేవీలు నిర్వహించినట్టు నోటీసుల్లో పేర్కొనడంతో విస్తుపోయాడు. ఆ వ్యాపారి ఖాతాలను నిర్వహించే అకౌంటెంట్ మోసానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆయన జీఎస్టీ నెంబరుపై పే బిల్స్ జనరేట్ చేసి అక్రమంగా ఆర్థిక లావాదేవీలు నిర్వహించినట్టు తేలింది. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం శ్రీహరిపురం గ్రామానికి చెందిన కూల్ డ్రింక్స్ వ్యాపారి పంచకర్ల విజయబాబు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. జీఎస్టీ నెంబరు కోసం గత ఏడాది మార్చి 23న విజయవాడకు చెందిన అకౌంటెంట్ బిల్లా కిరణ్‌కు విజయబాబు తన ఆధార్ కార్డు, పాన్ కార్డు, పాస్ పోర్టు సైజు ఫొటో ఇచ్చారు. అప్పటి నుంచి తన వ్యాపారానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలను అకౌంటెంట్ కిరణ్‌కు విజయబాబు ఫోన్‌లో చెప్పేవారు. ఈ పరిస్థితుల్లో గత ఏడాది ఆగస్టు 3న సేల్స్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ విజయభాస్కర్ శ్రీహరిపురంలోని కూల్ డ్రింక్స్ షాపును తనిఖీ చేశారు. విజయబాబు జీఎస్టీ నెంబరుపై రూ.66.66 కోట్ల వ్యాపార లావాదేవీలు జరిగాయని, ఇందుకు సంబంధించి సుమారు కోటి వరకు పన్ను చెల్లించాలని నోటీసు ఇచ్చారు. దీంతో విస్తుపోయిన విజయబాబు అంత పెద్ద మొత్తంలో వ్యాపార లావాదేవీలు చేయలేదని తెలిపారు. ఇదే విషయాన్ని స్థానిక సచివాలయ ఉద్యోగితో పంచనామా రిపోర్టు కూడా తయారు చేయించారు. తన జీఎస్టీ నెంబరుపై అక్రమంగా కోట్లలో లావాదేవీలు నిర్వహించటంపై తన అకౌంటెంట్ కిరణ్‌ను గత ఏడాది నవంబరు 25న విజయబాబు నిలదీశారు. తప్పు జరిగిందని పన్ను బకాయిలు చెల్లించే బాధ్యతను తానే తీసుకుంటానని కిరణ్ అంగీకరించాడు. అయితే ఇప్పటి వరకు అకౌంటెంట్ పన్ను కట్టలేదు. సేల్స్ టాక్స్ పన్ను బకాయి చెల్లింపునకు ఇచ్చిన గడువు దాటిపోయింది. దీంతో విజయబాబు ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్‌లో అగ్నికీలలు

- షార్ట్ సర్క్యూట్‌తో ఎగసిపడ్డ మంటలు
- సురక్షితంగా బయటపడ్డ అమెరికా దంపతులు
- రెండు గంటలపాటు శ్రమించిన పోలీసు, ఫైర్



హోటల్‌లో ఎగసిపడుతున్న మంటలు

తడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా తడ సమీపంలోని బోడిలింగాలపాడు జాతీయ రహదారి పక్కనున్న స్మార్ట్‌సిటీ స్టార్ హోటల్‌లో సోమవారం ఉదయం విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో అగ్నికీలలు ఎగసిపడ్డాయి. ప్రధానంగా మూడో అంతస్తులో దట్టమైన పొగతో మంటలు ఎగసిపడ్డాయి. ఆ అంతస్తులో ఉదయం 9 గంటల ప్రాంతంలో అమెరికాకు చెందిన డేవిడ్, జెల్లి దంపతులు, చెన్నైకు చెందిన గ్రైడ్స్ డిక్రోస్, షిబా రెండు గదులు తీసుకున్నారు. వీరి గదులను పొగ కమ్మేయడం.. తలుపులు లాక్ అయిపోవడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది ఆ రెండు గదుల్లోని అద్దాలను పగలగొట్టి వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ క్రమంలో డిక్రోస్ చేతులకు గాయాలయ్యాయి. రెండు గంటలపాటు శ్రమించి ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పగలిగారు.

మౌనగిరి క్షేత్రాన్ని సందర్శించిన జస్టిస్ చల్లా గుణరంజన్



రాప్తాడు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రాప్తాడు మండలం హంపాపురం సమీపంలోని మౌనగిరి హనుమాన్ క్షేత్రాన్ని హైకోర్టు అదనపు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ సోమవారం సందర్శించారు. ఆయనకు మౌనగిరి వ్యవస్థాపకులు ఈశ్వరయ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. క్షేత్రంలోని 39 అడుగుల ఏకశిలా హనుమన్ విగ్రహాన్ని జడ్జి దర్శించారు.



శ్రీవెంకమ్మ పేరంటాల అమ్మవారు

పేరంటాల అమ్మవారి సంక్రాంతి జాతర మహోత్సవాలు ప్రారంభం

ప్రసాదంపాడు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాల అమ్మవారి దేవస్థానంలో సంక్రాంతి జాతర మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజులో భాగంగా దేవస్థానం ప్రాంగణంలో భోగి మంటలు వెలిగించారు. అనంతరం గణపతి పూజతో జాతర మహోత్సవాలు మొదలైయ్యాయి. అనంతరం అమ్మవారికి విశేషంగా అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించారు. అమ్మవారికి పుట్టింటి వారసులు భోగి పళ్లతో అభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఈవో పీ ప్రియాంక తెలిపారు.





మకర సంక్రాంతి విందు పసందైన ఆరోగ్యాన్ని అందించేలా ఉండాలి. అందుకోసం పండుగ పిండివంటల్లో ఈ పోషకభరిత పదార్థాలకు స్థానం కల్పించాలి. సంక్రాంతితో ఆరోగ్య శోభ వెల్లివిరియడం కోసం అనుసరించవలసిన పోషక నియమాలు ఇవే!

పండుగ నాడు... పోషక శోభ

పండుగల్లో పిండివంటలదే ప్రత్యేక స్థానం. నోరూరించే పిండివంటల్లో ఆరోగ్య ప్రయోజనాలు కూడా దాగి ఉంటాయి. వ్యాధినిరోధకశక్తిని పెంచడం ద్వారా కాలానుగుణ రుగ్మతల నుంచి రక్షణ కల్పించే బలవర్ధకమైన పోషకాలను అందించడమే పండుగనాటి పిండిపదార్థాల లక్ష్యం. కాబట్టి సంప్రదాయసిద్ధమైన పిండివంటలకే ప్రాధాన్యమిస్తూ, వాటిలో పోషకవిలువలకు పెద్ద పీట వేయాలంటున్నారు వైద్య నిపుణులు.

పోషకభరిత నువ్వులు

నువ్వుల్లో జింక్, క్యాల్షియం, పీచు సమృద్ధిగా ఉంటాయి. నువ్వులు ఆరోగ్య ప్రయోజనాలను అందించే శక్తిభాండాగారాల్లాంటివి. కాబట్టి నువ్వులతో లడ్లు చేసుకోవాలి. అరిసెల్లో కూడా నువ్వులు చేర్చాలి.



నువ్వుల లడ్డూలు

దీన్లోని నువ్వులు, బెల్లం, వేరుశనగలు, యాలకుల పొడిలో లెక్కలేనన్ని పోషకాలుంటాయి. సంక్రాంతి నాడు వండుకునే ఈ సంప్రదాయ పిండి వంటతో ఒరిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏవంటే...

నువ్వులు: నల్ల నువ్వుల్లో విటమిన్లు, ప్రొటీన్లు, ఇనుము, క్యాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, ఆరోగ్యకరమైన కొవ్వులు, యాంటీఆక్సిడెంట్లు ఎక్కువ. వీటితో రక్తంలో చక్కెర నియంత్రణలో ఉండడంతో పాటు, కొలెస్ట్రాల్ మోతాదులు తగ్గుతాయి. అధిక రక్తపోటు, ఇన్‌ఫ్లమేషన్ తగ్గి, జీర్ణశక్తి మెరుగు పడుతుంది.

బెల్లం: కొలెస్ట్రాల్‌ను తగ్గించి, అధిక శరీర బరువు మరింత పెరగకుండా నియంత్రించే బెల్లం ఊపిరితిత్తుల ఆరోగ్యానికి కూడా దోహదపడుతుంది.

వేరుశనగలు: పీచు, మెగ్నీషియం, ఇనుము, జింక్ మొదలైన ఖనిజ లవణాలు, బి, కె విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు వీటిలో ఎక్కువ. వేరుశనగలతో గ్లైసెమిక్ ఇండెక్స్ తగ్గి మధుమేహం అదుపులో ఉంటుంది. వీటిలోని విటమిన్ ఇ, గుండె జబ్బుల నుంచి రక్షణ కల్పిస్తుంది.

యాలకులు: రక్తపోటు తగ్గి, గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. దీన్లో క్యాన్సర్ వ్యతిరేక, బ్యాక్టీరియా వ్యతిరేక గుణాలు ఎక్కువగా ఉంటాయి. మరీ ముఖ్యంగా నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ వ్యాధిగ్రస్తులకు వేరుసెనగలు ఎంతో మేలు చేస్తాయి.

పసందైన పొంగలి

సుప్రసిద్ధమైన దక్షిణ భారతీయ వంటకమైన పొంగలి, బియ్యం, పెసరపప్పు, జీలకర్ర, మిరియాలు, ఇంగువ, కరివేపాకు, అల్లంతో తయారవుతుంది. వీటిలో పోషకాలు ఏవంటే...

పెసరపప్పు: ఈ పప్పుతో మధుమేహం నియంత్రణతో పాటు, కాలేయం దెబ్బతినకుండా రక్షణ దక్కుతుంది. వ్యాధినిరోధకశక్తి మెరుగు పడుతుంది. పెసరపప్పులో మాంసకృత్తులు, పీచు, ఫోలేట్, విటమిన్ కె, సిలు ఎక్కువ. కీలకమైన పెప్టైడ్స్, పాలీఫినాల్స్ మొదలైన సమ్మేళనాలు కూడా సమృద్ధిగా దొరుకుతాయి.

ఇంగువ: జీర్ణ సంబంధ సమస్యలైన పొట్ట నొప్పి, పేగుల్లోని పరాన్నజీవులు, కడుపుబ్బరంతో పాటు ఉబ్బసం, బ్రాంకైటిస్, కోరింత దగ్గులకు ఇంగువ ఔషధంలా ఉపయోగపడుతుంది.

కరివేపాకు: కార్బజోల్ ఆల్కలాయిడ్స్‌ను సమృద్ధిగా కలిగి ఉండే కరివేపాకుకు మధుమేహాన్ని తగ్గించే గుణాలు కూడా ఉంటాయి. అలాగే నాడులను కాపాడే స్వభావం కూడా ఉంటుంది. కరివేపాకుతో జీర్ణసంబంధ సమస్యలతో పాటు, పైల్స్, ఎడీమా, ఒళ్లు నొప్పులు కూడా తగ్గుతాయి.

అల్లం: ఎన్నో వేల సంవత్సరాలుగా అధిక రక్తపోటు, దగ్గు, జలుబు, కీళ్ల నొప్పులు, ఇతరత్రా ఇన్‌ఫ్లమేటరీ సమస్యల చికిత్సల్లో అల్లాన్ని ఉపయోగిస్తున్నారు.



బలవర్ధకమైన బెల్లం పాయసం

కొత్త బియ్యం, కొత్త తాటి బెల్లంతో తయారుచేసే బెల్లం పాయసం సంక్రాంతి నాడు వండుకునే తీపి పిండివంటకం. వీటిలోని పోషకాల గురించి తెలుసుకుందాం!

తాటి బెల్లం: ఈ సహజసిద్ధ తీపి పదార్థంలో ఎన్నో పోషకాలుంటాయి. శక్తి పెరగడంతో పాటు, జీర్ణశక్తి మెరుగు పడుతుంది. మైగ్రెయిన్ నొప్పులు తగ్గుతాయి. బరువు తగ్గడంలో సహాయపడుతుంది. కీళ్లనొప్పులు, నెలసరి నొప్పులు తగ్గుతాయి. అల్జీమర్స్ లాంటి నాడీక్షీణత వ్యాధులను నయం చేయడంలో తాటి బెల్లం కీలక పాత్ర పోషిస్తుంది.

పండుగ వేళల్లో మనం భిన్నమైన పిండి వంటలతో కమ్మని రుచులకే ప్రాధాన్యమిస్తాం. కానీ నిజానికి ప్రత్యేకించి సంక్రాంతి పండుగ నాటి పిండివంటలు అంతకు మించిన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. కాబట్టి ఆత్మన్యూనతకు గురి కాకుండా, బరువు పెరిగిపోతాయమనే భయం లేకుండా పండుగ నాటి పిండిపదార్థాలను ఆస్వాదించాలి. అయితే అతి సర్వత్రా నష్టదాయకమే! కాబట్టి పరిమితంగా ఆస్వాదించడం మర్చిపోకూడదు. మరీ ముఖ్యంగా మధుమేహులు ఒకట్రెండు తీపి పదార్థాలకే పరిమితం కావాలి. పండుగ విందుల్లో ఇలాంటి సూపర్ ఫుడ్స్‌ను జోడించుకోవడం ద్వారా అటు సంప్రదాయాన్నీ, ఇటు పోషణనూ సమంగా సమన్వయం చేసుకోవాలి. అలాంటప్పుడే పండుగ వేడుకల ప్రయోజనాలను సంపూర్తిగా అందుకోగలుగుతాం!

బలవర్ధకమైన బెల్లం

చక్కెరను బెల్లంతో భర్తీ చేయడం అన్నివిధాలా ప్రయోజనకరమే! ఈ సహజసిద్ధ తీపిపదార్థంలో ఇనుము, మెగ్నీషియం, పొటాషియం ఎక్కువగా ఉంటాయి. బెల్లంతో పిండివంటలకు ప్రత్యేకమైన రుచితో పాటు పోషకాలు కూడా సమకూరతాయి.

కమ్మని కుంకుమ పువ్వు

రుచి, పోషకవిలువలను పెంచే కుంకుమ పువ్వును తీపి వంటకాల్లో విరివిగా వాడుతూ ఉంటాం. వీటిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు నొప్పులు వాపులను తగ్గిస్తాయి. రుచి, ఆరోగ్యం పరంగా ప్రయోజనకరంగా ఉండే కుంకుమ పువ్వు ఖరీదే అయినప్పటికీ పండుగ సందర్భాల్లో తప్పనిసరిగా వాడుకోవాలి.

దారుఢ్యాన్ని పెంచే నట్స్

బాదం, వాల్‌నట్స్, పిస్తాల్లో ఆరోగ్యకరమైన కొవ్వులు, మాంసకృత్తులు, పోషకాలు ఉంటాయి. కాబట్టి తీపి వంటకాల్లో వీటిని ఎక్కువగా ఉపయోగించుకోవాలి. పండుగ పనుల్లో తీరిక లేని పనులతో అలసటకు లోనవకుండా, రోజంతా అప్పుడప్పుడూ నట్స్‌ను తింటూ ఉంటే, నిస్సత్తువ ఆవరించకుండా ఉంటుంది.

పొట్టు తీయని ధాన్యం

సజ్జలతో, జొన్నలు లాంటి పొట్టుతీయని వాటినే పిండివంటలకు ఉపయోగించడం ఉత్తమం. వీటిలో పీచుతో పాటు పోషకాలు కూడా ఎక్కువగా ఉంటాయి. దాంతో జీర్ణశక్తి మెరుగ్గా ఉంటుంది. పండుగ కార్యకలాపాలన్నింట్లో చురుగ్గా పాల్గొనే శక్తి సమకూరుతుంది.

ముత్యాల ముగ్గు






అరుణ కుమారి
కడప

27 చుక్కలు
5 వరుసలు
సరిచుక్క

పల్లె సీమలు మరింత కళకళలాడాలి: సీఎం చంద్రబాబు



అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, దేశ విదేశాల్లో ఉన్న తెలుగు వారికి సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. 'సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే ఈ రోజు శాస్త్రపరంగా అన్ని విధాలా ప్రాముఖ్యతను కలిగింది. అందుకే మన పెద్దలు చెప్పిన సంప్రదాయాలను పాటిస్తూ, సంక్రాంతిని మరింత ఆనందంగా జరుపుకోవాలని కోరుకుంటున్నాను. ఈ పండుగ. మీ జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. పాడిపంటలతో విరాజిల్లే పల్లె సీమలు మరింత కళకళలాడాలి.' అని చంద్రబాబు ఆకాంక్షించారు.

గవర్నర్‌కు సీఎం ఫోన్

గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు సీఎం చంద్రబాబు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. స్వగ్రామం నారావారిపల్లి పర్యటనలో ఉన్న సీఎం .... సోమవారం రాత్రి గవర్నర్‌కు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.



తెలుగు ప్రజలు సంతోషంగా ఉండాలి: డిప్యూటీ సీఎం పవన్



అమరావతి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): 'రంగవల్లులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దులు, హరిదాసులు, భోగిమంటలు, పిండివంటల సమ్మేళనమే సరదాల సంక్రాంతి పండగ. ఈ సందర్భంగా భారతీయులందరికీ, ముఖ్యం తెలుగువారందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు' అని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. 'పండుగ కోసం నగరాలన్నీ పల్లెలవైపు పరుగులు తీశాయి. ప్రజలకు ఈ పండుగపై ఉన్న మక్కువను ఇది తెలియజేస్తుంది. పల్లె సౌభాగ్యమే దేశ సౌభాగ్యం. ఆనందాలు, సిరి సంపదలతో పల్లెలు సుభిక్షంగా శోభిల్లాలి. తెలుగువారు ఎక్కడున్న ఉన్నత శిఖరాలను అధిరోహించాలి. తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో విరాజిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా'నని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

'క్రమశిక్షణ' అధికారం

డైరెక్టర్‌కు లేదా?

- గతంలో ఓ అసిస్టెంట్ డైరెక్టర్ సస్పెన్షన్
- తాజాగా 12 మంది వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లకు పదోన్నతులు
- లేని అధికారాన్ని డైరెక్టర్లు ఉపయోగించారా?
- పశుసంవర్ధకశాఖలో జీవోల రగడ

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధకశాఖలో కొన్ని జీవోలపై పెద్ద రగడ జరుగుతోంది. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లకు పదోన్నతులు, పోస్టింగ్‌లు, అసిస్టెంట్ డైరెక్టర్లపై క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన రాష్ట్ర డైరెక్టర్‌కు అధికారం లేదన్న వాదన చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి రాష్ట్రం, రాష్ట్ర విభజన తర్వాత జారీ అయిన కొన్ని జీవోలపై కొంత కాలంగా ఆశాఖలో పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. జీవో 102తో గత డైరెక్టర్ ఒక ఏడీని సస్పెండ్ చేయడంతో లేని అధికారాన్ని గత డైరెక్టర్ ఉపయోగించారంటూ హైకోర్టులో వ్యాజ్యాలు కూడా నడిచాయి.

తాజాగా అదే అధికారంతో ప్రస్తుత డైరెక్టర్ దామోదర్ నాయుడు తాజాగా 12 మంది వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లకు అసిస్టెంట్ డైరెక్టర్లుగా పదోన్నతులు కల్పించి, పోస్టింగ్‌లు ఇచ్చారు. కానీ పదోన్నతుల మెమోలో 1996లో ఇచ్చిన జీవో 54తో పాటు 2013లో వచ్చిన జీవో 141 ఆధారంగా పదోన్నతులు, పోస్టింగ్‌లు ఇచ్చారు. అయితే జీవో 54 ప్రకారం బదిలీలు లేదా పదోన్నతులు ఇచ్చే అధికారం డైరెక్టర్‌కు లేదని పలువురు వాదిస్తున్నారు. అయితే జీవో 54ను 1999 అక్టోబరులో 102గా మార్చారు. దీని ప్రకారం డైరెక్టర్‌కు అధికారం ఉందంటున్నా.. జీవో 102ను కాకుండా 54ను మెమోల్లో ఎందుకు ఉటంకిస్తున్నారన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

పండగొచ్చింది!

- భారీగా పెండింగ్ బిల్లుల విడుదల
- వివిధ వర్గాల ఖాతాల్లోకి రూ.6,700 కోట్లు
- సర్వత్రా వెల్లివిరిసిన ఆనందం
- ఇవన్నీ జగన్ సర్కారులో పేరుకుపోయిన బకాయిలు

అమరావతి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి బిల్లుల పెండింగ్‌తో కళ తప్పిన అనేక వర్గాల మోముల్లో సంక్రాంతి ఈసారి నిజంగానే పండగ కళను తెచ్చింది. గత ప్రభుత్వంలో భారీగా పేరుకుపోయినపెండింగ్ బిల్లులివి. వాటిని సరిగ్గా సంక్రాంతి పండగకు ముందు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడంతో ఆయా వర్గాల్లో ఆనందం తొణికిసలాడుతోంది. జగన్ ప్రభుత్వం కొన్నేళ్లుగా అనేక శాఖల పరిధిలో పెండింగ్ బిల్లుల చెల్లింపు నిలిపివేసింది. ఇందులో ఉద్యోగులు, చిన్న చిన్న కాంట్రాక్టర్లు, ఆస్పత్రులు, కళాశాలలు, ప్రభుత్వానికి మందులు, మెటీరియల్ సరఫరా చేసిన కంపెనీలు వంటివి అనేకం ఉన్నాయి. ప్రభుత్వం మారిన తర్వాత తమ బిల్లులు ఇప్పించి బయటపడేయాలని ఈ వర్గాలకు సంబంధించిన వారు ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. వారి పరిస్థితిని అర్థం చేసుకొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎంత వీలైతే అంత మొత్తం పెండింగ్ బిల్లులకు చెల్లింపు చేయాలని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆ శాఖ కార్యదర్శి పీయూశ్ కుమార్‌ను ఆదేశించారు. మామూలుగా ఈ నెలలో ఎప్పుడో ఒకసారి ఈ డబ్బులు ఇవ్వాలని అనుకొన్నారు. కానీ సంక్రాంతి పండగకు ముందే వీటిని ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎంత మొత్తం అందుబాటులో ఉంటే అంత మొత్తం పూర్తిగా దీనికే ఇవ్వాలని ఆయన ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కొంత మొత్తం అప్పుడే అందింది. ఆ డబ్బులకు రాష్ట్రం వద్ద అందుబాటులో ఉన్న నిధులు కలిపి మొత్తం రూ. 6,700 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించారు. 'వీలైనన్ని వర్గాలకు వీటిని పంచండి. ముందు కొంత మొత్తం వస్తే ఆ వర్గాల వారిలో ఆశ చిగురిస్తుంది. మిగిలిన డబ్బులు తర్వాతైనా వస్తాయన్న నమ్మకం ఏర్పడుతుంది' అని ఆయన ఆర్థిక శాఖకు చెప్పారు. ఆయన ఆదేశంతో ఆర్థిక శాఖ అధికారులు, మంత్రి కలిసి ఎవరెవరికి ఎంతెంత ఇవ్వాలన్నదానిపై పెద్ద కసరత్తు నిర్వహించారు. ఉదాహరణకు వైద్య శాఖ పరిధిలో గత ప్రభుత్వం రూ. ఆరు వేల కోట్ల బకాయిలు వదిలి పెట్టి వెళ్ళింది. ఈ ఏడు నెలల్లో కొంత చెల్లించారు.

నిధుల విడుదలపై రోజంతా పర్యవేక్షణ

నిధుల విడుదలకు శనివారం సాయంత్రం ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకొన్నారు. ఆదివారం బ్యాంకులకు సెలవు. దీనితో సోమవారం ఈ నిధులన్నీ లబ్ధిదారుల ఖాతాలకు చేరేలా మంత్రి కేశవ్, ఆ శాఖ అధికారులు రోజంతా పర్యవేక్షణ జరిపారు. రిజర్వు బ్యాంక్ నుంచి ఈ నిధులు విడుదల కావాల్సి ఉంది. రిజర్వ్ బ్యాంక్‌కు సోమవారం పనిదినం. దీంతో నిధుల విడుదల సాఫీగా జరిగిపోయిందని మంత్రి చెప్పారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి తాను వివరాలు తెప్పించుకొని స్వయంగా పర్యవేక్షించానని, విడుదల చేయాలని అనుకొన్న ప్రతి రూపాయి సోమవారం సంబంధిత ఖాతాలకు వెళ్ళిపోయిందని మంత్రి తెలిపారు. ఆర్థిక శాఖ అధికారులు, ఉద్యోగులకు రాష్ట్రంలో సోమవారం సెలవు. అయినా ముఖ్యమైన అధికారులు విధుల్లో ఉండి ఈ నిధుల విడుదలను పర్యవేక్షించారు.

ఎవరికి ఎంతెంత? (చెల్లింపుల్లో కొన్ని...)

ఉద్యోగులకు జీపీఎఫ్, సీపీఎస్, టీడీఎస్	రూ.1,300 కోట్లు
విద్యార్థుల రీయింబర్స్‌మెంట్	రూ.788 కోట్లు
చిన్న కాంట్రాక్టర్ల బకాయిలు	రూ.586 కోట్లు
(పదిలక్షల లోపు పెండింగ్ బిల్లులకు)	
విద్యుత్‌శాఖ బకాయిలు	రూ.500 కోట్లు
ఎన్టీఆర్ సేవ కింద ఆస్పత్రులకు బకాయిలు	రూ.400 కోట్లు
మందులు సరఫరా చేసిన కంపెనీలకు	రూ.100 కోట్లు
పోలీసులకు సరెండర్ లీవ్ బకాయిలు	రూ.230 కోట్లు
అమరావతి కౌలురైతుల బకాయిలు	రూ.241 కోట్లు
చిరు వ్యాపారులు	రూ.100 కోట్లు



అనంత సంబరాల్లో మంత్రులు

శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం, పెనుకొండలో సోమవారం జరిగిన సంక్రాంతి సంబరాలలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవిత పాల్గొన్నారు. ధర్మవరంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ సరదాగా జరిగిన కోడి పందేలను పరిశీలించారు. సంప్రదాయ దుస్తులు ధరించి ఎడ్లబండిని తోలారు. పెనుకొండ జూనియర్ కాలేజీ మైదానంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలలో మంత్రి సవిత పాల్గొన్నారు. మహిళలతో కలిసి ముగ్గులు వేశారు. ఎడ్ల బండిని తోలారు.

- ఆంధ్రజ్యోతి, ధర్మవరం, పెనుకొండ టౌన్



సోమవారం నిర్మానుష్యంగా హైదరాబాద్‌లోని మాదాపూర్ ప్రాంతం

కోడి పందేలు చూసొద్దాం..!

- నగరం నుంచి 10 లక్షల మందికి పైగా ప్రయాణం..

హైదరాబాద్/మియాపూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు ఈ సారి తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిన వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంతో పోలిస్తే ఈ ఏడాది కొత్త ట్రెండ్ మొదలైనట్లు అంచనా వేస్తున్నారు. ఏపీలో జరిగే సంక్రాంతి పండగతో పాటు కోడిపందేలు, ఇతర సంబరాలను తిలకించడానికి తెలంగాణ నుంచి.. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి భారీగా జనం తరలి వెళ్లారు. ఒక్క హైదరాబాద్ నుంచే 10 లక్షల మందికి పైగా ఉంటారని అంచనా. వీరిలో తెలంగాణ వాసులు కూడా భారీగానే ఉన్నారు. సాధారణంగా అయితే ప్రతి సంక్రాంతికి హైదరాబాద్, చుట్టుపక్కల నివసించే ఏపీ వాసులు వారి సొంత ఊర్లకు వెళుతుంటారు. కొందరు తెలంగాణ వాసులు కూడా అక్కడికి వెళ్లే ఆనవాయితీ ఉంది. అయితే.. ఈసారి తెలంగాణ ప్రజలు భారీ సంఖ్యలో వెళ్లారు. వరసగా సెలవులు రావడం, ఏపీలో సంక్రాంతి వేడుకలు భిన్నంగా ఉండడంతో ప్రజల్లో ఆసక్తి పెరిగింది. విజయవాడ, భీమవరం, రాజమండ్రి, విశాఖపట్నం వంటి నగరాలు, సమీప ప్రాంతాల్లో జరిగే భోగి పండగతో పాటు కోడి పందేలను చూడడానికి తెలంగాణ వాసులు తరలి వెళ్లారు. ఇలా వెళ్లిన వారిలో కొందరు తమకు తెలిసిన వారి ఇళ్లలో ఉండగా, చాలా మంది హోటళ్లలో దిగారు. హైదరాబాద్ నుంచి మూడు రోజుల్లోనే సుమారు 60 వేల కార్లు ఏపీకి వెళ్లినట్లు అంచనా. అందుకే టోల్ గేట్ల వద్ద ట్రాఫిక్ స్తంభించిపోయింది. హైదరాబాద్ నుంచి భారీగా జనం సొంతూళ్లకు వెళ్లడంతో నగరంలోని చాలా ప్రాంతాలు బోసిపోయాయి. పండగకు మూడు రోజుల ముందు నుంచే భారీగా ప్రజలు సొంతూళ్లకు వెళ్లడంతో ఐటీ జోన్ నిర్మానుష్యంగా మారింది. మాదాపూర్, గచ్చిబౌలి, గౌలిదొడ్డి, రాయదుర్గం, కొండాపూర్, మియాపూర్, చందానగర్‌లో ప్రధాన రహదారులు వెలవెలబోతున్నాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు భారీగా ఊళ్లకు వెళ్లడంతో కంపెనీల గేట్లు సైతం మూతపడ్డాయి. ట్రాఫిక్ లేకపోవడంతో కాలుష్యం కూడా తగ్గిందని అధికారులు చెబుతున్నారు.



సోమవారం నిర్మానుష్యంగా బెజవాడలోని బెంజ్ సర్కిల్ ప్రాంతం

బెజవాడ దారిలో 5 లక్షల మంది రాక

(విజయవాడ, ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పండుగకు హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు రికార్డు స్థాయిలో ప్రజలు ప్రయాణాలు చేశారు. గతేడాదితో పోలిస్తే ఈసారి ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగినట్లు ఆర్టీసీ, టోల్ ప్లాజాల గణాంకాలు చెబుతున్నాయి. గత సంక్రాంతికి ఒక్క హైదరాబాద్ నుంచే మూడు లక్షల మంది రాగా, ఈ సారి ఆ సంఖ్య ఐదు లక్షలకు చేరింది. ఇంత భారీ సంఖ్యలో తరలిరావటానికి పాఠశాలలు, కళాశాలలు, ఉద్యోగులకు 19వ తేదీ వరకు సెలవులు రావడమే కారణంగా తెలుస్తోంది. ఈసారి చాలా మంది సొంత వాహనాలు, క్యాబ్‌లలోనే ప్రయాణించారు. భోగి పండుగకు ముందు వరకు విజయవాడ వైపు 73,240 వాహనాలు అదనంగా వచ్చాయని టోల్‌ప్లాజాల నిర్వాహకులు చెబుతున్నారు. ప్రయాణానికి చాలా మంది ఐటీ ఉద్యోగులు తమ ద్విచక్ర వాహనాలను వినియోగించడం విశేషం.

పోలవరంలో ముందే సంక్రాంతి

నిర్వాసితులకు రూ.996 కోట్ల పరిహారం జమ

- జగన్ జమానాలో ఐదేళ్లూ ఎదురుచూపులే
- అదనంగా 'పది లక్షల' హామీ నీటిమూటలే
- ఆర్భాటం లేకుండా కూటమి సర్కారు విడుదల
- బ్యాంకు మెసేజ్‌లు చూశాక గిరిజనుల హర్షం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత జగన్ ప్రభుత్వంలో ఐదేళ్లూ కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసినా పరిహారం అందలేదు. ఎకరాకు అదనంగా పది లక్షల చెల్లిస్తానన్న జగన్ హామీ కూడా నీటిమూటలైంది. కూటమి ప్రభుత్వం ఇప్పు డు ఎలాంటి ఆర్భాటం, హంగామా లేకుం డా నిధులు విడుదల చేయడంతో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. శుక్రవారం నుంచి తమ బ్యాంకు ఖాతాల్లోకి నష్టపరిహారం సొమ్ము వచ్చి పడుతుండటంతో ఉబ్బితబ్బిబవుతున్నారు. వ్యక్తిగత ఖాతాల్లోకి ఇప్పటి వరకు మొత్తం ఏకంగా రూ.996 కోట్ల మేర జమ కావడంతో గిరిజనులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. సహజంగా ఇంత భారీ మొత్తం పరిహారం గా చెల్లించేటపుడు ప్రభుత్వం పెద్ద కార్యక్రమాన్ని చేపట్టి, పత్రికల్లో ప్రకటనలు ఇస్తుం ది. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆర్భాటాలకు పోలేదు. నిర్వాసితుల బ్యాంకు ఖాతాల్లోకి నిధులు జమ చేసినట్టుగా బ్యాంకులు మెసేజ్‌లు పంపే వరకు విషయం బయటకు తెలియదు. మెసేజ్‌లు చూశాక ఇన్నేళ్లకు తమకు డబ్బులు వచ్చాయంటూ వారు సంబరపడిపోతున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం ఇచ్చిన విషయంపై శనివారం 'ఆంధ్రజ్యోతి'లో 'పరిహారం పండుగ' శీర్షికన కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. ఇది చూసి రాష్ట్ర మంత్రులు ఆశ్చర్యపోయారు. ఇంత మంచి సమాచారాన్ని తమకు ఎందుకు తెలియజేయలేదంటూ ఆర్థిక శాఖపై నిష్ఠూరమాడారు. మంత్రి లోకేశ్ కూడా ఆంధ్రజ్యోతి కథనం చూశాక ఆర్థిక శాఖను ఆరా తీశారు. ఏకంగా రూ.996 కోట్లను సహాయ పునరావాసం కింద లబ్ధిదారులకు చెల్లించామని ఆర్థిక శాఖ వెల్లడించడంతో మంత్రి లోకేశ్ ఒక్కసారిగా ఆశ్చర్యపోయారని ప్రభుత్వ వర్గాలు చెప్పాయి. గత ప్రభుత్వ పనితీరుకూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి పాలనాదక్షతకూ ఈ ఒక్క ఉదంతమే ఉదాహరణగా లోకేశ్ పేర్కొన్నారని చెబుతున్నారు. కాగా నిర్వాసితులకు చెల్లింపుల విషయంపై తమకు సమాచారం ఇవ్వకపోవడంపై జల వనరుల శాఖ గుర్రుగా ఉంది. ఆర్థిక శాఖ తీరుపై చంద్రబాబుకు జల వనరుల శాఖ ప్రత్యేక నోట్‌ను తయారు చేసి పంపినట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం.

నాడు చేతులెత్తేసిన జగన్

గత ప్రభుత్వంలో పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతంలో వరదల సమయంలో ముఖ్యమంత్రి హోదాలో జగన్ పర్యటించారు. ఆ సమయంలో నష్టపరిహారంపై స్పష్టమైన ప్రకటన చేస్తారని బాధితులు ఆశించారు. కానీ కేంద్రం నిధులు ఇస్తేనే తాను పరిహారం చెల్లిస్తానని, లేదంటే తాను చేసేదేమీ లేదన్నట్లుగా జగన్ వ్యాఖ్యలు చేశారు. దీంతో నిర్వాసితులు నిర్ఘాంతపోయారు. రాష్ట్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి చేపట్టిన పనులకు నిర్మాణ సంస్థలకు రూ.174.53 కోట్లు, భూసేకరణకు రూ.235.53 కోట్లు, సహాయ పునరావాసం కోసం రూ.586.73 కోట్లు... మొత్తంగా రూ.996.50 కోట్లను చెల్లించాల్సి ఉంది. మొత్తంగా రూ.821.97 కోట్లను భూసేకరణ, పునరావాస కార్యక్రమాల కింద నిర్వాసితుల ఖాతాలకు శుక్రవారం నుంచి శనివారం దాకా రెండు రోజుల పాటు రాష్ట్ర ఆర్థిక శాఖ జమ చేసింది. దీంతో సంక్రాంతికి ముందే నిర్వాసితుల ఇళ్లలో పండుగ వాతావరణ కనిపిస్తోంది. కాగా గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ సానుభూతిపరులకు నష్టపరిహారం లెక్కలు తక్కువ చేసి చూపింది. ఈ లెక్కలను సరిచేయాలని అధికారులను మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. కోతకు గురైన మొత్తాలూ నిర్వాసితులకు అందితే గిరిజన కుటుంబాల్లో మరింత సంతోషం వస్తుందని నిమ్మల రామానాయుడు చెబుతున్నారు.



ఆవు పేడతో తయారు చేసిన లక్ష పిడకలు

ఉత్సాహంగా భోగి

విశాఖపట్నంలో భోగి పండుగను సోమవారం ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని వైఎంసీఏ వద్ద దేశీయ ఆవుపేడతో తయారుచేసిన లక్ష పిడకలతో భోగిమంట వేశారు. బీజేపీ మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, భారత కిసాన్ సంఘ్ జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్యం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఆత్రేయపురం ప్రధాన కాలువలో రసవత్తరంగా జరుగుతున్న పడవ పోటీలు

ఉత్కంఠగా డ్రాగన్ పడవ పోటీల ఫైనల్స్



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం ప్రధాన కాలువలో మూడు రోజులపాటు నిర్వహించిన డ్రాగన్ పడవ పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. సర్ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా ప్రజలు తరలిరాగా, మంత్రులు, ఎమ్మెల్యేలు పోటీలను ప్రారంభించారు. ఫైనల్ పోటీలను టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. పల్నాడు పాంథర్స్, జంగారెడ్డిగూడెం జెయింట్స్, ఎన్టీఆర్ ఈగల్స్ ఫైనల్స్‌కు చేరుకోగా, పోటీ హోరాహోరీగా సాగింది. జంగారెడ్డిగూడెం, పల్నాడు టీమ్‌లు విజేతలుగా నిలిచాయి. రెండు జట్లకు చెరో రూ.లక్ష, ట్రోఫీలు, సర్టిఫికెట్లు, మెడల్స్‌ను అందజేశారు. తృతీయ స్థానంలో నిలిచిన ఎన్టీఆర్ ఈగల్స్ జట్టుకు రూ.30వేలు ఇచ్చారు. రంగవల్లులు, పతంగుల పోటీల్లో విజేతలకు నగదు బహుమతి అందజేశారు. పోటీలను ఆర్గనైజ్ చేసిన దండు శివను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సత్కరించారు.

- ఆత్రేయపురం, ఆంధ్రజ్యోతి

కుటుంబం ఆంధ్రాలో.. ఉద్యోగం తెలంగాణలో!

11 ఏళ్లుగా పూర్తికాని హోంగార్డుల విభజన.. అల్లాడుతున్న కుటుంబాలు

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : వారి కుటుంబాలు ఆంధ్రాలో ఉంటే వారేమో తెలంగాణలో ఉద్యోగం చేస్తున్నారు. ఒకటీ, రెండూ కాదు ఏకంగా 11 ఏళ్ల నుంచి వారి కుటుంబాలు తీవ్ర మానసిక క్షోభ అనుభవిస్తున్నాయి. రాష్ట్ర విభ జన తర్వాత అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బందిని వారి స్థానికత ఆధారంగా ఆంధ్రా, తెలంగాణాల్లో సర్దుబాటు చేశారు. కానీ హోంగార్డుల విషయంలో మాత్రం ఆంధ్రా, తెలంగాణ ప్రభుత్వాలు ఒక నిర్ణయం తీసుకోకపోవడంతో ఏళ్ల తరబడి వీరి సమస్య పరిష్కారం కాలేదు. దాదాపు 400 మంది ఆంధ్రా స్థానికత కలిగిన హోంగార్డులు తెలంగాణలో పనిచేస్తున్నారు. అంతే సంఖ్యలో తెలంగాణకు చెందిన హోంగార్డులు ఆంధ్రాలో పనిచేస్తున్నారు. వారి కుటుంబాలకు దూరంగా వందల కిలోమీటర్ల దూరంలో విధులు నిర్వహిస్తున్నారు. తమ స్థానికత ఆధారంగా తమను సొంత రాష్ట్రానికి పంపాలని 11 ఏళ్లుగా హోంగార్డులు చేస్తున్న వినతులను ప్రభుత్వాలు పట్టించుకోలేదని... ఆంధ్రా, తెలంగాణలో ప్రజా అనుకూలమైన ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన క్రమంలో ఈ సమస్యకు ముగింపు పలకాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈశ్వరయ్య ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు విన్నవించారు.

ముగ్గుల పోటీల్లో వెయ్యి మంది మహిళలు

కర్నూలు నగరంలోని క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో సోమవారం నిర్వహించిన 'సంక్రాంతి ముగ్గుల పోటీల'కు అనూహ్య స్పందన లభించింది. ఈ పోటీలకు వెయ్యి మందికి పైగా మహిళలు హాజరయ్యారు. పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా ఓపెన్ ప్లాట్, రెండో బహుమతిగా ఈ-బైక్, మూడో బహుమతిగా సోఫా సెట్, నాలుగో బహుమతిగా పావు కిలో వెండి, 30 మందికి కన్సొలేషన్ బహుమతులు, పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి రైస్ కుక్కర్‌ను కనుమ రోజు అందజేస్తారు.

- కర్నూలు కల్చరల్, ఆంధ్రజ్యోతి





కొత్త అల్లుడికి 470 రకాల వంటలతో విందు

గోదావరి జిల్లాలు అంటేనే ఆతిథ్యానికి పెట్టిందిపేరు. కొత్త అల్లుడు వస్తే ఆ సందడే వేరు. తూర్పు గోదావరి జిల్లాతో కలిసి ఉండే... కేంద్ర పాలిత ప్రాంతం యానాంలో సోమవారం కొత్త అల్లుడికి అత్తింటివారు 470 రకాల వంటలతో మెగా విందు ఏర్పాటు చేశారు. యానాం వర్తక సంఘం గౌరవ అధ్యక్షుడు మాజేటి సత్య భాస్కర్ వెంకటేశ్వర్, వెంకటేశ్వరి దంపతుల ద్వితీయ కుమార్తె హరిణ్యకు గత ఏడాది విజయవాడకు చెందిన పారిశ్రామికవేత్త సాకేత్‌తో వివాహం జరిపించారు. కొత్త అల్లుడిని మొదటి సంక్రాంతి పండుగకు ఆహ్వానించి, ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు.470 రకాల వంటలతో అల్లుడు, కుమార్తెకు ఘనంగా విందు ఇచ్చారు.

- యానాం, ఆంధ్రజ్యోతి

కత్తులు దూసిన కోళ్లు... పందెం రాయుళ్ల హుషారుతో పల్లెలు చిందులేశాయి! గోదావరి జిల్లాల నుంచి కోస్తాలోని పలు ప్రాంతాల్లో భారీ సంఖ్యలో వెలిసిన బరులు కోళ్ల యుద్ధానికి వేదికలయ్యాయి. మూడు రోజుల ముచ్చటైన పండుగలో తొలిరోజు భోగినాడే సుమారు రూ.300 కోట్ల మేరకు కరెన్సీ కట్టలు పందేలొడ్డాయి. గుండాట, లోనబయట, పేకాటలతో 'భోగి' సాగిపోయింది!!


కృష్ణా జిల్లాలోని అంపాపురంలో కోడి కాలికి కడుతున్న కత్తి

కత్తి కడతారా బాబూ!

ఎన్నడూ లేని విధంగా ఈసారి వందల చోట్ల కోడి పందేలు ఏర్పాటుకావడంతో కొన్నిచోట్ల పందేలకు అవసరమైన కోడి జాతులు రాకపోవడంతో పందెం రాయుళ్లు నిరాశకు గురయ్యారు. అలాగే కోళ్లకు కత్తులు కట్టేవారు కూడా దొరకకపోవడంతో మరిన్ని ఇబ్బందులు పడ్డారు. ఈ స్థాయిలో ఎప్పుడూ బరులు లేకపోవడంతో కత్తులు కట్టే వారికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది.




విజయవాడలో ఏర్పాటు చేసిన ఓ బరిలో కాలుదువ్విన కోళ్లు



పశ్చిమగోదావరి జిల్లా పెద అమిరం గ్రామంలో డింకీ కోడిపందేలు ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, గంటా శ్రీనివాసరావు


విజయవాడలోని రామవరప్పాడు రింగ్ సమీపంలో బరుల వద్ద జనం


కోడి పందేలుజరిగే ప్రాంతం వద్ద డబ్బు కట్టలతో..


కృష్ణా జిల్లా ఉప్పలూరులో బరుల వద్ద ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్లు


భీమవరం రూరల్ మండలం గొల్లవానితిప్ప రోడ్డులో ఏర్పాటుచేసిన బరివద్ద కోడి పకోడి దుకాణం


గొల్లవానితిప్ప రోడ్డు వద్ద ఏర్పాటైన బరి వద్ద పార్కింగ్ చేసిన కార్లు


ఏలూరు జిల్లా భీమడోలు మండలం గుండుగొలనులో పేకముక్కలతో లోపల- బయట జూదం


కృష్ణా జిల్లా ఉప్పలూరులో సోమవారం రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుగులో సాగుతున్న కోడి పందేలు

కో... అంటే కోట్లు!

గోదావరి సహా పలు జిల్లాల్లో భారీగా కోడి పందేల జోరు

పందెం రాయుళ్ల హుషారు.. తొలిరోజే రూ.300 కోట్ల పందేలు

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్)

తెలుగు వారి అతి పెద్ద మూడు రోజుల పండుగ సంక్రాంతిలో తొలిరోజైన సోమవారం భోగి.. కోడి పందేలు, గుండాట, పేకాట, మందు, విందు, చిందులతో వైభోగంగా సాగిపోయింది. ఉమ్మడి గోదావరి జిల్లాలతోపాటు ఉమ్మడి గుంటూరు, కృష్ణాజిల్లాల్లోనూ కోడి పందేలు జోరుగా సాగాయి. మూడు రోజుల పండుగలో తొలిరోజే సుమారు రూ.300 కోట్ల మేరకు పందెం రాయుళ్లు పందేలొడ్డడం గమనార్హం. గోదావరి జిల్లాల్లో వేసిన భారీ బరులను వీక్షించేందుకు లక్షల సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. పలు బరుల్లో పలువురు ప్రజాప్రతినిధులు సైతం సందడి చేశారు. కోడి పందేలను వీక్షించిన వారు కొంద రైతే.. నేరుగా కోళ్లతో పందేలకు దిగిన వారు మరికొందరు! వెరసి భోగి వైభోగంగా జరిగిపోయింది!!

పశ్చిమలో 100 కోట్లు!

పశ్చిమగోదావరి జిల్లాలో రూ.కోట్లు చేతులు మారాయి. భీమవరం, ఉండి మండలాల్లో ఒక్కొక్క కోడి పందెం రూ.5 లక్షల వరకు వెళ్లింది. జిల్లా వ్యాప్తంగా భోగి పండుగ రోజే పందెం రాయుళ్లు రూ.100 కోట్ల వరకు పందేలు కాసినట్టు అంచనా. పెదఅమిరం, సీసలి, అయిభీమవరం, తాడేరు, కలగంపూడి, గొల్లవానితిప్ప, తాడేపల్లిగూడెంలో పెద్ద బరులను నిర్వహించారు. కలగంపూడిలో పోటీ పోటీగా బరులు ఏర్పాటు చేశారు. తాడేపల్లిగూడెంలో ముసుగు పందెం రూ.25 లక్షల వరకు పలికింది. ముసుగు పందెం అంటే ముందుగా కోళ్లను చూపించరు. పందెం ఖరారైన తర్వాత కోళ్లను బరిలోకి దింపుతారు. ఇక గుండాట, కోత ముక్క ఆటలు జోరుగా సాగాయి. హాస్య నటుడు కృష్ణ భగవాన్ పోటీలను ఆసక్తిగా తిలకించారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఊరూరా బరులు వెలిశాయి. పెద అమిరంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావులు సంప్రదాయ 'డింకీ పందేల'ను స్వయంగా ప్రారంభించారు.

ఉమ్మడి తూర్పులో

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పందేల జాతర ఘనంగా జరిగింది. తొలిరోజు కోడి పందాలు, గుండాట, కోతాటతో కలిపి రూ.175 కోట్లకుపైగా వ్యాపారం సాగినట్టు సమాచారం. బరులు ఏర్పాటు చేసిన చోట టెంట్లు వేశారు. విందు, వినోదాల మధ్య వీక్షకులు కేరింతలు కొట్టారు. బరుల్లో పందెం కోళ్ల కాళ్లు దువ్వాయి. భారీ టెంట్లు, షామియానాలు, మైక్‌లు, ఎల్ఈడీ స్క్రీన్లు, రన్నింగ్ కామెంటరీలు, పసందైన భోజనాలు పందెం రాయుళ్లను ఆకట్టుకున్నాయి. కోనసీమ జిల్లాలో 430 బరుల్లో పందేలు సాగాయి. కోడి పందేలు ఐ.పోలవరం మండలం మురమళ్లలో ఏకంగా రూ.5 కోట్లు దాటినట్టు తెలిసింది. కాకినాడ జిల్లాలో 410, తూర్పుగోదావరి జిల్లాలో 300 బరులు ఏర్పాటు చేశారు. రంపచోడవరం ఏజెన్సీలో సైతం పెద్దసంఖ్యలో కోడి పందాలు, గుండాటలు జరిగాయి. బరుల వద్దే మద్యం అమ్మకాల జోరు కొనసాగింది.

మోదీ సంక్రాంతి సంబరాల్లో చిరంజీవి షైన్!



ఢిల్లీలోని కిషన్‌రెడ్డి ఇంట్లో వేడుకలకు ప్రధాని హాజరు

చిరంజీవికి ప్రాధాన్యం.. తొలుత ఆయనతోనే కరచాలనం

ఆద్యంతం తనవెంటే తిప్పుకొన్న ప్రధాని

న్యూఢిల్లీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అధికార నివాసంలో సంక్రాంతి సంబురాలు కన్నుల పండుగగా జరిగాయి. వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రధానమంత్రి మోదీ హాజరయ్యారు. కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి పాల్గొనడం విశేషమైతే, ఆద్యంతం ఆయనకు మోదీ ప్రాధాన్యమివ్వడం మరీ విశేషం! భోగి సందర్భంగా సోమవారం సాయంత్రం తమ నివాసానికి వచ్చిన మోదీకి చిరంజీవితో కలిసి కిషన్‌రెడ్డి దంపతులు స్వాగతం పలికారు. మోదీ, తొలుత చిరంజీవితో కరచాలనం చేశారు. వేడుకల్లో భాగంగా భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, వేదికపైన జ్యోతి ప్రజ్వలనం, సాంస్కృతిక కార్యక్రమాల వీక్షణ.. ఇలా ప్రతిదశలోనూ చిరంజీవిని మోదీ తనవెంట తిప్పుకొన్నారు. సంబురాల్లో భాగంగా మోదీ, మంత్రోచ్చారణల మధ్య భోగి మంటలను వెలిగించారు. గంగిరెద్దులకు అరటిపండ్లు తినిపించి, నూతన వస్త్రాలు కప్పారు. అనంతరం వేదికపైకి చేరుకున్న మోదీ, జ్యోతి వెలిగించి లాంఛనంగా సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. ప్రధానితో పాటు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, చిరంజీవి, కిషన్‌రెడ్డి, డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు వేదికపైకి చేరుకుని జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్నారు. ప్రముఖ గాయని సునీత తన పాటలతో అలరించారు. సంక్రాంతి సంప్రదాయాలను, తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా దీపికా రెడ్డి బృందం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను మోదీ వీక్షించారు. "దేశమంతటా ప్రజలు సంక్రాంతిని, పొంగల్‌ను ఎంతో ఉత్సాహంగా జరుపుకొంటారు. ఇది మన సంస్కృతి, వ్యవసాయ సంప్రదాయాల్లో అంతర్భాగమైన వేడుక" అని మోదీ ఆ తర్వాత ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.


అంపాపురంలో కోడితో మహిళ

పోలీసుల మాట ఇదీ!

రాష్ట్రంలో కోడి పందేలు, రూ.లక్షల్లో పేకాట నిర్వహిస్తున్న విషయంపై పోలీసులకు సమాచారం అందినా మౌనం పాటించారు. దీనిని బట్టి వారిపై రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయన్న విషయం స్పష్టమైందని పలువురు వ్యాఖ్యానించారు. అయితే.. గోదావరి జిల్లాల్లో 350 మంది పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్టు పోలీసు వర్గాలు చెప్పాయి. 18 ప్రాంతాల్లో కోడి పందేల బరులు ధ్వంసం చేసినట్లు ఏలూరు రేంజ్ పోలీసులు చెబుతున్నారు. సోమవారం నాటికి 1800 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట ప్రాంతాల్లో డ్రోన్లతో పర్యవేక్షించి కోళ్ల పందేల వేదికలు ధ్వంసం చేసినట్లు ఏలూరు రేంజ్‌కు చెందిన ఒక పోలీసు అధికారి తెలిపారు.


కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం లొల్లలో బరి వద్ద విజేతల కోసం సిద్ధం చేసిన బుల్లెట్లు


రామవరప్పాడు రింగ్ సమీపంలోని బరుల వద్ద కోళ్లతో యువకులు

పులివెందులలో తొలిసారి

కడప జిల్లా పులివెందులలో తొలిసారి కోడిపందేల జోరు కనిపించింది. పందేల్లో తొలి రోజే రూ.2 కోట్లు దాటినట్లు సమాచారం. పలువురు టీడీపీ నాయకులు వీటి నిర్వహణకు మక్కువ చూపారు. మొత్తంగా పులివెందులలో ఎనిమిది చోట్ల భారీగా కోడిపందేలు నిర్వహించారు. పార్టీలకతీతంగా వీటిలో పాల్గొనడం మరో విశేషం. లింగాల మండలం దొండ్లవాగులో రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల మేర పందేలు జరిగినట్లు తెలిసింది. పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి బరుల వద్దకు వెళ్లి పరిశీలించినట్లు తెలిసింది.

- ప్రకాశం జిల్లావ్యాప్తంగా పలుచోట్ల కోడి పందేలు హుషారుగా సాగాయి. కలెక్టర్, ఎస్పీ హెచ్చరికలు చేసినప్పటికీ ఎవరి పని వారిదే అన్నట్లుగా నిర్వాహకులు వ్యవహరించారు. సంతనూతలపాడు చిన్న చెరువులో భారీ బరి ఏర్పాటు చేసి 200 కోళ్లతో పందేలు వేశారు. ఇక్కడ పై పందేలే రూ.లక్షల్లో జరిగినట్లు తెలిసింది.
- ఏలూరు జిల్లాలో కోడి పందేలు ధూమ్‌ధామ్‌గా ప్రారంభమయ్యాయి. 7 నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన బరుల్లో రూ.లక్షలు చేతులు మారాయి. పేకాట జోరుగా సాగింది. గుండాటకు జనం ఎగబడ్డారు. ఒక్కొక్క పందెం రూ.ఐదు వేల నుంచి రూ.మూడున్నర లక్షల వరకు సాగింది.
- ఉమ్మడి కృష్ణా జిల్లాలో కోడిపందేలు విచ్చలవిడిగా సాగాయి. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో గ్రామీణ ప్రాంతాలతో పాటు విజయవాడ నగరంలోను బరులు ఏర్పాటు చేశారు. పటమటలంక, కబేళా ప్రాంతాల్లో ఈ ఏడాది తొలిసారి బరులు ఏర్పాటు కావడం గమనార్హం. జక్కంపూడిలోని పాములకాల్వ వద్ద టీడీపీ నాయకుడు ఏర్పాటు చేసిన బరిని ఎంపీ కేశినేని చిన్ని ప్రారంభించారు. కృష్ణా జిల్లాలో అతిపెద్ద బరిగా ఉన్న అంపాపురంలో రూ.10 కోట్లకు పైబడి పందేలు సాగాయి. ఇక్కడ పందేలను బట్టి బరులు ఏర్పాటు చేశారు. రూ.10 లక్షలు ఆ పైబడిన పందేల కోసం రెండు పెద్దబరులను ఏర్పాటు చేశారు. తర్వాత రూ. లక్ష నుంచి రూ.5 లక్షల పందేల కోసం ఐదు చిన్నబరులను ఏర్పాటు చేశారు.
- బాపట్ల జిల్లాలో సోమవారం ఒక్క రోజే కోడి పందేలు, పేకాట రూపంలో రూ.5 కోట్ల వరకు చేతులు మారినట్లు అంచనా. చెరుకుపల్లి మండల పరిధిలోని తూర్పుపాలెం బరిలో కోడి పందేలను రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వీక్షించారు. తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో పందెం రాయుళ్లు తూర్పుపాలెం బరి వద్దకు వచ్చారు.

బాపట్ల బరుల్లో ప్రవేశం కోసం టోకెన్ల జారీ చేపట్టి అనుమతి లేకుండా పేకాట శిబిరాల వద్దకు వెళ్లే అవకాశం లేకుండా చేశారు. పేకాటకు ఒక్కో గేమ్‌కు రూ.5 లక్షల చొప్పున పెట్టి ఆడగా, కోడి పందేల విషయంలో లక్ష నుంచి రూ.ఐదు లక్షల వరకు పందేలు పెట్టారు.


ఏలూరు జిల్లా భీమడోలు మండలం గుండుగొలనులో కోడి పందేలు

పందేలు-పదనిసలు!

- తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన సతీశ్ తొమ్మిది పందేల్లో పాల్గొని ఆరు గెలిచి, బుల్లెట్‌ను సొంతం చేసుకున్నారు.
- పశ్చిమ గోదావరి జిల్లాలో ద్విచక్ర వాహనాలు, పసిడి నాణేల ఆఫర్లు పందెం రాయుళ్లను ఆకట్టుకున్నాయి.
- యలమంచిలి, వీరవాసరం మండలం నవుడూరులో విందు భోజనాలు ఏర్పాటు చేశారు.
- కాకినాడలోని కరప మండలంలో రూ.36 లక్షలతో బరి గెలుచుకున్న ఓ నిర్వాహకుడు తొలిరోజు రూ.10 కోట్లకుపైగా పందేలు నిర్వహించారు.
- కాకినాడరూరల్, కరప మండలాల్లో రూ.25 కోట్ల వరకు కోడిపందేలు, గుండాట వ్యాపారం జరిగింది.
- బరుల వద్ద ఫైనాన్స్ వ్యాపారులు భారీగా మోహరించారు. తక్షణం అప్పులు ఇచ్చేందుకు వీలుగా నోట్ల కట్టలతో సిద్ధమయ్యారు.
- పిఠాపురం నియోజకవర్గంలో 60 చోట్ల పందేలు జరిగాయి. టీడీపీ, జనసేన నేతలు పోటాపోటీగా బరులు నిర్వహించారు.
- ఏలూరు జిల్లాలో కోడి పందేల్లో పాల్గొన్న వారికి బిర్యానీ ఇచ్చేందుకు పాస్‌లు జారీ చేశారు.
- కోడి పందేలను తిలకించేందుకు వచ్చిన మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.
- కృష్ణా జిల్లా గన్నవరం పరిధిలో ప్రజా ప్రతినిధుల ఫొటోలతోపాటు కోళ్లను వాటి యజమానులు ముద్దాడే ఫొటోలతో 'మా సంక్రాంతి చాంపియన్' అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.
- కృష్ణాజిల్లాలో క్యాసినోను రహస్యంగా నిర్వహించారు. క్యాసినో కింగ్‌గా పేరున్న చీకోటి ప్రవీణ్ అనుచరులు ఈ శిబిరాలను నిర్వహించినట్టు సమాచారం.
- ఫ్లడ్ లైట్ల వెలుగులో రేయింబవళ్లు జరిగే పందేలను ప్రత్యేక డ్రోన్లు, అత్యాధునిక సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నారు. అతిథులు, బెట్టింగ్ రాయుళ్ల, కోళ్లు తెచ్చిన వారికి స్థాయిని బట్టి అతిథి మర్యాదల్లో కొత్త కొత్త రుచులను పరిచయం చేస్తున్నారు.




స్థానిక పిల్లలతో కలిసి దేవాన్ష్ ఆటలు, పిల్లల ఆటల పోటీలను తిలకిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా భువనేశ్వరి, వసుంధర తదితరులు

స్వగ్రామంలో బాబు బిజీ

- ఓవైపు సంక్రాంతి సంబరాలు.. మరోవైపు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- నారావారిపల్లెలో మహిళలు, పిల్లలకు వివిధ పోటీలు
- ప్రధానాకర్షణగా దేవాన్ష్.. పిల్లలతో కలిసి సందడి
- ఎడ్లబండిపై ఊరంతా తిరిగిన సీఎం మనవడు
- తరలివచ్చిన నందమూరి రామకృష్ణ, బాలయ్య భార్య, చిన్న కుమార్తె, అల్లుడు

తిరుపతి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం తన స్వగ్రామమైన తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లెలో బిజీబిజీగా గడిపారు. ఓవైపు కుటుంబ సభ్యులతో కలసి సంక్రాంతి సంబరాల్లో పాల్గొంటూనే.. మరో వైపు సొంతూరి అభివృద్ధికి పలు శంకుస్థాపనలు చేశారు. పండుగ సందర్భంగా చంద్రబాబు, లోకేశ్ దంపతులు గ్రామంలో మహిళలకు, పిల్లలకు ఏర్పాటు చేసిన పలు రకాల పోటీలను తిలకించి విజేతలకు బహుమతులు అందజేశారు. గతేడాది సోదరుడు రామ్మూర్తినాయుడి మృతితో ఈ పర్యాయం సంక్రాంతికి చంద్రబాబు కుటుంబం స్వగ్రామానికి వస్తుందో రాదోనని అందరూ అనుకున్నారు. అయితే పండుగ జరుపుకొన్నా జరుపుకోకపోయినా ఆనవాయితీ ప్రకారం వచ్చారు. చంద్రబాబు, లోకేశ్ దంపతులతో పాటు ఎన్టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ, నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర, వారి చిన్న కుమార్తె తేజస్విని, అల్లుడు ఎంపీ భరత్‌లతో పాటు సన్నిహిత బంధువులు వచ్చారు.

పోటీలు.. విజేతలకు బహుమతులు

నారావారిపల్లెలోని టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో సోమవారం ఉదయం ముగ్గుల పోటీలు నిర్వహించగా పరిసర గ్రామాలకు చెందిన మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పోటీలను చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి, ఆమె తల్లి వసుంధర తదితరులు పరిశీలించారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన మహిళలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న అందరికీ ప్రోత్సాహకంగా ఒక్కొక్కరికి రూ.10,116 చొప్పున నగదు బహుమతి అందించారు. అనంతరం పిల్లలకు బెలూన్ బ్లాస్టింగ్, గన్నీ బ్యాగ్ రేస్, మ్యూజికల్ ఛైర్స్, లెమన్ అండ్ స్పూన్, పొటాటో గ్యాదరింగ్ వంటి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మంత్రి లోకేశ్ కొంతసేపు యాంకర్‌గా వ్యవహరించి పిల్లలను ఉత్సాహపరిచారు.



సంక్రాంతి సంబరాల్లో చిన్నారులతో సీఎం దంపతుల గ్రూప్ ఫొటో

ఉత్సాహంగా పాల్గొన్న పిల్లలకు బహుమతులుఅందజేశారు. సంబరాల్లో చంద్రబాబు మనవడు దేవాన్ష్ ప్రధానాకర్షణగా మారారు. నారావారిపల్లెతోపాటు పరిసరగ్రామాలకు చెందిన పిల్లలతో కలసి కిందనే కూర్చుని చిట్‌చాట్ చేశారు. వారి పేర్లు, అభిరుచులు తెలుసుకున్నారు. అలాగే తన ఇష్టాలు కూడా వారితో చెప్పారు. పిల్లలతో కొంతసేపు ఫుట్‌బాల్ ఆడారు. అందరికీ షేక్ హ్యాండ్ ఇచ్చి మాట్లాడారు. పిల్లల ఆటల పోటీల్లో తానుకూడా పాల్గొన్నారు. బెలూన్ బ్లాస్టింగ్, గన్నీ బ్యాగ్ రేస్ పోటీల్లో పాల్గొన్న దేవాన్ష్ గన్నీ బ్యాగ్ రేసులో కన్సొలేషన్ బహుమతి గెలుచుకున్నారు. దేవాన్ష్ సాయంత్రం బంధువుల పిల్లలతోకలసి అలంకరించిన ఎద్దులబండిపై గ్రామంలో అటూ ఇటూ తిరుగుతూ అందరినీ ఆకట్టుకున్నారు.

బిజీ షెడ్యూల్లోనూ ప్రజల నుంచీ అర్జీలు..

అటు సంబరాల్లో, ఇటు అభివృద్ధి కార్యకలాపాలతో క్షణం తీరిక లేకుండా ఉన్నప్పటికీ చంద్రబాబు తన కోసం వచ్చిన సామాన్య ప్రజల నుంచీ అర్జీలు స్వీకరించారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్, డీఐజీ శేముషీ బాజ్‌పాయ్, మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, గాలి భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు పునాది రాళ్లు

ఇంకోవైపు.. స్వగ్రామం అభివృద్ధిపై చంద్రబాబు దృష్టి సారించారు. అందులో భాగంగా రేవాండ్స్ కంపెనీ ద్వారా నారావారిపల్లె రైతులు బలరాం నాయుడు, జ్యోతిలకు డ్రిప్ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏ ఊరి పరిసరాల్లోని మూడు సచివాలయాల పరిధిలో అర్హులైన రైతులను ఏపీ సూక్ష్మ సాగునీటి పథకం (ఏపీఎంఐపీ) పరిధిలోకి చేర్చాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆదేశించారు. అలాగే రూ.4.27 కోట్లతో 33 కేవీ ఇన్‌డోర్ సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సబ్ స్టేషన్ నిర్మాణం త్వరగా పూర్తి చేయడంతో పాటు నారావారిపల్లె పరిధిలో 2 వేల ఇళ్లకు సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను, డిస్కమ్ సీఎండీ సంతోషరావును ఆదేశించారు.

1 ఉపాధి హామీ పథకం కింద రూ.3.21 కోట్లతో 26 అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పొరుగునే వున్న ఎ.రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్టేట్ ఆఫ్ ఆర్ట్ కింద ఆదర్శ పాఠశాలగా అభివృద్ధి చేసేందుకు శ్రీసిటీ దత్తత తీసుకునే కార్యక్రమానికి సీఎం శ్రీకారం చుట్టారు. రూ.1.10 కోట్ల వ్యయంతో కంప్యూటర్ ల్యాబ్, ఐఎఫ్‌పీ ప్యానెల్స్, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, ఏఐ రోబోటిక్ ల్యాబ్, క్రీడా సామగ్రి, ఇతర మౌలిక సదుపాయాల కల్పన పనులకు శంకుస్థాపన చేశారు.

1 కుప్పంలో 480 అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, పిల్లల సంక్షేమానికి పైలట్ ప్రాజెక్టు అమలు చేస్తున్న కేర్ అండ్ గ్రో సంస్థతో అదే ప్రాజెక్టును తిరుపతి జిల్లా వ్యాప్తంగా అమలు చేసేలా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆయన సమక్షంలో ఒప్పందంపై సంతకాలు చేసింది. నారావారిపల్లెలోని 8 కేంద్రాలను తొలుత పైలట్ ప్రాజెక్టు కింద అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

1 ఈజీ మార్ట్ సంస్థ- డీఆర్‌డీఏ వెలుగు మధ్య కూడా ఒప్పందం కుదిరింది. దీని ద్వారా నారావారిపల్లె పరిసరాల్లో గ్రామీణ మహిళలు ఇంటివద్ద నుంచే కిరాణా షాపులకు వస్తువులు సరఫరా చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందే కార్యక్రమం అమలుకు శ్రీకారం చుట్టారు.

1 నారావారిపల్లె చుట్టూ ఐదు గ్రామాల పరిధిలోని 200 మంది మామిడి రైతులతో ఎఫ్‌పీవో ఏర్పాటుకు సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలను సీఎం రైతులకు అందజేశారు.

1 నారావారిపల్లె పరిసరాల్లోని 15 మంది ఎస్సీ డ్వాక్రా సంఘాల మహిళలకు డీఆర్‌డీఏ, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఈ-ఆటోలు అందజేశారు.

తొక్కిసలాట దురదృష్టకరం

- భవిష్యత్‌లో ఇలాంటివి జరక్కుండా చర్యలు
- అది తప్ప మిగతా ఏర్పాట్లన్నీ బాగున్నాయ్
- టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడి
- దళారీ వ్యవస్థను కట్టడిచేశాం: ఈవో



సోమవారం తిరుమల అన్నమయ్య భవనంలో మీడియాతో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు. చిత్రంలో ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీ సందర్భంగా ఈ నెల 8న చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటన అత్యంత దురదృష్టకరమని టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. ఇకపై ఇలాంటివి జరగకుండా తగిన ఏర్పాట్లు చేసుకుంటామన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో సోమవారం ఆయన టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి మీడియాతో మాట్లాడారు. తిరుమల అంటే హిందువుల మనోభావాలకు సంబంధించిన విషయమని, తిరుమల గురించి రాసేటప్పుడు ఒకటికి రెండుసార్లు ఆలోచించి, విచారించి, నిర్ధారించి రాయాలని కోరారు. సోషల్ మీడియా ఉంది కదా అని ఇష్టం వచ్చినట్టు రాయడం మంచిది కాదన్నారు. తిరుపతిలో జరిగిన ఘటన తప్ప మిగిలిన ఏర్పాట్లన్నీ బాగున్నాయని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులూ లేకుండా భక్తులు శ్రీవారిని దర్శించుకుంటున్నారన్నారు. అధికారుల శ్రమను మనం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. దయచేసి జరిగినవన్నీ ఈ రోజుతో వదిలేసి ఇకపై దేవుడి గురించి ప్రచారం చేయాలని అభ్యర్థించారు. గత ఆరు నెలలుగా భక్తులకు నాణ్యమైన అన్నప్రసాదాలు, లడ్డూప్రసాదాలు, వసతి తదితర సేవలు అందిస్తున్నామని ఈవో చెప్పారు. దళారీ వ్యవస్థను కూడా కట్టడి చేశామని, విజన్ డాక్యుమెంట్‌ను కూడా రూపొందిస్తున్నామన్నారు. తొక్కిసలాట అంశంపై న్యాయ విచారణ జరుగుతోందని, అందులో పూర్తి విషయాలు వెలువడతాయని చెప్పారు. తిరుమలలో వసతి ఎవరికి కేటాయించాలో తెలియని అగమ్య పరిస్థితి నుంచి మరింత పూర్తి పారదర్శకంగా వసతి కేటాయిస్తున్నామని వెంకయ్యచౌదరి తెలిపారు. రాబోయే రోజుల్లో వసతి కేటాయింపులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా భక్తుల వాట్సాప్‌కే పూర్తి సమాచారం, రిజిస్ట్రేషన్ చేసే ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులకు త్వరగా దర్శనం చేయించేలా విచక్షణ కోటాను, మానవ జోక్యాలను తగ్గించామని చెప్పారు.

మృతుల కుటుంబాలకు నేరుగా ఆర్థిక సాయం: ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలను ఆదుకునేందుకు నేరుగా వారి ఇళ్లకే వెళ్లి ఆర్థిక సాయం అందజేశామని టీటీడీ బోర్డు సభ్యుడు, శ్రీసత్యసాయి జిల్లా మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. గత ప్రభుత్వంలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకొన్నా స్పందించిన దాఖలాలులేవన్నారు. విశాఖకుచెందిన శాంతి, లావణ్య కుటుంబం, రజిని, పెదబొడ్డేపల్లిలో నాయుడు బాబు కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున అందజేశామని తెలిపారు. హోంమంత్రి అనిత, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి బాధితులను పరామర్శించామన్నారు.బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు తనవంతుగా టీటీడీ చైర్మన్‌కు రూ.3 లక్షలు అందించానని చెప్పారు.

డాకింగ్‌పై సందేహాలు..!

- ఉపగ్రహాలు డాకింగ్‌కు అనుకూలంగా లేవు
- దూరం ఊహించిన దానికంటే ఎక్కువగా ఉంది
- ఇస్రో అంచనాలు తప్పాయి అంటున్న నిపుణులు

బెంగళూరు, జనవరి 13: అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను అనుసంధానించడం కోసం రూ.370 కోట్ల వ్యయంతో చేపట్టిన స్పేడెక్స్ మిషన్‌లో ముందడుగు వేసినట్టే కనిపించిన ఇస్రో మరోసారి వెనక్కు తగ్గింది..! శనివారం సాయంత్రం ఎస్‌డీఎక్స్01, ఎస్‌డీఎక్స్02 ఉపగ్రహాల మధ్య దూరం 230 మీటర్లు ఉంది. తర్వాత ఆ దూరాన్ని క్రమంగా తగ్గించుకుంటూ వచ్చిన ఇస్రో.. ఆదివారం ఉదయానికల్లా దాన్ని 3 మీటర్లకు తగ్గించడంలో విజయం సాధించింది. కానీ.. ఆ తర్వాత ఉపగ్రహాల మధ్య దూరాన్ని తగ్గించే ట్రయల్ ముగిసిందని, వాటిని సురక్షిత దూరానికి తరలించామని, ఈ డేటాను విశ్లేషించిన తర్వాత డాకింగ్ చేపడతామని ఎక్స్‌లో ట్వీట్ చేసింది. కానీ ఎప్పుడు చేపడతామన్న విషయం మాత్రం వెల్లడించలేదు. ఉపగ్రహాలను చేరువ చేయడం ఉత్సాహాన్ని రేపినా.. మళ్లీ వాటిని సురక్షిత దూరానికి తరలించడం పలు సందేహాలకు తావిస్తోంది. దీనిపై పలువురు నిపుణులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరేమో ఈ రెండు ఉపగ్రహాలు డాకింగ్‌కు అనుకూలంగా లేవని అంటుంటే.. మరికొందరు ఇస్రో ఊహించిన, ప్రకటించిన దానికంటే రెండు స్పేస్‌క్రాఫ్ట్‌ల మధ్య దూరం చాలా ఎక్కువగా ఉందని చెబుతున్నారు. ఇస్రో శాస్త్రవేత్తల అంచనాలు, లెక్కలు తప్పాయని మరికొందరు విమర్శిస్తున్నారు. స్పేస్ డాకింగ్ కోసం ఇస్రో గత నెల 30న స్పేడెక్స్ మిషన్ ద్వారా జంట ఉపగ్రహాలను భూ కక్ష్యలోకి చేర్చింది. వాస్తవానికి.. ఈ నెల 7న వాటిని డాకింగ్ చేస్తామని ప్రకటించింది. తర్వాత దాన్ని ఈ నెల 9కి వాయిదా వేసినా కుదర్లేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 12న రెండు ఉపగ్రహాలను మూడు మీటర్లకు చేరువ చేసే ట్రయల్ రన్ చేపట్టింది. అత్యంత చేరువగా తీసుకొచ్చి వాటిని మళ్లీ సురక్షిత దూరానికి తరలించింది. దీంతో డాకింగ్‌కు మరోసారి బ్రేక్ పడింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.